# చింతల్నార్

బాసగూడా మారణహోమం

## విప్లవ జనతన సర్కార్ నేపథ్యం

పాణి

విప్లవ రచయితల సంఘం

# చింతల్నార్

బాసగూడా మారణహోమం- విప్లవ జనతన సర్కార్ నేపథ్యం

**పాణి**

**విరసం ప్రచురణ**

**20, సెప్టెంబర్, 2012**

**కవర్ డిజైన్: జుగాష్‌విలి**

₹ : 40/-

**ప్రతులకు**

దిశ పుస్తక కేంద్రం, చిక్కడపల్లి, హైదరాబాద్

సహచర బుక్ మార్క్, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్.

నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్.

ముద్రణ

చరిత ఇంప్రెషన్స్, ఆజమాబాద్,

హైదరాబాద్ - 500 020

# ముందుగా..

... ఈ మాట చెప్పాలి. బాసగూడా మానవహననం ఇటీవలి విప్లవోద్యమ చరిత్రలో అది పెద్ద దారుణం. ఎన్నో బూటకపు ఎన్‌కౌంటర్ హత్యాకాండలను చూసిన తెలుగు సమాజానికి ఇది అతి దగ్గరిగా, ఇక్కడ జరిగినట్లే అనిపించే దుర్మార్గం. కానీ ఇలాంటి ఘటన బహుశా మనకు ఇంత వరకు అనుభవంలోకి రాలేదేమో.

శ్రీకాకుళ పోరాటంపై, ఇంద్రవెల్లి సభపై జరిగిన మూకుమ్మడి రాజ్య దౌర్జన్యాలు మనకు తెలుసు. ఎంత మంది చనిపోయారో లెక్క తేలని హత్యాకాండలు అవి. అవన్నీ స్థానిక పెత్తందారీ శక్తులు, రాష్ట్ర ప్రభుత్వం కనుసన్నల్లో పోలీసులు సాగించిన దుర్మార్గాలు. కాని బాసగూడా ఘటన వెనుక నేరుగా భారత రాజ్యం ఉంది. కేంద్ర ప్రభుత్వం రచించిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ అనే యుద్ధతంత్రం ఉన్నది. ఏకంగా అమెరికా మార్గదర్శకత్వం ఉన్నది. అందుకే దేశవ్యాప్తంగా ఈ ఘటనపై నిరసన స్వరం వినిపించింది. ఎందరెందరో మేధావులు, రచయితలు, ప్రజాస్వామికవాదులు, పౌర, మానవ హక్కుల ఉద్యమకారులు ఈ దుర్మార్గం భారత రాజ్య స్వభావానికి సంకేతం అన్నారు.

ఈ ఘటనలో ఆరుగురు పిల్లలు కూడా చనిపోయారు.

భారత ప్రభుత్వం రాజ్యాంగం సాక్షిగా పని చేయడం మానేసి పూర్తిగా హింస మీద అనధికారిక ప్రమాణం చేసి కొనసాగుతున్నది. ఆ హింస ఎవరిమీదైనా కావచ్చు. ఏ ప్రాంతంలోనైనా కావచ్చు. అట్టడుగు ప్రజల మీద సామాజిక వ్యవస్థల అణచివేతతోపాటు రాజ్యహింస దారుణంగా కొనసాగుతున్నది.

దండకారణ్య ఆదివాసులపై దశాబ్దాలుగా సాగుతున్న అణచివేత మూడేళ్లుగా యుద్ధంగా మారిపోయింది. బాసగూడా ఒక యుద్ధకాండ. ఆదివాసులు కూడా ప్రతియుద్ధంలో తలమునకలై ఉన్నారు. భారత సైన్యాన్ని ఎదుర్కోడానికి ప్రజా గెరిల్లా సైన్యంగా, ప్రజా మిలీషియాగా, భూంకాల్ సైన్యంగా అవతరించారు.

అయితే బాసగూడాలో నిరాయుధులను వందలాది మంది సీఆర్పీఎఫ్ బలగాలు చుట్టుముట్టి కాల్చేశాయి. అప్పుడు ఆదివాసులు యుద్ధ సన్నాహాల్లో లేరు. యుద్ధ వ్యూహ రచనలో లేరు. ఉత్పత్తి గురించిన చర్చలో ఉన్నారు. విప్లవకారుల సహచర్యం వల్ల, పరంపరాగతమైన వివేకం వల్ల వాళ్లకు రెండు మాత్రమే తెలుసు. శ్రమ చేయడం,

తిరుగుబాటు చేయడం. మార్క్సిస్టుల భాషలో చెప్పాలంటే.. ఉత్పత్తిలో పాల్గొనడం, ఉత్పత్తిదాయకమైన వర్గపోరాటంలో, విప్లవంలో పాల్గొనడం. అందుకే చుట్టుముట్టి కాల్చేశారు.

ఈ విషాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని మానవ హక్కుల వేదిక, ఓపీడీఆర్‌తో సహా దేశవ్యాప్తంగా పని చేస్తున్న పౌర హక్కుల సంస్థల ప్రతినిధులు, దళిత, ప్రజాస్వామిక ఉద్యమకారులు కలిసి నిజనిర్ధారణకు వెళ్లారు. విప్లవ రచయితలకు కూడా అవకాశం ఇచ్చారు. బాసిత్, నేనూ వెళ్లాం.

అక్కడ చూసిన, విన్న, సంభాషించిన వివరాలు ఇవి. ఈ ఘటన మీద ఇంకెంత శక్తివంతంగా రాయవలసి ఉన్నదో తెలిసినా ఇంత వరకు మాత్రమే రాయగలిగాను. రచనకు బాధ్యత పడుతూ కింద నా పేరు ఉన్నా ఇది ఆ మూడు రోజులూ కలిసి ప్రయాణించిన మిత్రులందరిదీ. ఈ మాట వినయం కొద్దీ అనడం లేదు. ఇది చదువుతూ ఉంటే ఇందులోని పరిశీలనలు, సంభాషణలు, సమాచారాలు ఆ బృందంలో అందరికీ తమవే అనిపించేంత గాఢమైన సామూహిక అనుభవం. ముఖ్యంగా ఇది రాత రూపంలోకి రావడానికి విరసం సహచరుడు బాసిత్ ఎంతో చిత్తుపని చేశాడు. ఈ ప్రయాణంలో భాగంగా కలిసిన మావోయిస్టు నాయకుల మాటలను, ఇంటర్వ్యూను రికార్డు నుంచి అక్షరం పొల్లుపోకుండా, ఇసుమంత కూడా స్ఫూర్తి దెబ్బతినకుండా జాగ్రత్తగా ఎత్తి రాసిచ్చాడు.

బాసగూడా ఘటన భారత ప్రభుత్వ దుర్మార్గాన్ని, యుద్ధోన్మాదాన్ని తాజాగా ఎత్తి చూపుతున్నది. అంత మాత్రమే కాదు, దండకారణ్యంలో ఆదివాసులు నిర్మిస్తున్న ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా, జనతన సర్కార్‌పై రాజ్యం చేసిన దాడి ఇది. ప్రత్యామ్నాయాన్ని నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న యుద్ధంలో భాగంగా ఈ ఘటనను అర్థం చేసుకోకపోతే మనమంతా విప్లవం పక్షాన ఎందుకు నిలబడాలో తెలియదు. రాజ్యానికి సవాల్‌గా మారిన జనతన సర్కార్ గురించి మావోయిస్టు మాటల్లోనే చిత్రించే చిన్న ప్రయత్నం ఈ పుస్తకం.

– పాణి



# విధ్వంసం రాజ్యానిది.. నిర్మాణం ప్రజలది

– ప్రొ. ఎస్ శేషయ్య

జూన్ 28, 29–2012న 'బాసగూడా ఎన్‌కౌంటర్' కాదు.. ఆదివాసుల ఊచకోత సంఘటనపై సిడిఆర్ఒకు చెందిన హక్కుల సంఘాలు జులై 7,8 తేదీల్లో నిజ నిర్ధారణ కమిటీగా ఏర్పడి వాస్తవాలు సేకరించడానికి సంఘటన జరిగిన గ్రామాలకు వెళ్లాయి. ఈ కమిటీతోపాటు పాణి వెళ్లాడు. ఆదివాసులతో, మిలీషియాతో, ఉద్యమ నాయకత్వంతో మాట్లాడి తాను తెలుసుకున్న వాస్తవాలను, పొందిన అనుభూతులను, ఆలోచనలను, అభిప్రాయాలను మనతో పంచుకోడానికి చేసిన ప్రయత్నమే ఈ పుస్తకం.

గతంలో పౌరహక్కుల సంఘాల నిజనిర్ధారణ నివేదికలు చాలా ఎడ్యుకేటివ్‌గా ఉండేవి. సంఘటనకు సంబంధించిన వాస్తవాలతోపాటు, అందుకు కారణమైన రాజకీయ, ఆర్థిక, సామాజిక నేపథ్యాన్ని వివరంగా పొందుపరిచేవి. ఈ మధ్య కాలంలో అటువంటి నివేదికలు రావడం లేదనే విమర్శలు ఉన్నాయి. అది వాస్తవం కూడా. ఈ లోపాన్ని ఇప్పుడిప్పుడే సరిదిద్దుకునే ప్రయత్నం జరుగుతూ ఉంది.

నల్లమల అడవుల్లో 23.7.2006న అప్పటి మావోయిస్టుపార్టీ రాష్ట్ర కార్యదర్శి మాధవ్‌తోపాటు 8 మంది విప్లవకారులను ఎన్‌కౌంటర్ పేరుతో పోలీసులు హత్య చేశారు. మృతుల్లో ఐదుగురు మహిళలు కూడా ఉన్నారు. ఆ సంఘటనపై పౌరహక్కుల సంఘం నిజనిర్ధారణ చేసింది. అడవిలో 40 కిలోమీటర్లు నడిచి సంఘటనా స్థలానికి చేరుకొని అక్కడి ఆదివాసుల సహకారంతో వాస్తవాలు సేకరించి నిజానిజాలను నిర్ధారించి పత్రికలకు నివేదికను విడుదల చేసింది. ఈ పని రొటీన్‌గా చేసేదే. కానీ, ఆ తర్వాత మూర్తి నిజనిర్ధారణ నివేదిక ఆధారంగా 'నిమ్మచెట్టుకు నోరుంటే..' అనే చిన్న పుస్తకాన్ని రాశాడు. దాన్ని చాలా మంది బావుందని అన్నారు.

అట్లాగే 2010–2011 మధ్యలో పౌరహక్కుల సంఘం చత్తీస్‌ఘడ్‌లోని దంతెవాడ, బస్తర్ జిల్లాల్లో సీఆర్పీఎఫ్ బలగాలు చేసిన దాడులపై నిజనిర్ధారణ చేయడానికి రెండు సార్లు ఆ ప్రాంతానికి వెళ్లింది. కమిటీ సేకరించిన వాస్తవాల ఆధారంగా.. తాను పరిశీలించిన అంశాలను, ఆదివాసీ జీవితాల్లో చోటుచేసుకుంటున్న సంఘర్షణను,

మార్పులను , వారి సుఖసంతోషాలను, విషాదాలను, ఈ పర్యటనల్లో తాను పొందిన అనుభూతులను కలిపి రాజానందం 'చత్తీస్‌ఘడ్‌లో ఏం జరుగుతోంది' అనే పుస్తకం రాశాడు. ఇది మే 2011న విడుదలైంది. ఈ మధ్య కాలంలో అలాంటి రచనల ఒరవడి పెరగడం హర్షించదగ్గ విషయం.

విప్లవ సాహిత్యం సమాజంలోని చలనాన్ని, దానికి కారణమైన వైరుధ్యాలను, ఘర్షణలను, అవి పరిష్కారమయ్యే వైనాన్ని సృజనాత్మకంగా చిత్రిస్తుంది. ఇలాంటి సాహిత్యం చదివితే మనలో ఉండే స్వీయాత్మక ధోరణులు, ఆలోచనలు, అభిప్రాయాలు మారే అవకాశం ఉంది. కొత్త ఆలోచనలు మొలకెత్తుతాయి. అవి పదునెక్కుతాయి. చరిత్రను నిర్మించుకోడానికి సృజనాత్మక సాహిత్యం దోహదపడుతుంది. అలాంటి చరిత్రలో రక్తమాంసాలు గల మనుషులు సజీవంగా కనిపిస్తారు.

'భూమితో మాట్లాడు.. అది జ్ఞానాన్ని ఇస్తుంది' అంటుంది బైబిల్. 'వాస్తవం అన్నిటికంటే పవిత్రమైన'దనే మాట చరిత్రకే కాదు, సాహిత్యానికి కూడా వర్తిస్తుంది. సౌందర్యం సత్యానికి ఆవరణ మాత్రమే. చూడగలిగితే వాస్తవం కల్పన కన్నా అద్భుతంగా కనిపిస్తుంది' ( వరవరరావు రచన 'భూమితో మాట్లాడు.. కల్పనా సాహిత్యం – వస్తు వివేచన'కు ముందు మాట నుంచి..)

ప్రభుత్వం తన ప్రజలపైనే యుద్ధం చేయడం వాస్తవం. 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' వాస్తవం. దండకారణ్యంలో జరుగుతున్న ప్రజా యుద్ధం వాస్తవం. భారత రాజ్యాన్ని ప్రతిఘటిస్తూ విప్లవోద్యమం ముందుకు వెళుతుండటం వాస్తవం. జనతన సర్కార్ నిర్మాణం వాస్తవం. అందులో ఆదివాసుల భాగస్వామ్యం వాస్తవం. స్వయంగా విప్లవ రచయిత కావడంతో ఈ వాస్తవాలన్నిటికీ పాణి సాహిత్య రూపం ఇచ్చాడు. అడవిలో ఏం జరుగుతోందో బయటి ప్రపంచానికి తెలియజేశాడు.

దండకారణ్య ఆదివాసీ సమాజంలో భూమి సమస్య గురించి, పోడు వ్యవసాయం స్థానంలో నూతన వ్యవసాయ పద్ధతులను ప్రవేశపెట్టడం గురించి, చెరువులు నిర్మించుకోవడం గురించి, ఉత్పత్తి– పంపిణీ– మార్కెట్ సమస్యల గురించి, మహిళల్లో వస్తున్న మార్పుల గురించి ఈ చిన్న పుస్తకం ద్వారా తెలుసుకోవచ్చు.

విప్లవ జనతన సర్కార్ నిర్మాణం, దాని పని తీరు, సామాజిక నిర్మాణంలో ఆదివాసీ కీలక పాత్ర, ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా ఆచరణ మొదలైనవి ఈ పుస్తకంలో ఉన్నాయి.

అయితే ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను, జనతన సర్కార్‌ను కాపాడుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే రాజ్యం ప్రత్యామ్నాయ ప్రభుత్వాలను, అభివృద్ధి నమూనాలను



సహించదు. అత్యంత క్రూరంగా, పాశవికంగా అణచివేయడానికి ప్రయత్నిస్తుంది. విధ్వంసం సృష్టిస్తుంది. రాజ్యానిది విధ్వంసం, ప్రజలది నిర్మాణం. ఈ విధ్వంసాన్ని ఆపడానికి, నిర్మాణాన్ని కాపాడుకోవడానికి ప్రజాసైన్యం బలోపేతం కావాల్సిందే.

దీనికి బయటి ప్రపంచం నుంచి మద్దతు చాలా ఉండాలి. కానీ రాజ్యం నిషేధాలతో, నిర్బంధాలతో ఉద్యమాభిమానుల, సానుభూతిపరుల గొంతు నొక్కివేస్తూ ఉంది. అణచివేత ద్వారా ప్రజలను భౌతికంగా, మానసికంగా ఉద్యమం నుంచి దూరం చేయడం, ఉద్యమం వైపు నిలబడి మాట్లాడకుండా, దోపిడీని ప్రశ్నించకుండా చేయడం దాని ఉద్దేశం. అంతిమంగా సమాజం యథాతథంగా కొనసాగించడం దాని లక్ష్యం.

అంతేకాకుండా రాజ్యం వివిధ పద్ధతుల ద్వారా, మాధ్యమాల ద్వారా ఉద్యమంలోని ప్రజాస్వామిక ఆకాంక్షలను, లక్ష్యాలను వక్రీకరించి గందరగోళం సృష్టిస్తుంది. ప్రజాస్వామికవాదుల్లో, మేధావుల్లో ఉద్యమం పట్ల అనేక సందేహాలను, సందిగ్ధాలను రేకెత్తిస్తుంది. వీటని తొలగించకుండా ఉద్యమానికి సభ్యసమాజం మద్దతును కూడగట్టడం సాధ్యం కాదు. దీనికి మనం మొదట నయా ఉదారవాద ప్రజాస్వామిక భావజాలం ప్రభావం నుంచి పూర్తిగా బయటపడాలి.

ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు, ప్రభుత్వ పాలన, హక్కులు, చట్టబద్ధ పాలన, స్వతంత్ర్య న్యాయవ్యవస్థ అనే భావన మనలో స్థిరపడిపోయింది. ఈ ప్రమాణాలతో , విలువలతో ఉద్యమాలను సమర్థించే బదులు, విమర్శనే ఎక్కువైపోయింది. విప్లవోద్యమాన్ని హక్కులు, చట్టబద్ధపాలన చట్రానికి కుదించి చూడటంలో చాలా ఇబ్బందులు ఉన్నాయి. పరిమితులు ఉన్నాయి. ఆస్తి సంబంధాల్లో మార్పులు రాకుండా ప్రజాస్వామ్యం విస్తృతి కాదు. అమలు కాదు.

కానీ, బూర్జువా సమాజం, చట్టం వ్యక్తిగత ఆస్తిని గట్టిగా సమర్థిస్తుంది. రక్షణ కల్పిస్తుంది. ప్రజాస్వామ్యం అంటే ఆధిపత్యాల నుంచి, దోపిడీ నుంచి విముక్తి కావడం అనే అర్థంలో మనం ఎందుకు ఆలోచించకూడదు? హక్కుల దృక్పథానికి న్యాయం అనే విలువను ప్రమాణంగా ఎందుకు జోడించకూడదు?

ఈ మధ్య కాలంలో చాలా మంది మేధావులు శాంతి – ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారు. మావోయిస్టు ఉద్యమం శాంతికి – ప్రజాస్వామానికి ఆటంకం అని భావిస్తుంటారు. మావోయిస్టు ఉద్యమం 'అభివృద్ధి'కి ఆటంకం అనే అభిప్రాయం కూడా బలంగానే ఉంది.

'పౌర సమాజం'లోని అన్ని ఉద్యమాలను గుర్తిస్తారుగానీ, విప్లవోద్యమాన్ని గుర్తించడానికి ఈ తరహా మేధావులు నిరాకరిస్తారు. ఆ ఉద్యమాన్ని రాజ్యాతీతశక్తిగా

చిత్రీకరించి మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని విమర్శిస్తారు. ఇంకొంచెం ముందుకుపోయి విప్లవోద్యమాన్ని 'సాయుధ సంఘర్షణ'గా కుదిస్తారు. అంతర్జాతీయంగా సాయుధ సంఘర్షణలు (ఇంటర్నేషనల్ ఆర్మ్‌డ్ కాన్‌ఫ్లిక్ట్స్), అంతర్గతంగా కొనసాగే యుద్ధ ఘర్షణలు(ఇన్‌టర్నల్ ఆర్మ్‌డ్ కాన్‌ఫ్లిక్ట్స్) జెనీవా ఒప్పందంలోని ప్రమాణాలను పాటించాలని వాదిస్తారు. వీరంతా విప్లవోద్యమాన్ని సాయుధ సంఘర్షణగా గుర్తిస్తారు తప్ప అందుకు దారి తీసిన పరిస్థితులను, నేపథ్యాన్ని పట్టించుకోరు. సాయుధ ఘర్షణ మూలాలను చూడటానికి నిరాకరిస్తారు.

సాయుధ సంఘర్షణలో ఉన్న ఇరు పక్షాలు సమానంగా కొన్ని ప్రమాణాలు పాటించడానికి ప్రత్యేకమైన పరిస్థితులు ఉండాలి. ఉదాహరణకు.. సాయుధ తిరుగుబాటుదారులు ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని నడిపే స్థాయికి చేరి ఉండాలి. దేశంలో నైసర్గికంగా గణనీయ ప్రాంతంలో ఆధిపత్యం కలిగి ఉండాలి.

అంతే కాకుండా దేశంలోని సాయుధ తిరుగుబాటు అంతర్జాతీయంగా గుర్తింపు పొంది ఉండాలి. ఈ పరిస్థితులు ఉన్నప్పుడే ఇరుపక్షాలు కొన్ని ప్రమాణాలు పాటించాలని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. అంతర్జాతీయంగా గుర్తింపు పొందడం, నిరాకరింపబడటం అనేది వివిధ దేశాల ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలను బట్టి ఉంటుంది. విప్లవోద్యమాలను తీవ్రవాదంగా ముద్రవేసి నిషేధిస్తున్న నేటి సందర్భంలో జాతీయంగా, అంతర్జాతీయంగా గుర్తింపు రావడం కష్టం. నేడు అమెరికా ప్రజాస్వామ్య పునరుద్ధరణ, మానవహక్కుల పరిరక్షణ ముసుగులో యుద్ధాలకు పాల్పడుతూ మావోయిస్టుపార్టీని తీవ్రవాదం జాబితాలో చేర్చిన విషయం తెలిసిందే.

ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో ప్రజలపై యుద్ధం జరుగుతోందనే ప్రచారం పత్రికల సృష్టించిందే అని భారత పాలకులు అంటున్నారు. ఒకవైపు మావోయిస్టు ఉద్యమం దేశ అంతర్గత భద్రతకు అత్యంత ప్రమాదకరంగా తయారైందని అంటూ మరోవైపు అంతర్గత సాయుధ సంఘర్షణ అని వాళ్లు గుర్తించడం లేదు. మావోయిస్టు ఉద్యమాన్ని కేవలం శాంతి భద్రతల సమస్యగా పరిగణిస్తున్నారు. ప్రభుత్వానికి – మావోయిస్టు ఉద్యమానికి మధ్య సాయుధ ఘర్షణ ఉందని ఒప్పుకుంటే ఈ యుద్ధంలో అది చేస్తున్న మానవహక్కుల ఉల్లంఘన విషయంలో అంతర్జాతీయంగా జవాబు చెప్పుకోవాల్సి ఉంటుంది.

అందుకే వివిధ చట్టాలను రూపొందించుకోవటం ద్వారా మావోయిస్టు ఉద్యమ కార్యకలాపాను చట్టవ్యతిరేకమని, నేరపూరితమని నిర్వచించి సమాజంలో ఉద్యమ ప్రతిష్టను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారు. ఉద్యమకారులకు సహకరించడం నేరమని ప్రచారం చేస్తూ ప్రజలను వారితో మమేకం కాకుండా నిరోధించి సమాజం నుంచి రావాల్సిన



మద్దతును బలహీనపరచాలని చూస్తున్నారు.

ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తోంటే, కొందరు మేధావులు విచిత్రంగా ఆలోచిస్తున్నారు. విప్లవోద్యమం తప్పుడు ధోరణుల వల్ల, చర్యల వల్ల ప్రజాస్వామిక వెసులుబాటు(డెమోక్రటిక్ స్పేస్) లేకుండా పోతోందని బాధపడుతుంటారు. వారి మాటలను అర్థం చేసుకోవాల్సిందే. కానీ ప్రజాస్వామిక విలువలను, వ్యవస్థలను ఎవరు నాశనం చేస్తున్నారు? అనే విషయం ఆలోచించాలి. శాంతియుతంగా, ప్రజాస్వామిక పద్ధతిలో, చట్టపరిధిలో ఉద్యమిస్తున్న వారిపై ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తూ ఉంది? పోలీసులు, సైన్యం పహారాలో, తూటాలతో అణచివేస్తూ ఉంది?

సభలు, సమావేశాలు, ప్రదర్శనలు నిర్వహించుకోడానికి అవకాశం ఇవ్వడం లేదు. ఉద్యమకారుల చర్యల వలన ప్రజాస్వామిక వెసులుబాటు తగ్గిపోవడం లేదు. రాజ్యమే అన్ని ప్రజాస్వామిక పద్ధతులను మూసివేస్తున్నది. పోరాటాల ద్వారానే ప్రజాస్వామిక వెసులుబాటు వస్తుందనే విషయం మర్చిపోకూడదు.

ఇవాళ ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతోజరుగుతున్న సైనిక దాడిని నిలువరించమేకాక విప్లవ జనతన సర్కార్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఉద్యమ ప్రాంతానికి బయట జనతన సర్కార్ గురించి, నూతన అభివృద్ధి నిర్మాణం గురించి విస్తృత ప్రచారం చేయాలి. వ్యక్తి కేంద్రంగా కాకుండా, సమిష్టి, సహకారం ప్రాతిపదికగా, ప్రజలు చైతన్యయుతంగా సామాజిక మార్పుకు కృషి చేస్తున్న విషయాన్ని వివరించాల్సి ఉంది. ఈ ప్రచారానికి పాత, మూస పద్ధతిని వదిలేసి, కొత్త పద్ధతులను, మార్గాలను అన్వేషించాలి. ఈ అవసరాన్ని తన రచన ద్వారా గుర్తు చేసిన పాణికి అభినందనలు.

# నూతన మానవ ఆవిష్కరణ ప్రయోగం, ఒక పరిశీలన

**- వరవరరావు**

బాసగూడ పోలీసుస్టేషన్ పరిధిలో జూన్ 28న సీఆర్‌పీఎఫ్ సర్కేగూడ వద్ద ఏకపక్షంగా కాల్పులు జరిపి 17 మంది ఆదివాసులను చంపిన సంఘటనపై నిజనిర్ధాణకు సీడీఆర్‌సీ నాయకత్వంలో ఏపీసీఎల్‌సీ, ఓపీడీఆర్, హెచ్‌ఆర్‌ఎఫ్‌తో పాటు వెళ్లిన విరసం సభ్యులు ఇద్దరిలో పాణి రాసిన పుస్తకమిది. ఆయనే చెప్పినట్లు రచనకు బాధ్యతపడుతూ కింద ఆయన పేరు ఉన్నా ఈ రచన ఆ మూడు రోజుల కలిసి ప్రయాణించిన ఆ మిత్రులందరిది. ఇది సామూహిక అనుభవం. రాత రూపంలోకి రావడానికి విరసం బాసిత్ చేసిన హోంవర్క్ కూడా ఎంతో సహకరించింది. ఈ రూపంలో ఇందులో పాల్గొన్న ముప్పై ఇద్దరు ఈ రచనను ముందుగా చదవనప్పటికీ వారందరి సహకారం, పరిశీలన, సంభాషణ లేకుండా ఆ రచన సాధ్యమై ఉండేది కాదు.

సుదీర్ఘమైన ఆదివాసీ పోరాట చరిత్రలో బాసగూడ మరణహోమం ఎన్నో కొత్త పరిశీలనలకు, అనుభవాలకు పుటలు తెరచింది. చింతల్నార్ ప్రాంతంలో ఇటువంటి పోలీసు కాల్పులు, ఆదివాసుల, విప్లవకారుల హత్యలు, గృహ దహనాలు, స్త్రీలపై హత్యాచారాలు ఇది వరకు ఎన్నో జరిగినప్పటికీ ప్రత్యేకించి రెండు కోణాలతో బాసగూడ సంఘటన ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. మొదటిది హతులందరూ ఆదివాసులు కావడం... అందులో మహిళలు, పిల్లలు ఉండటం. ఆ సమయంలో వాళ్లు ఒక సమావేశంలో ఉన్నారు. సంప్రదాయ ఆయుధాలు కూడా లేకుండా వెన్నెల్లో, మాటల్లో ఉన్నారు.

ఆంధ్ర ఇంటెలిజెన్స్ సూచనతో నాలుగు బృందాలుగా బయలుదేరిన సీఆర్‌పీఎఫ్, కోయ కమెండోలు వందల సంఖ్యలో అక్కడకు చేరి ఆ సమావేశాన్ని చుట్టుముట్టి కాల్పులు జరిపారు. అందువల్ల సీఆర్‌పీఎఫ్ జవాన్ల తుటాలకే ఆరుగురు సీఆర్‌పీఎఫ్ జవాన్లు గాయపడ్డారు. ఆదివాసులు 15 మంది అక్కడే మరణించారు. గాయపడిన వారిని కూడా చిత్రహింసలు పెట్టి సాక్ష్యం లేకుండా చంపేశారు. సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ మొదలు చిదంబరం వరకు ఎవరెన్ని కథలు చెప్పినా కేంద్ర ప్రభుత్వంలోని మంత్రులు, ఛత్తీస్‌ఘడ్ కాంగ్రెస్ పార్టీ కూడా ఆమోదించలేకపోయిన చేదు నిజం అది.



కనుక దీనికి విశ్వజనీనమైన మానవీయ కోణం ఉన్నది. ఈ నేరానికి ఈ వ్యవస్థ శిక్ష వేయకపోయినా కాలం చెక్కిలి మీద శత్రువు పెట్టిన ఈ గాటు మానిన మచ్చగా మిగిలిపోయే ఉంటుంది. ఇటువంటి సంఘటన ఇదివరకు ఇంద్రవెల్లిలో జరిగింది. దాని ప్రస్తవన కూడా ఈ పుస్తకంలో ఉంది. రెండో కోణం.. ఈ సంఘటన వెనుక ఉన్న విప్లవోద్యమ పురోగమన సంబంధమైన విషయాలు.

మార్క్సిజాన్ని ఒక ఆచరణాత్మక తత్వశాస్త్రంగా, ఆచరణ శాస్త్రంగా రాజకీయార్థిక శాస్త్రంగా స్వీకరించిన ఆధునిక సమాజావిష్కారాన్ని వివరించే రచన ఇది. చైనా శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవంలో మావో, నక్సల్‌బరీ పోరాటంలో చార్‌మజుందార్ ఆశించిన నూతన మానవావిష్కరణ ఇవాళ దండకారణ్యంలో క్రాంతికారీ జనతన సర్కార్ ఆధ్వర్యంలో సాగుతూ బాసగూడాలో ఆ రోజు సమావేశానికి ప్రాతిపాదిక అయింది. అట్లాగే ఈ నిజనిర్ధారణ సాగిన ఈ మూడు రోజుల సంభాషణలు, పరిశీలనలు, చర్చలు మూడు సంవత్సరాలుగా ప్రజల మీద, ఈ ప్రయోగం మీద జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో అక్కడ జరుగుతున్న సృజనాత్మక నిర్మాణాన్ని ఈ పుస్తకంలోగ వివరిస్తాయి. ఇది మూడు రోజుల చరిత్ర కాదు, మూడు సంవత్సరాల చరిత్ర. వాస్తవానికి 30 సంవత్సరాల చరిత్ర. ముప్పై సంవత్సరాలుగా ప్రజల దగ్గరకి వెళుతూ, ప్రజల నుంచి నేర్చుకుంటూ ప్రజలకు నేర్పుతూ, ప్రజలతో అడుగులు వేస్తూ ప్రజలను ఒక అడుగు ముందుకు వేయిస్తున్న పార్టీ తన వర్గపోరాటంలో పరిణతి వచ్చే క్రమంలో పేరు మారుతూ, విప్లవ ప్రవాహాలన్నీ ఏకమౌతు మావోయిస్టుపార్టీగా ప్రజాయుద్ధం చేస్తున్న చరిత్ర.

ఇంద్రవెల్లి మారణకాండ భవిష్యత్తు విప్లవాకాంక్షలో గత చరిత్రను వర్తమాన సంభాషణగా ముందుకు తెచ్చింది. అది పీపుల్స్‌వార్‌గా ఆదిలాబాద్ అడవుల మీదుగా బస్తర్‌లో ప్రవేశిస్తున్న సందర్భం. గిడుగు రామ్మూర్తిని, వెంపటాపు సత్యాన్ని ఏక కాలంలో అవహింపు చేసుకుని అమరులు గజ్జెల గంగారాం, సాహూ వంటి ఎందరో విప్లవకారులు ఆదివాసులుగా తదాత్మ్యం చెందుతున్న తరుణం. ఆ చరిత్ర... ప్రత్యక్షంగా నిజాం నవాబును, పరోక్షంగా బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించి "మా గూడేల్లో మా పాలన" అని స్వతంత్రం ప్రకటించుకొని సాయుధపోరాటం చేసిన కోమురం భీంను అవహనం చేసుకున్న చరిత్ర. అది ఆరంభం.

ఆ ఆరంభానికి తన నెత్తుటితో ముగ్గు పోసిన అమరుడు పెద్ది శంకర్ అమరుడు విజయ్ మద్కంగా పరిణతి చెందిన కాలం బాసగూడ మారణకాండ చరిత్ర. క్రాంతికారీ జనతన సర్కార్‌లో బస్తర్‌లోని ఆదివాసులందరూ మావోయిస్టులుగా పరిణతి చెందిన

నూతన మానవావిష్కరణ చరిత్ర ఇది. సర్కేగూడ సమావేశంలో కూడిన మూడు గ్రామాల ప్రజలు భూపంపకాల గురించి, భూమి చదును గురించి, విత్తనాలు చల్లుకోవడం గురించి, పశువులు, విత్తనాలు పంపకం చేసుకోవడం గురించి మాట్లాడుకోవడానికి సమావేశమయ్యారు.

ఇందులో దారి తప్పిన మనుషులను కలుపుకోవడం కూడా ఉన్నది. ప్రవాసం పోయిన మనుషులను పిలుచుకోవడం ఉన్నది. మిగులు మనుషులకు భూములు పంచడం ఉన్నది. ఒకటి రెండుగా ఉన్న ట్రాక్టర్లను ఎట్లా ఉపయోగించుకోవాలనే చర్చ ఉన్నది, సహకారం ఉన్నది. సహకారం గురించిన సమష్టి చర్చ ఉన్నది. శ్రమ వాళ్లకు కొత్త కాదు. పోడు వ్యవసాయం తప్ప ఆవును కట్టెయ్యడం తెలియని, చెట్లకు నీళ్లు పోయడం తెలియని దశ నుంచి ట్రాక్టర్లను ఉపయోగించే దశకు చేరుకున్న వాళ్ల వ్యవసాయ జీవితం అధునికమైంది. మోటరు సైకిళ్లు నడపడమే కాదు, ఉపయోగించే యంత్రాన్ని బాగు చేసే విధానం కూడా నేర్చుకోవాలె కదా అని నాగరికులకు చెప్పే స్థితికి ఎదిగారు. వెళ్లిన ఈ ముప్పై ఇద్దరి బృందాన్ని ప్రజా మిలీషియా సభ్యులే ట్రాక్టర్లపై తీసుకపోయారు. స్వావలంబన, సహకార భావన, రాజకీయ అవగాహన లోపించకుండా అక్కడొక ఆధునిక సమాజం నిర్మాణమవుతున్నది. అది కూడా ఈ దేశపు మూలవాసులైన ఆదివాసీ సమాజం నుంచి ప్యారిస్ కమ్యూన్ రూపంలో నిర్మాణమవుతున్నది. ప్యారిస్ కమ్యూన్ విఫలం కావడానికి ఉక్కు క్రమశిక్షణ గల పార్టీ నిర్మాణం లేకపోవడం కారణమని లెనిన్ తర్వాత కాలంలో సమీక్షించాడు. దండకారణ్యంలో అటువంటి ఒక శిక్షణ గల పార్టీ నాయకత్వంలో నూతన సమాజ నిర్మాణం జరుగుతున్నది. కనుక అది కొమురం భీం కాలంలో వలె "మా గూడేల్లో మా పాలన"కే పరిమితమైంది కాదు. అది ఇవాళ దేశవ్యాప్తంగానూ, ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ నమూనాకు ప్రత్యామ్నాయంగా ఒక బస్తర్ కావచ్చు, ఝూర్ఖండ్‌లోని సరండా కావచ్చు, కానీ ప్రపంచానికి సార్వజనీనంగా వర్తించే ప్రత్యామ్నాయ ప్రజాభివృద్ధి నమూనాను అందించింది. ఆ అభివృద్ధి నమూనాలో మాత్రమే కాదు, దాన్ని అమలు చేస్తున్న రాజకీయ నిర్మాణాల్లో కూడా సగం కన్నా ఎక్కువగా మహిళలు ఉన్నారు. రేపటి పౌరులైన బాలలను వాళ్ల వ్యక్తిత్వ వికాసాలలో పెనుమార్పులతో, సాంస్కృతిక, సృజనాత్మక పరిపూర్ణ మానవులుగా రూపొందించే నిర్మాణాలు అవి.

కొమరం భీం కాలానికి ఈ దేశంలో ఇప్పుడున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యం లేదు. తెలంగాణ సాయుధపోరాట కాలంలో భూమిపై అధికారం స్థాపించుకొని, గ్రామాలను విముక్తి చేసుకున్నారేగాని ఆనాటి నాయకత్వానికి వనరులపై అధికారం



మాత్రమే కాదు, రాజ్యాధికారం సాధించుకోవాలనే అవగాహన లేదు. కానీ దండకారణ్య ఆదివాసులకు వనరుల మీద అధికారం మాత్రమేకాదు, రాజ్యాధికారం కూడా కావాలి.. అసలు వనరుల మీద అధికారం నిలబెట్టుకోవాలంటే రాజ్యాధికారం సాధించుకోవాల్సిందే అనే అవగాహన ఉంది. అందువల్లే ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా, విప్లవ జనతన సర్కార్ రెండింటినీ ఆదివాసులు నిర్మించుకొని నిర్వహించుకుంటున్నారు.

ఆ నిర్మాణాల్లో ఒక రాజకీయ ఆర్థిక నిర్మాణం ఎట్లా ఉంటుందో ప్రజాసైన్య నిర్మాణం కూడా ప్రజా మిలీషియా రూపంలో, ప్రజాసైన్యం రూపంలో ఉంటుంది. ఈ దేశ ఆదివాసులు సామ్రాజ్యవాద వ్యతిరేక సాయుధపోరాటాన్ని 100 సంవత్సరాలకు పైగా చేసిన, చేస్తున్న గుండాధార్ వంటి ఆదివాసీ వీరుల ప్రేరణలో భూంకాల్ మిలీషియాగా రూపొందారు. అంటే స్పష్టంగా కిరాయి సైన్యానికి ప్రత్యామ్నాయంగా ప్రజల కోసం సేవ చేసే కష్టమైన, సాహసమైన పనిని ఎంచుకునే త్యాగపూరిత సైన్యంగా కూడా ఉంటుంది.

బాసగూడ సమావేశం జరిగిన నేల మీద ఎటువంటి విత్తనాలు రేపు మొలకెత్తనున్నాయో.. ఆ కష్ట ఫలాలను, ఆ త్యాగ ఫలాలను అనుభవించే రేపటి తరం కోసం ఎటువంటి నూతన మానవావిష్కరణ జరగనున్నదో... దానికి ఇవ్వాల్టి ప్రతీకయే విజయ్ మడ్కం.

అట్లాగే ఉత్తర తెలంగాణ సింగరేణి కార్మిక ఉద్యమం నుంచి అంచలంచెలుగా ఎదిగి వచ్చి రాష్ట్ర కమిటీ స్థాయికి ఎదిగిన గుండేటి శంకర్ దండకారణ్యంలో అమరుడయ్యాడు. ఇక్కడి ఆదివాసులు తమ కడుపులో ఉత్తర తెలంగాణ ఉద్యమాన్ని కాపాడుకుంటున్న తరుణంలో అక్కడికి వెళ్లిన కామ్రేడ్ ఆయన. అటువంటి కామ్రేడ్ కృషిలో రూపొందిన విప్లవకారుడు విజయ్ మడ్కం. ఒక ఆదివాసీగా పుట్టి ముప్పై ఏళ్ల విప్లవోద్యమంలో బస్తర్ జిల్లా మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి స్థాయికి ఎదిగి బాసగూడ సంఘటన జరగగానే బయట ప్రపంచానికి.. ఇప్పుడు పౌరహక్కుల సంఘాల బృందానికి హరిభూషన్ వివరించినట్లుగా.. ఆ సంఘటన గురించి విజయ్‌మాడ్కం వివరించాడు. దండకారణ్యంలో వాళ్లు సమకూర్చుకున్న ఒక ట్రాక్టర్ నడిపే క్రమంలో ట్రాక్టర్ చెట్టుకు గుద్దుకొని ప్రమాదానికి గురై మరణించాడు. బాసగూడ సంఘటన జరిగిన రెండు వారాలకే ఈ విషాదం జరిగింది.

ఛత్తీస్‌ఘడ్ జైళ్లలో మగ్గుతున్న వేలాది ఆదివాసుల గురించి, గ్రీన్‌హంట్ ఆపరేషన్ గురించి దండకారణ్యంలో సైన్యం మోహరింపు గురించి బయటి ప్రపంచం దృష్టికి, ప్రజాస్వామ్యవాదుల జోక్యానికి తేదల్చుకొని సుక్మా జిల్లా కలెక్టర్‌ను ఆదుపులోకి తీసుకొన్నాక

బి.డి. శర్మతో, ప్రొ.హరగోపాల్‌తో ఆ విషయాలు చర్చించిన "ప్రవక్త" ఆయన. (అధికార ప్రతినిధిని ఇంగ్లీషులో స్పోక్స్‌మెన్ అన్నట్లుగా హిందీలో ప్రవక్త అంటారు) ఇంతగా విజయ్ మద్కం ప్రస్తావన ఎందుకంటే ఆదివాసీలను వదలిపెట్టడమనే అంశంలో ఉన్న మానవీయ దృష్టికి, విప్లవకారులను వదలిపెట్టాలన్న వర్గచైతన్య దృష్టికి ఉన్న తేడాను ఆయన ఆ ఇద్దరికి వివరించాడు.

ఈ పుస్తకం ప్రసరించదులుచుకున్న వెలుగులో, లేదా ఇవాళ దండకారణ్యంలో జరుగుతున్న ప్రయోగంలో ఈ అవగాహనలో ఉన్నది. ఇది ఒక ఆదివాసీ సమాజ ప్రయోగం కాదు. ఇది ఒక నూతన మానవావిష్కరణ ప్రయోగం. పాణికి ఇష్టమైన భాషలో ఆధునిక సమాజ నిర్మాణం. బస్తర్ ఇవాళ క్రాంతికారీ జనతన సర్కార్ నాయకత్వం లభించిన ప్యారిస్ కమ్యూన్.

ఇది లోపరహితంగా ఉన్నదనీ, దీనికి పరిమితులు లేవనీ కాదు. ఇందులో స్వయంగా హరిభూషణే చెప్పాడు. ఎన్నికల ప్రభుత్వాలను గుర్తించకపోవడం, పన్నులు కట్టకపోవడం సరేసరి. ప్రజలందరూ తమ శ్రమతో చేస్తున్న నిర్మాణం ఎట్లాగూ ఉన్నదే. సహకార భావన ఇంకా సమష్టి భావనగా పూర్తిస్థాయిలో పరిణతి చెందాల్సి ఉన్నది. ప్రతి కుటుంబానికి భూమి ఉన్నదనడంలోనే, అట్లాగే కడు పేదవారి భూములు మొదట సాగు చేయాలనడంలోనే సహకార భావన ఉన్నది. అది ప్రజలందరి సమష్టి. అందరూ చేయగలిగినంత చేసి అవసరమైనంత తీసుకోవడం ఇంకా చాల దూరాన ఉన్నది. అయితే అక్కడ ధనిక రైతు ఉండటం ఎంత నిజమో ఆ ధనిక రైతు జనతన సర్కార్ ఇచ్చిన చైతన్యం వల్ల పేద రైతు భూమిలో పని చేయడానికి మొదట వెళ్లడం అంతే నిజం. ఇంకా ఈ పేద, ధనిక తేడాలు పోవాల్సి ఉన్నది. ఇప్పటికీ అక్కడ దోపిడీ, పీడన, తేడాలు మాత్రమే పోయాయి. విడివిడిగా కుటుంబాలకు భూములు ఉన్నాయి. వాటిని దొంగిలించదగిన ఆస్తి అనలేం. అందుకే అక్కడ దొంగతనాలు, దోపిడీలు లేవు. స్త్రీలపై నిన్న సల్వాజుడుం, అప్పుడప్పుడు ప్రభుత్వ బలగాలు తప్ప లైంగిక అత్యాచారాలు లేవు. సమష్టి భావన, ఒక స్వార్థరహిత భావన మాత్రం అక్కడ నాటుకొని చిగురిస్తున్నాయి.

ఈ స్వాలంబన అతి సమున్నతమైన ఆదిమ దశలో ఉన్న సమాజాల్లోనేనా? ఈ వ్యవసాయ సమాజం రేపు పారిశ్రామిక సమాజంగా మారితే ఎదుర్కొనగలిగే సమస్యలేమిటి? ఆధునిక వ్యవసాయం చేసే క్రమంలో వీళ్లు ఎదుర్కోగల మార్కెట్ సమస్యలేమిటి? ఈ సమాజంలోకి మార్కెట్ ప్రవేశించదా? ఇటువంటి ప్రశ్నలు కూడా పాణి లేవనెత్తాడు. హరిభూషణ్ ఒక లిటారిక్‌గా, ఒక పాఠంగా కాకుండా వాస్తవ చిత్రం ద్వారా చెప్పాడు. మాటిమాటికీ భారత ప్రభుత్వం పెంచుతున్న పెట్రోల్ ధరల ప్రభావం



పెట్రోల్ ఉత్పత్తులపై పడుతోంది. దాని ప్రభావం దండకారణ్యంపై కూడా ఉంటుంది. పైగా దండకారణ్యంపై రెండు రూపాల్లో ఉంటుంది. దండకారణ్యం ప్రజలపై జరుగుతున్న యుద్ధాన్ని, ఆ యుద్ధాన్ని ప్రతిఘటిస్తున్న ప్రజల యుద్ధానికి ప్రత్యక్ష కార్యక్షేత్రంగా ఉంది కనుక అక్కడికి ఈ పెట్రోల్, డీజిల్ విషయంలోనే కాదు, వైద్యానికి మందుల సరఫరాల విషయంలోనూ ఇప్పటికే ఎన్నో అంక్షలు, నిషేధాలు ఆమలవుతున్నాయి.

ఖమ్మం నుంచి ఆదిలాబాద్ దాకా గోదావరి తీరం మొత్తం సైనిక దిగ్బంధానికి గురైంది. మనుషులు వారి పరస్పర సంబంధాలు, సహకారాలు ఇచ్చిపుచ్చుకోవడానికి వీల్లేని ఒక యుద్ధవాతావరణాన్ని కేంద్ర ప్రభుత్వం దండకారణ్య సరిహద్దు రాష్ట్రాలలో మూడేళ్లుగా తీవ్రంగా అమలు చేస్తున్నది. కనుక ఈ సమస్యలన్నీ స్వాలంబన ప్రాతిపదికగా పరిష్కరించుకోవడం అంత సులభమేమీ కాదు. ఒక వైపు ఆదివాసీ సంప్రదాయ సంతలు సైనిక శిబిరాల దగ్గరికి, అర్ధసైనిక బలగాల దగ్గరికి తరలించబడ్డాయి. అవి సెల్‌ఫోన్లలో వేసుకునే చిప్స్ దొరికే మార్కెట్లుగా మారడం ఎంత నిజమో, వాళ్ల నిత్యావసరాలను నిషేధాలతో, నిర్బంధాలతో నియంత్రించడం అంతే నిజం. ప్రతి కుటుంబం తన ఇంట్లో ఎందరు సభ్యులున్నారో చెప్పి ఆ మేరకు రేషన్ కొనుక్కోవాలి. ఇదంతా సైనిక, అర్ధసైనిక బలగాల నిఘాలో జరగాలె. అధునిక సంక్లిష్ట సమాజంలో మార్కెట్‌ను నియంత్రించగల వర్గచైతన్యానికి సంబంధించిన ప్రయోగాలు ఇంకా ముందు ముందు జరగాల్సే ఉన్నది. ముఖ్యంగా చైనా శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవకాలంలో వలె వర్గ పోరాటం గీటురాయిగా అభివృద్ధి, ప్రయోగం అనేవి సామాజిక ప్రగతి కోసం జరగాల్సే ఉన్నది. సుదీర్ఘకాల మానవ పురోగమన చరిత్రలో వానరుడు నరుడుగా మారిన క్రమంలో శ్రమ పాత్ర గుర్తించినట్లుగానే నరుడు నూతన మానవుడిగా మారే క్రమంలో పెట్టుబడి నిర్వహించే విధ్వంస పాత్రను ప్రతిఘటించే క్రమంలో వర్గ పోరాటం నిర్వహించే పాత్రను గుర్తించాల్సే ఉన్నది. అందుకే ఉత్పత్తిలో పాల్గొనే ఉన్నత రూపమే వర్గ పోరాటమన్నారు. ఇవాళ దండకారణ్యంలో వర్గపోరాటం పునాదిగా ఈ రెండు ప్రక్రియలు ఒకదానికొకటి అండగా కొనసాగుతున్నాయి.

ప్రజలు ఉత్పత్తిలో పాల్గొంటున్నారు. కొత్తకొత్త ప్రయోగాలతో అభివృద్ధిని సాధిస్తున్నారు. ఇవి నిలుపుకోవడానికి, కాపాడుకోవడానికి తమకే కాకుండా మనకందరికీ అందించడానికి పోరాడుతున్నారు. ప్రపంచ మానవళి విముక్తి కోసం కార్మిక వర్గం చేసే పోరాటంలో ముందు భాగాన నిలబడి దండకారణ్య ప్రజలు పోరాడుతూ ఉంటే మనమెట్లా ఈ యుద్ధంలో భాగం కాగలమో తెలుసుకుని చర్చించుకుని, నిర్ణయించుకోడానికి ఈ పుస్తకం ప్రేరణ ఇస్తుంది.

000

దండకారణ్యంలో ఏం జరుగుతున్నదో మనం తెలుసుకోకుండా చేయడానికి, ఎంత వీలైతే అంత తప్పుడు సమాచారం ఇవ్వడానికి ఈ రాజ్యం కుట్ర చేస్తున్నది. ఈ పుస్తకం జూన్ 28, 29 నాటికి బాసగూడలో ఏం జరిగిందో చెప్పింది. అయితే ఆ తర్వాతి నుంచి రాజ్యం ఏం కుట్ర చేస్తున్నదో తెలుసుకోకుంటే ఈ పుస్తకం ప్రయోజనం నెరవేరినట్లు కాదు. సారాంశం, చైతన్యం వరకు అట్లా ఉంచి సమాచారానికి సంబంధించి బాసగూడ అప్‌డేట్స్ చెప్పాల్సి ఉన్నది. మధ్య, తూర్పు భారతాల్లో మావోయిస్టు పోరాటం జార్ఖండ్‌లోని సరండా, దండకారణ్యాలలో ప్రయోగాలను విస్తరింపజేయకుండా విధ్వంసం చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చుట్టుముట్టి అక్కడి సమాచారం కూడా బయటి ప్రపంచానికి అదకుండా సమాచార, సాంస్కృతిక విష ప్రచారానికి పూనుకుంటున్నాయి. జంగల్‌మహల్ విషయంలోనూ, సరండా విషయంలోనూ మనకిప్పటికే కుప్పలుగా తప్పుడు సమాచారం ఉంది తప్ప వాస్తవాలు ఇటీవల ఏపీసీఎల్‌సీ వెళ్లివచ్చిన సందర్భంలో తప్ప తెలియలేదు. దండకారణ్యానికి సంబంధించి ఇప్పటి వరకు మనకు అక్కడి ఉద్యమం నుంచి వస్తున్న సాహిత్యం, మావోయిస్టు పార్టీ ప్రకటనల ద్వారా తెలుస్తున్నదే.

బయటి సమాజం అక్కడికి వెళ్లి స్వయంగా తెలుసుకోడానికి ఎన్ని అంక్షల్లో.. ఎన్ని నియంత్రణలో. చాల పెద్ద ఎన్‌కౌంటరో, మారణకాండలో జరిగిన సందర్భంలో వెళ్లి వచ్చే హక్కుల సంఘాల నిజనిర్ధారణ రిపోర్టులు తప్ప విడిగా బుద్ధిజీవులు, రచయితలు ముఖ్యంగా సోషలిస్టు నిర్మాణం గురించి తెలుసుకోగోరే అభిమానులు, జిజ్ఞాసకులు వెళ్లి రాగల ఒక ప్రజాస్వామిక వాతావరణం ఏ మాత్రం లేకుండా రాజ్యం కుట్ర చేస్తున్నది. మరీ గతంలోకి, చరిత్రలోకి వెళ్లకుండా బాసగూడకు అటూ ఇటూగా ఈ నిర్బంధాలు, నిషేధాల గురించి మాట్లాడుకుందాం. విజయ్ మడ్కం అమరత్వం సందర్భంగా గుండేటి శంకర్ అమరత్వం గురించి మాట్లాడుకున్నట్టుగా.

మావోయిస్టు అధికార ప్రతినిధి ఆజాద్ నాగపూర్ మీదుగా దండకారణ్యంలోకి ప్రవేశించబోతే ఆయనను కలిసి, ఆయనతో దండకారణ్యానికి వెళ్లి బయటి ప్రపంచానికి అక్కడ ఏం జరుగుతున్నదో చెప్పాలని వెళ్లిన జర్నలిస్టు హేమచంద్రపాండేను అజాద్‌తో సహా అరెస్టు చేసి కేంద్ర, మహారాష్ట్ర, ఆంధ్ర ప్రభుత్వాలు కూడబలుక్కొని చంపేశాయి. ఆయనతోపాటే దండకారణ్యం వెళ్లి శేష జీవితం గడపాలనుకున్న ఆయన సహచరి పద్మ తప్పించుకుని రెండేళ్ల తరువాత ఆదివాసులకు పాఠాలు చెప్పుకొనైనా సేవ చేద్దామని భావించిన ఆమెను అరెస్టు చేశారు. ఆమెతోపాటు విప్లవాభిమానులను, ప్రజాసంఘాల సభ్యులను అరెస్టు చేశారు. మరి కొందరిపై అక్రమ కేసులు బనాయించారు. సరిగ్గా అప్పుడే మొదలైంది.. దండకారణ్య సందర్భంలో తెలుగు సమాజపు ప్రజా సంఘాలపై



కేసుల్లో ఇరికించడం. నిజానికి అంతక ముందే గ్రీన్‌హంట్ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో భద్రాచలం డివిజన్ చర్లలో సభ నిర్వహించదలుచుకున్నప్పుడు పోలీసులు ఆ సభకు అనుమతి ఇవ్వలేదు. కోర్టు కూడా పర్మీషన్ ఇవ్వలేదు. అప్పటి నుంచి గ్రీన్‌హంట్ గురించి మాట్లాడదలుచుకున్న తెలుగు ప్రజాస్వామికవాదులపై ఆంక్షలు మొదలయ్యాయి. చత్తీస్‌ఘడ్‌తో ముడిపెట్టి ఇక్కడి ప్రజాసంఘాల కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం మొదలైంది. పరస్పర సంభాషణకు, సమాచారానికి అవకాశం మొగ్గలోనే తుంచేసే ఒక కుట్ర ఇది.

సరిగ్గా ఆ రోజుల్లోనే.. సెప్టెంబర్ 2009లో ప్రారంభమైన గ్రీన్‌హంట్ రెండో దశలోకి ప్రవేశించి దండకారణ్యంలో సైన్యం కూడా మోహరించి "విజయ్ ఆపరేషన్, హాకా" ఆపరేషన్లు ప్రారంభమై 'మాడ్' లక్ష్యంగా యుద్ధం ముమ్మరమైంది. ప్రజలకు మాత్రమే మాడ్‌గా తెలిసి పాలకులకు అబూజ్‌మాడ్‌గా ఉన్న ప్రాంతం మీదకు సైన్యం కవాతు చేసిన కాలం అది.

రాజమండ్రి దగ్గర సైనిక విమానాశ్రయం ఏర్పాటు చేసి మహారాష్ట్ర, ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల మీదకు మానవ రహిత విమానాలు పంపించిన కాలం కూడా ఇదే. ఈ కాలంలో జంగల్ మహల్ మొదలు జార్ఖండ్, దండకారణ్యం, ఒరిస్సాలో అమలవుతున్న విప్లవ ప్రజాస్వామ్యం గురించి వివరించడానికి హైదరాబాద్‌లో రెవల్యూషన్ డెమొక్రటిక్ ఫ్రంట్ ప్రథమ మహసభలు జరిగితే ఊరేగింపుపై నిషేధం విధించారు. మరో వైపు దండకారణ్యంలోని జనతన సర్కార్ ప్రయోగాన్ని ఈ వేదికపై వివరించడానికి రావలసిన చేతనా నాట్యమంచ్ కళాకారులను నిర్బంధంలోకి తీసుకున్నారు.

ఆదివాసులతో ఆదివాసేతర ప్రజాస్వామ్య సమాజానికి సంభాషణ లేకుండా ఒక కుట్ర సాగుతున్నది. విప్లవ ప్రజాస్వామిక పోరాటాల గురించి.. అటు కాశ్మీర్ మొదలు తెలంగాణ వరకు సాగుతున్న ఉద్యమాల గురించి వివరిస్తున్న వేదికపై.. తెలంగాణ ప్రజాస్వామ్య అకాంక్షను చిదిమేసే కుట్ర ఇది. ఆదివాసులతో పాటు సామ్రాజ్యవాద ప్రపంచీకరణను వ్యతిరేకించే అవగాహనతో తెలంగాణ ప్రజాస్వామిక అకాంక్షలను ప్రకటించే, బలపరిచే అన్ని ప్రజాసంఘాల కార్యకర్తలపై కేసులు, నిర్బంధాలు నిరంతరంగా కొనసాగుతున్నాయి. జూలై 8న పౌరహక్కుల సంఘాల బృందం బాసగూడ వెళ్లి అక్కడేం జరిగిందో స్వయంగా తెలుసుకొని తిరిగి భద్రాచలం వచ్చి మనకు చెప్పింది. పరిపాలనలో వికేంద్రీకరణ లేదు కానీ సమాచారం అందించే విషయంలో మాత్రం వార్తలు ప్రాంతాలకు, జిల్లాలకు పరిమితమవుతాయి. నిర్బంధం, నిషేధం ఈ రాజ్యం ఎంత సర్వకాలికంగా, సార్వజనీనంగా అమలు చేస్తుందో ప్రతిఘటనను అంత స్థానీకరిస్తుంది. కనుక

భద్రాచలంలో ఈ బృందం చెప్పిన సమాచారం గోదావరి దాటి రావడం కష్టమే. అయితే ఆదివాసులతో మాట్లాడి నేరుగా తెలుసుకొని వచ్చిన వివరాలను జూలై9న ఆర్‌డీఎఫ్ ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో బొజ్జా తారకం, చిలకా చంద్రశేఖర్ ద్వారా వినగలిగాం. ఆ సమాచార ప్రచార సాధనాలకు కూడా మళ్లీ మీడియా యాజమాన్యాల ఇష్టాఇష్టాల పరిమితులు ఉంటాయి.

ఆరోజు అక్కడేం జరిగిందో తామే వచ్చి బయటి సమాజానికి చెప్పాలనుకొని బాసగూడా ఆదివాసులు తమ అకాంక్షను వ్యక్తం చేసారు. జూలై 15న విప్లవ రచయితల సంఘం ఏర్పాటు చేసిన సదస్సుకు చేతన నాట్యమంచ్ సభ్యులతో సహా బాసగూడ సంఘటన గురించి కొందరు ఆదివాసులు వచ్చి వివరించాల్సి ఉండె. ఒక నూతన సమాజం నిర్మాణం చేసుకుంటున్న ప్రజలకు బయట అసమ సమాజంలోని అస్తవ్యస్త రహదారులు అందుకు సహకరించలేదు. జూలై 20న అమరుల బంధు మిత్రుల సంఘం సభలోనైనా వాళ్లు తమ అమరుల పోరాటాల గురించి, త్యాగాల గురించి చెప్పాలని జూలై 16న 18 మంది (అందులో చేతనా నాట్యమంచ్ కార్యకర్తలు, స్త్రీలు, పిల్లలు ఉన్నారు) వచ్చారు. వాళ్లను తీసుకరావడానికి వెళ్లడం కూడా ఒక నేరం అయింది. గురజాడ, శ్రీశ్రీ, రావిశాస్త్రి, బీనాదేవి వంటి వాళ్లు న్యాయం గురించి, నేరం–శిక్ష గురించి చేసిన రచనలను బుద్ధిజీవులు ప్రశంసిస్తుంటారు. కానీ తమ కష్టాలు, కన్నీళ్లు, పోరాటాలు చెప్పుకోడానికి వచ్చిన కళాకారులు, స్త్రీలు, పిల్లలకు నగరంలో దారి తెలియకపోతే వారికి చేయూత అందించడానికి వెళ్లిన ఏపీసీఎల్‌సీ కార్యకర్తలు నేరస్తులైపోయారు. దాంతో జైలు పాలయ్యారు. ఉద్యోగస్తులైతే ఉద్యోగాలు కోల్పోయారు. అప్పటికీ బాసగూడలో ఏం జరిగిందో నేరుగా ఆదివాసులు బయటకు వచ్చి ఈ ప్రపంచానికి తెలిపే అవకాశమే రాలేదు. సమాచార హక్కును చట్టం చేసి సమాచారం తెలుసుకునే హక్కును ప్రాథమిక హక్కుగా కాగితం మీద గుర్తించిన ప్రభుత్వాలు మనవి. సమాచార హక్కు కార్యకర్తలను చంపుతూనే ఉంది. సమాచారం తెలుసుకోవాలనే ప్రజలనూ చంపుతూనే ఉంది. ఇంక సత్యం తెలుసుకోడానికి అవకాశం ఎక్కడ?

రాయపూర్‌లో సీడీఆర్‌సీ తలపెట్టిన ధర్నా నాటికైనా ఈ బాసగూడా ఆదివాసులు విడుదలై తమ రాష్ట్రంలో ఏం జరుగుతుందో చెబుతారని ఆశించాం. కానీ వాళ్లు నేరస్తులయ్యారు, బాల నేరస్తులయ్యారు. బాల నేరస్తుల సత్ప్రవర్తనకు అటు ఛత్తీస్‌ఘడ్ నుంచి ఇటు తెలుగు సమాజం నుంచి పెద్దమనుషులు పూచి పడాల్సివచ్చింది. వాళ్లు ఢిల్లీలో బాసగూడా సంఘటనపై జూలై 31న జరిగిన ధర్నాలో కూడా పాల్గొనలేకపోయారు. ఆ ధర్నా ముగిసిందని తెలిసిన తర్వాత గానీ వాళ్లను విడుదల చేసి తీసుకెళ్లి అడవిలో



వదలిరాలేదు. మైదానాన్ని కూడా విముక్తం చేయాడానికి పోరాడుతున్న అడవిపై ఎంత నిఘా.. నిర్బంధం... ఎంత నిషేధం! ఇచ్చుపుచ్చుకోవడంపై ఎన్ని ఇనుప సంకెళ్లు! సంభాషణపై ఎంత గండ కత్తెర!

బాసగూడా ఘటనపై దేశ రాజధానిలో వినిపించిన నిరసనను దృష్టిలో పెట్టుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజాభద్రత చట్టం కింద ఆర్‌డీఎఫ్‌ను నిషేధించింది. ఆర్‌డీఎఫ్ మహాసభ జరిగిన ఏప్రిల్ 22 లెనిన్ పుట్టిన రోజు. మనదేశంలోనూ, ప్రపంచంలోనూ మార్క్సిస్టు, లెనినిస్టు పార్టీలు ఆవిర్భవించిన రోజు. ఇవాళ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆర్థిక సంక్షోభాన్ని విప్లవాలకు అనుకూలంగా మలచుకోవాలని, గ్రీన్‌హంట్ పేరుతో ప్రజలపై జరుగుతున్న యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చుకోవాలని పిలుపునిచ్చిన ఆర్‌డీఎఫ్ బయటి ప్రపంచానికి క్రాంతికారీ జనతన సర్కార్ ప్రయోగాన్ని, దానిపై జరుగుతున్న దాడిని వివరించకుండా ఈ రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఏ కారణం కోసం ఈ అక్రమ కేసులు, ఈ నిర్బంధాలు, ఈ నిషేధం పెట్టారో.. ఆ కారణాలను వివరించడమే, ఆ కారణాల కోసం పోరాడడమే ప్రజాస్వామికవాదుల, విప్లవాభిమానుల కర్తవ్యం.

బాసగూడా గురించి చెప్పొద్దనే కదా రాజ్యం ఇన్ని ఆంక్షలు, ఇన్ని నిషేధాలు, నిర్బంధాలు పెడుతున్నది. బాసగూడ, చింతల్నార్, దండకారణ్యాలలో విప్లవ జనతన సర్కార్ నేపథ్యాన్ని, పురోగమనాన్ని, వీటికి దార్శనికంగా ఉన్న విప్లవరాజకీయాలను, మొత్తంగా నూతన మానవ ప్రయోగాన్ని వివరించడానికే గత మూడు సంవత్సరాలుగా చేస్తున్న నిరంతర కృషిని ఇంకా కొనసాగించడానికే ఇవాళ విరసం బాస చేస్తున్నది. తనకు తెలిసిన భాషలో విప్లవాభిమానులైన ప్రజలకు, ప్రజాస్వామ్యవాదులకు వివరిస్తున్నది. కలిసి రమ్మని పిలుపునిస్తున్నది.

# జులై 7, 2012
# సార్కిన్‌గూడా చింతల్నార్ అడవులు

మధ్యాహ్నం ఒంటి గంట. ఆ రోజు ఉదయం దాకా వర్షం కురిసీ కురిసీ నేల చిత్తడిగా మారింది. మబ్బుల చాటు నుంచి లేత ఎండ కాస్తోంది. మధ్య మధ్యలో పిండి జల్లులా తుంపర పడుతూనే ఉంది. ఆ వాతావరణం మద్రంగానే గాక విషాదంగా , మోయజాలని భారంగా, దుఖంగా ఉంది. కలివిడిగా ఉన్న రాజుపెంట, సార్కిన్‌గూడా, కొత్త గూడెం గ్రామాల మధ్య ఉన్న మైదానంలోని గట్టు మీది నుంచి వందలాది ఆదివాసులు మమ్మల్ని సాగనంపడానికా అన్నట్లు రోడ్డు మీదికి నడిచారు.

అప్పటి దాకా మాకు చెప్పిన సంగతులే మళ్లీమళ్లీ చెప్తూ తోడు నడుస్తున్నారు. ఒకసారి చెప్తే మాత్రం హృదయభారం తీరుతుందా? ఆనాటి బీభత్సం నుంచి తెప్పరిల్లినట్లు కనిపించినా, మాట లోతుల్లో ఇంకా తడారని దు:ఖం వాక్యానికీ వాక్యానికీ మధ్య చెమ్మగిల్లుతూనే ఉంది.

మైదానంలోంచి పది నిమిషాలు నడిచామేమో!

బరువెక్కిన మబ్బుల వలె ఎక్కడ చూసినా దట్టమైన గుబుర్లతో చింతచెట్లు ఉన్నాయి. అలనాటి బస్తర్ ఎకానమీలో చింతపండు కీలకమని పి.శంకర్ 'ఈ అడవి మాదే' అనే పుస్తకంలో చాలా వివరంగా రాశాడు. ఆయన వలసవాద కాలంలోకి వెళ్లి ఆ సంగతి వివరించాడు. దండకారణ్యంలోకి విప్లవకారులు వెళ్లాక చింతపండు ధరల విషయంలో జరిగిన అనేక ఆందోళనలు, ప్రభుత్వాల కుయుక్తులు, ఆదివాసులు విజయాలు చాలా రాశాడు. ఆ చెట్లను చూస్తుంటే ఆయన రాసినవన్నీ గుర్తుకు వచ్చాయి.

సార్కిన్ గూడా నుంచి బాసగూడా వెళ్లే దారికి ఇరువైపులా చింతచెట్లు ఆవరించి ఉన్నాయి. మేం అక్కడికి వెళ్లే సరికి చెట్ల మధ్యనే... వర్షం కురుస్తుందని కావచ్చు... షామియాలు వేసి ఉన్నాయి. కింద కుర్చీలు ఉన్నాయి. రోడ్డుకు ఆ వైపు టార్పాలిన్ కప్పిన లారీలు, వ్యాన్లు నిలబడి ఉన్నాయి.

మా బృందంలో కాస్త ముందుగా అక్కడికి చేరుకున్న వాళ్లు అక్కడున్న అధికార్లతో మాట్లాడుతున్నారు. అధికార్లలో ఒకాయన తెల్లగా, టక్ చేసుకొని, మధ్య వయస్సును



సూచించే కొద్దిపాటి బోర విరుచుకొని నిలబడి మా వాళ్లతో మాట్లాడుతున్నాడు. ఆయన బీజాపూర్ జిల్లా రెవెన్యూ డివిజన్ ఆఫీసర్. పేరు కురువంశి.

మాతో నడుస్తూ వచ్చిన ఆదివాసులు అక్కడికి చేరి వాళ్లు ఒక్క పెట్టున అధికార్లపై ఆగ్రహోదగ్రంగా విరుచుపడ్డారు. మాటల దండయాత్ర చేశారు. ఆ ఘటన జరిగిననాటి నుంచి వారిలో గూడుకట్టుకొని ఉన్న వేదన అంతా జ్వాలలుగా ఎగజిమ్ముతూ బైటికి వచ్చింది. ఒకరు కాదు.. ఇద్దరు కాదు... అందరూ మాట్లాడుతున్నారు. అయినా గందళగోళంగా లేదు. అందరి కడుపు మంట, ప్రశ్నాతత్వం ఒక్కటే కావడం వల్లేమో! అందరి మాటలు విడివిగా, కలివిడిగా స్పష్టంగానే అర్థమవుతున్నాయి.

'మావోయిస్టులను చంపితే కూడా మీ సర్కార్ బియ్యం పంచుతుందా? మా వాళ్లను మావోయిస్టులని చంపినరు కదా? మేం అంతా మావోయిస్టులమే. ఇదిగో ఈ పిల్లలు కూడా మావోయిస్టులేనా? అందర్నీ చంపేయండి... అందర్నీ చంపేయండి... అందరినీ చంపేసి అప్పుడు బియ్యం పంచండి. మా బిడ్డల్ని మీరు పొట్టన పెట్టుకుంటే మేం మీరిచ్చే బియ్యం తినాల్నా? మీరూ మీ పోలీసులు ఇక్కడి నుంచి వెంటనే వెళ్లిపోవాలి..' అని భర్తలను పోగొట్టుకున్న భార్యలు, బిడ్డల్ని పోగొట్టుకున్న తల్లులు, కొడుకులను కోల్పోయిన తండ్రులు... ఒక్కరనేమిటి? చనిపోయిన 17మంది శరీరాలపై నుంచి ఎన్ని తూటాలు వెళ్లాయోగాని, బతికి ఉన్నవారి గుండెలు తూటాల జల్లెడగా, కండ్లు కన్నీటి వరదలుగా, దగ్ధమైన స్వరపేటిక నుంచి మాటలు ఊటలా.. దు:ఖమూ, ఆగ్రహమూ పెల్లుబికిన ఆ సమయంలో అక్కడి వాతావరణమంతా అతలాకుతలమైపోయింది. శోకపు బడబాగ్నిని దాచుకున్న పరిసరాలన్నీ విస్ఫోటనమయ్యాయి.

**పచ్చని అడవి ఆ దు:ఖాగ్రహానికి కుపితయైపోయింది**
**వాన తుంపరలు వెచ్చని కన్నీటి ధారలయ్యాయి**
**మనిషిని పోగొట్టుకోవడమంటే**
**ఒక్కసారిగా జీవితపు అగాథంలోకి జారిపోవడం కదా**
**మోయజాలని విషాదపు రుతువులో**
**ప్రతి హృదయపు జెండా మీది నుంచి ధిక్కార ప్రకంపనాలు**

**కన్నీరే..**
**దాని అర్థం ఏడుపులోకి ఎన్నటికీ అనువాదం కాదు**
**నిలువునా కూలిపోతున్నప్పుడు విచ్చుకొనే వెర్రి గొంతుక**

**కడుపుకోతే..**

**బతుకుపట్ల పెల్లుబికే వల్ల మాలిన మమకారం**

ఆర్డీవో, తదితర అధికారుల మీదికి పోయి వాళ్లు మాట్లాడుతుంటే సదరు అధికారి తన తెల్లని ముఖంలో మందస్మితం చిందిస్తూ, చేతులు కట్టుకొని నిలబడ్డాడేగాని ఒక్క మాట కూడా మాట్లాడలేదు. అక్కడి నుంచి వెళ్లిపోయే అవకాశం ఉంటే పోయేవాడేమోగాని, ఆయన ఆ పని చేయలేకపోయాడు. అంతకుమించి ఆయన తనకు ఈ గొడవతో ఏ సంబంధం లేనట్లు ఉండిపోయాడు.

అంత ఇంపర్సనల్‌గా ఆయన ఎలా ఉన్నాడా? అని నాకు అనిపించింది. ఏం జరిగిందో, ఎందుకు జరిగిందో, కారణాలేమిటో.. కాసేపు పక్కన పెడితే, 17 మందిని పోగొట్టుకున్న వాళ్ల విషాదం ఎవ్వరినైనా కదిలించి వేస్తుంది గదా? కానీ ఈ అధికారి దరిదాపుల్లోకి ఈ దు:ఖోద్వృతి వెళ్లలేకపోయింది. ఆధునిక వ్యవస్థల్లో.. అధికారులు చట్టాలను అమలు చేయాల్సిన వాళ్లు , లేదా నిత్యం వాటిని ఉల్లంఘించేవాళ్లు.. కాయితాలపై వాస్తవాలను అంకెల్లో రాసేవాళ్లుగా మాత్రమే ఉంటారుగాని మనుషులుగా ఉండరు గదా? అనిపించింది.

ఆయన కాసేపు అలా నిలబడి, ఆ తరువాత అక్కడి నుంచి కొంచెం పక్కకు తప్పుకున్నారు.

చంపేసింది ఎవరో? ఎందుకు చంపారో? ఆయన అనాలోచితంగానే పట్టించుకోలేదు. అంత సహజంగానే ఆయన ఆ క్షణాన తాను స్పందించనవసరం లేదని, ప్రభుత్వంలోని వేరే విభాగం చేసిన పని గురించి తనకెందుకని అనుకొనే అచ్చమైన అధికారి ఆయన కళ్లలో కనిపించాడు. ప్రభుత్వ యంత్రాంగంలో మనుషులు లేకుండా కేవలం అధికారులు, ఉద్యోగులు మాత్రమే ఉంటారని ఆయన చూసిన ఎవరికైనా ఆ క్షణాన తప్పక అనిపిస్తుంది. రెవెన్యూ విభాగానికి చెందిన అధికారిగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు జరిగింది కాబట్టి ఇక్కడి బాధితులు అదివాసులు కావట్టి ఆయన బియ్యం, దుస్తులు..వగైరా తీసుకొని బీజాపూర్ నుంచి ఇక్కడికి వచ్చేశాడు అంతే.

అసలు విషయం ఏమంటే – పోలీసులు ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ ఏమని రాశారని హక్కుల సంఘాల వాళ్లు అడిగితే, అలాంటిదేమి తనకు తెలియదని ఆయన చెప్పాడు. మరి ఎఫ్ఐఆర్ చూడకుండానే ఇక్కడ ఏం జరిగిందని వచ్చారు? అని గట్టిగానే అడిగారు. దానికి ఆయన నసిగాడేగాని ఏమీ చెప్పలేదు. మాల మాదిగలను, ఆదివాసులను చంపేశాక బియ్యం పంచడం అనేది రాజ్యం పాటించే చట్టాతీత ఆచారంగా మారిపోయిందా ఏమి? అనిపించింది.



ఎంత భయాక స్థితి ఇది. చావగా మిగిలిన వాళ్లు బాధితులుగా మారిపోతారని, వాళ్లకు బియ్యం, దుస్తులు, ఇళ్లూ పంచడం ప్రభుత్వం తన నైతిక బాధ్యత అనుకుంటుందా? ఈ ప్రభుత్వాలకు ఇంకా నైతికత బతికే ఉన్నదా? నైతిక సంబంధమైన భాష ఉపయోగించే అర్హత ఉన్నదా? ఇంతకూ ఈ ఆదివాసులు మామూలు అర్థంలో బాధితులా? ఘటన జరిగి సరిగ్గా పది రోజులు గడవలేదు. మనసులోని పచ్చి ఇంకా తడైనా ఆరలేదు. అయినా ఎంతటి ధిక్కార పలుకుబడి?

ఆ రోజు ఉదయం పొద్దుపొద్దున్నే ఈ వాహనాలతో అధికారులు అక్కడికి వచ్చారు. గూడేలకు ఎడంగా.. ఆ చెట్ల కింద కూర్చోడానికి కుర్చీలు వేసుకున్నారు. గుడారాలు పరుచుకున్నారు. అయితే గూడేల్లోకి వెళ్లి ఈ బియ్యం వగైరా మీ కోసమే... అని చెప్పే ధైర్యం వాళ్లెవ్వరూ చేయకలేకపోయారు. గూడేల వాళ్లు ఒక్కరు కూడా తిరిగి చూడలేదు. అట్లా వాళ్లు ప్రభుత్వం పట్ల తమ ఛీత్కారాన్ని ప్రకటించారు. అదీ సంగతి. ఇప్పుడు ఒక్కసారిగా అధికారులు తారపడేసరికి ఆగ్రహం కట్టలు తెంచుకున్నది.

కాసేపయ్యాక ఆదివాసులు చాలా నిరసనగా అరుస్తూ దు:ఖిస్తూ తమ గూడేల వైపు బయల్దేరారు.

**గాయం కొత్తనా?**
**వందల ఏళ్ల కిందటి నేల పొరల్లోంచి తెగిపోతున్న బాధ**
**రోజూ రోజూ ఖండ ఖండాలవుతున్న వ్యథ**
**ఏం ఫర్వాలేదు**
**ఈ అడవిలాంటి వాళ్లమే**
**ఎక్కడైనా అడవి చిగురించడం..**
**తనలోకి తాను నిర్మించుకోవడం..**
**పునర్నిర్మించుకోవడం మానేసిందా?**
**అడవి ఛిద్రం అవుతుందేమోగాని**
**తల వంచుతుందా?**
**మాయమవుతుందా?**
**అడవిని శరీరాల్లోకి, బతుకులోకి నిబిడీకరించుకున్నవాళ్లం**
**అడవి అంతర్ తర్కంలోకి వెళ్లి హేతుమర్మాలు తెలుసుకొని**
**పునర్జీవితానికై ప్రపంచం ఆవలి వైపుకు చేతులు సాచుకున్నవాళ్లం..**

మేం సన్నటి తుంపరలో తడుస్తూ.. వచ్చిన దోవను వెతుక్కున్నాం. మేం ఆ దారి, చెట్లు దాటుతూ ఉంటే ఊరి చుట్టూ సాయుధ పహారాల్లో ఉన్న సీఆర్పీఎఫ్ జవాన్లు

తుపాకులు తాటించి మా వైపు చూశారు. వెళ్లేటప్పుడైతే.. మా అలికిడికి ఏకంగా మిల్టరీ పొజిషన్‌లో నేలపైకి వాలి తుపాకులను గురిపెట్టారు. ఆ తరువాత మేం మామూలు మనుషులమని తెలుసుకొని సర్దుకున్నారు. ఈ తర్వాత ఎవరో కనిపిస్తే అడిగితే చెప్పారు. ఊరి చుట్టూ వందలాది మంది ఆ ఘటన జరిగిన రోజు ఉదయం నుంచీ తుపాకులతో కాపలా ఉన్నారని.

**జూలై 6**

**భద్రాచలం టూ చింతల్నార్**

ఉదయం 5 గంటలకల్లా దిగి మిగితా వారి కోసం బస్టాండులోనే ఎదురు చూస్తూ అశ్వఘోషుడి వజ్రసూచి చదువుతూ కూర్చున్నాను. పుస్తకం అయిపోయినా, తెల్లారిపోయినా ఎవరూ కనిపించలేదు. భద్రాచలం అనగానే మూడు నెలల కింద చర్లలో గ్రీన్‌హంట్ వ్యతిరేక కమిటీ సభ గురించిన జ్ఞాపకాలన్నీ గుర్తుకు వచ్చాయి. సభకు వారం రోజుల ముందు ప్రజా సంఘాల సభ్యులు చర్ల ప్రాంతంలో ప్రచారం చేయడానికి బయల్దేరారు. నేను ఆ మొదటి రోజు మాత్రమే హాజరయ్యాను.

అప్పుడొక విచిత్రమైన అనుభవం కలిగింది. మేమంతా సుమారు పాతిక మందిమి ఒక హోటల్లో దిగాము. అక్కడ ప్రచార ప్రణాళికను తయారు చేయడం, పోలీసు పర్మీషన్‌కు ప్రయత్నించడం ఆ రోజు చేయాల్సిన పని, మేం కొద్ది మందిమి పదకొండు గంటలప్పుడు కాగితం రాసుకొని అడిషనల్ ఎస్పి దగ్గరికి వెళ్లాం.

అంతక ముందు భద్రాచల సీతారాముల కళ్యాణానికి వందలాది మంది పోలీసులతో, డజన్ల కొద్ది అధికారులతో విధులు నిర్వహించి అలిసిపోయిన ఏఎస్‌పి ఒకింత బడలికగానే అపాయింట్‌మెంట్ ఇచ్చాడు.

చర్ల చాలా సెన్సిటివ్ ఏరియా అని, అక్కడ అనుమతి ఇవ్వడం చాలా కష్టమని, మరెక్కడైనా మీటింగ్ పెట్టుకోవాలని ఆయన ఉచిత సలహా పడేశాడు.

ఆ పోకడకు తెగ ఆశ్చర్యం కలిగింది. ఏదైనా సరే... అడిగింది కాక మరేదైనా ఇస్తామనడం వ్యవస్థా రక్షకులైన మన పాలకులూ, వారి రక్షకులైన పోలీసులూ ఉమ్మడిగా ఒకే బళ్లో నేర్చుకున్నారా? ఏమి అనిపించింది. హైదరాబాదుతో సహా 1956లో ఆంధ్రలో కలిసిన తెలంగాణ కావాలి మొర్రో అంటే రాయలసీమతో కలిపి ఇస్తామని, ఇవ్వాలని కొందరు అన్నట్లు ఉందాయన వాలకం. చర్ల కానప్పుడు భద్రాచలమైతేనేమి, పాల్వంచ అయితేనేమి, ఏకంగా హైదరాబాదు అయితే నేమి?

ఈ సభకు రావాల్సిన ఆదివాసులకు చర్ల అయితేనే సౌకర్యంగా ఉంటుందని పౌరహక్కుల సంఘం వాళ్లు చాలా చెప్పారు. ఆయన బొత్తిగా వినడే! పై అధికారులకు



తెలియజేస్తాననే మాట ఒకటి!!

ఆ ఉదయం అక్కడికి వెళ్లినప్పటి నుంచి నాకు ఒక పౌరాణిక, చారిత్రక మీమాంస వేధించింది. ఇంతకూ రాముడు ఇక్కడి దాకా ఎందుకు వచ్చాడు? ఎలా వచ్చాడు? ఉత్తరాదిలో ఆ చివరన ఉన్న అయోధ్య నుంచి ఈ దక్షిణాది గోదావరి తీరం దాకా దండకారణ్యమంతా దాటుకొని వచ్చాడు. దారి పొడవునా ఎంత మంది మూలవాసులను లొంగదీసుకున్నాడో? ఎంత మంది ఆదివాసులను హత్య చేశాడో గదా? సనాతన ధర్మ సామ్రాజ్యాన్ని ఆదివాసీ ప్రాంతాల్లో విస్తరింపచేయడానికి, వారి ధర్మ సంస్థాపనకు ఏజెంట్లుగా పనిచేసే రుషులకు అడివిపై పెత్తనం కట్టపెట్టడానికి ఆయన దండకారణ్యమంతా కాలినడకన దండయాత్ర చేశాడు గదా? అనిపించింది.

నాగరిక రాజ్య విస్తరణ అంతా ఆదివాసీ ప్రాంతాల దురాక్రమణ మీద ఆధారపడి సాగిందనడానికి పౌరాణికంగా కనబడే ఇలాంటి వాటిలో ఎన్ని చారిత్రక వాస్తవాలున్నాయి? అడవిని హస్తగతం చేసుకొని, అందులో ఉండే మానవ సముదాయాలను లోబరుచుకోవడాన్ని సమర్థించుకోవడానికి ఎన్నెన్ని కల్పనా గాథలు అవసరమయ్యాయి? అక్కడ నుంచి ఇక్కడి దాకా గ్రీన్‌హంట్ సాగిస్తూ వచ్చిన కోదండరాముడు ఇక్కడ నదీతీరంలో కళ్యాణ రాముడయ్యాడనిపించింది.

పదిరోజులుగా సీతారామ కళ్యాణానికి భారీ ఎత్తున భద్రతా చర్యలు చేపట్టిన పోలీసులు ఆదివాసుల సభ వీలుకాదని, సెన్సిటివ్ ఏరియా అని అడ్డం తిరిగారు. సదరు ఏఎస్పీ– భద్రాచలం, చర్ల దగ్గర ఉండే ఆదివాసులు మంచివాళ్లేనని, చత్తీస్‌ఘడ్ నుంచి వచ్చిన వాళ్లతోనే సమస్య ... అని ఆదివాసీ సాంఘిక, సాంస్కృతిక విషయాలపై ఓ మోస్తరు ప్రసంగం అందుకున్నాడు.

నిజమే..! అందుకే అక్కడి నుంచి వచ్చిన వాళ్లను ఈ రాష్ట్ర ప్రభుత్వం పౌరులుగా గుర్తించడం లేదు. చాలా రోజుల కింద ఆపరేషన్ గ్రీన్‌హంట్ వ్యతిరేక కమిటీ తరపున.. సాల్వాజుడుం దాడులు తట్టుకోలేక వరంగల్, ఖమ్మం ప్రాంతాలకు తరలి వచ్చిన ఆదివాసుల జీవన స్థితిగతులను అధ్యయనం చేయడానికి వెళ్లినప్పుడు ఈ విషయమే అర్థమైంది. అక్కడ ఉండలేక సరిహద్దు జిల్లాలకు వచ్చిన ఆదివాసులకు ఇక్కడి అధికారులు కనీస సౌకర్యాలు కల్పించకపోగా ఎంత నిరాదరించారో బోధపడింది. కనీసం రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదు. అదే విషయం అడిగితే.. 'వాళ్లు.. మనవాళ్లు కాదండీ' అని ఎంత తేలిగ్గా చెప్పారో! ఆ మాట అన్నాక ఆదివాసీ చట్టాల సారాంశం గురించి చెప్పగలమేమోగాని, వాటిని ఎలా అమలు చేయించగలం? అనిపించింది.

సరిగ్గా సదరు ఎఎస్పీ ఆదివాసుల మంచి చెడ్డల మధ్య దోబూచులాడుతూ అదే

మాటను ఎంత అలవోకగా చెప్పాడో!

అక్కడి నుంచి హోటల్‌కు చేరుకొనే సరికి అక్కడ పది మంది పోలీసులు జీపులో వచ్చి మేం ఉన్న గదులను తనిఖీ చేయడానికి సిద్ధమయ్యారు. మా మిత్రులు అడ్డంపడ్డారు. ఇంతకూ గొడవ ఎందుకని అడిగితే – మావోయిస్టులు వచ్చి ఈ హోటల్‌లో బస ఉంటున్నారని సమాచారం వచ్చిందట. గదుల్లో ఆయుధాలున్నాయని అనుమానం. అందుకు తనిఖీ చేస్తారట.

మమ్మల్ని మావోయిస్టులని అనడం కంటే, మావోయిస్టులు తుపాకులతో సహా ఈ హోటల్‌లో దిగారని అనడమే నవ్వొచ్చింది. మేం మావోయిస్టులమేమిటి? అని గట్టిగా అంటే.. ఇది సెన్సిటివ్ ఏరియా, మీరు ఎక్కడెక్కడి నుంచో వచ్చి మాకు ఏ సమాచారం ఇవ్వకుండా ఇట్లా హోటల్లో ఉంటే ఎలా? మాట మార్చారు.

దీంతో మాకు మరీ చిరాకేసింది.

నిన్నటి దాకా లక్షలాది మంది సీతారాముల కళ్యాణానికి భద్రాచలం వచ్చారుగదా? వాళ్లంతా రాగానే.. ఫలానా వాళ్లం మేమిట్లా వచ్చామని మిమ్మల్ని కలిసి చెప్పారా? అంటే.. మళ్లీ అదేపాట. సెన్సిటివ్ ఏరియా అని. ఆ మాటను.. దానికి ఉండే అర్థాన్ని ఎంత భ్రష్టుపట్టించేశారో? అనిపించింది.

ఉదయం దిగగానే ఈ వ్యవహారం అంతా గుర్తుకు వచ్చింది.

0 0 0

ఆరుగంటలకల్లా బాసగూడా వెళ్లాల్సినవాళ్లు ఒక్కొక్కరే కలిశారు.

8 గంటలకల్లా బయల్దేరాం.

దేశవ్యాప్తంగా ఉన్న పౌరహక్కుల సంఘాల నాయకులు, ప్రజాస్వామికవాదులు వచ్చారు. టీవీల వాళ్లు, పేపర్ల వాళ్లు కూడా కొందరు తోడయ్యారు. అంతా ముప్పై రెండు మందిమి అయ్యాం. వాహనాలు కదులుతున్నప్పుడే వాన తుంపర మొదలైంది. చర్ల దాకా దారి బాగుంటుంది.. ఆ తర్వాత అడవిబాటలో పోవాలి.. సాయంకాలానికల్లా సార్కిన్‌గూడా చేరుకుంటామని, పొద్దున్నే ఆదివాసీ గూడేల్లో పని ముగించుకొని మర్నాటి సాయంకాలానికల్లా తిరిగి భద్రాచలం రాగలమని అనుకున్నాం.

చర్ల దాకా, ఆ తర్వాత మరి కొద్ది దూరం దాకా ప్రయాణం సాఫీగా సాగింది. పోగా పోగా వాహనాలు కదలడమే కష్టమైపోయింది. రాత్రంతా కురిసిన వానకు అడవి దారి చిందరవందర అయింది. పది నిమిషాలకోసారి వాహనాలు దిగడం, డ్రైవర్లు నీటి మడుగులను, బురద గుంటలను దాటించాక.. ఎక్కి ముందుకుపోడం.. పైగా చిన్న చిన్న వానజల్లులు. అర్థమైపోయింది... బయల్దేరేటప్పుడు అనుకున్నట్లు ప్రయాణం పూర్తి



కాదని.

ముందే ప్లాన్‌లో ప్రయాణమార్గం, దారి పొడవునా వచ్చే గూడేల పేర్లు రాసుకున్నా ఒక్కో ఊరు దాటుతున్నప్పుడు థ్రిల్ అనిపించింది. ఈ పేర్లు పత్రికల్లో అడపాదడపా వింటున్నవే. అయినా ప్రత్యేకంగా చర్ల మీటింగ్ అప్పుడు ప్రజాసంఘాల ప్రచార కార్యక్రమం ప్లాన్ చేస్తున్నప్పుడు చాలా వివరంగా ఈ గూడేల పేర్లు, వాటి మధ్య ఎంత దూరం ఉండేది చర్చకు వచ్చింది. అప్పుడు వారంపాటు ఇళ్లూ, ఊళ్లూ వదిలేసి చాలా మంది కార్యకర్తలు ప్రచారం చేయడమేగాని సభకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. చివరికి కోర్టు కూడా పర్మిషన్ ఇవ్వలేదు. మామూలుగా అయితే కొన్ని కండీషన్లు పెట్టి ఇచ్చే అలవాటు కోర్టుకు ఉంది. ఈసారి దాన్నీ మర్చిపోయింది.

**అయితే ఏం పోయింది?**
**ఒక భగ్న సభ నీడలో అనేక సభలు జరుగుతాయి**
**ఒక గొంతు మోగే చోట వేలాది గొంతులు విచ్చుకుంటాయి**
**ఒకే పల్లవిని వొరుసుకుంటూ అనుపల్లవులనేకం గానమవుతాయి**
**నీవు అనుమతి ఇవ్వనిది మనుషులు ఒక్కచోట కలవడానికేనా?**
**ఏం ఫర్వాలేదు**

**చెప్పేవాళ్లూ వినేవాళ్లూ లేకుండా చేయాలనుకొని చిదిమేస్తే**
**చెట్ల సిగలపై నుంచి, గాలి కెరటాలపై నుంచి**
**అడవి శిరస్సుపై నుంచి లోకమంతా మా గాత్రమే..**

.. ఎన్నిసార్లు రుజువు కాలేదు. సాయంకాలం సభ అనగా తెల్లారేసరికల్లా నెత్తి మీద సంచులు, మూటలు పెట్టుకొని ఆదివాసులు గుంపులుగా తరలి రావడం మొదలుపెట్టారు. వారం కింద అక్కడ ఒక తీర్థం జరిగింది. తండోపతండాలుగా జనం వచ్చి వెళ్లి ఉంటారు. మళ్లీ ఇదేమైనా తీర్థమా? కాదే.. అయినా వచ్చేశారు.

అట్లా వస్తారని పోలీసులకు ముందే తెలుసు.

సెన్సిటివ్ ఏరియా కదా? వాళ్లు పదే పదే ఆ మాట ఉపయోగించడంలో ఈ అంతరార్థం బాగా తెలుసన్నమాట ! నెత్తి నోరు కొట్టుకొని చెప్పినా మీటింగ్ సమయానికల్లా ఏ సత్యనారాయణస్వామి వ్రతం ఉందనో, బంధువులింట్లో బర్త్‌డే ఫంక్షన్ ఉందనో, పెళ్లానికి వాంతులూ బేదులనో ఎగ్గొట్టే వాళ్లున్న నగరవాసుల సభలకే పర్మిషన్ ఇవ్వని పోలీసులకు నిజంగానే ఇంత సెన్సిటివ్ ఆదివాసీ జన సందోహం ఎట్లా కదిలి వస్తారో తెలిసిందే గదా? కాలి నడకన అట్లా రెండు రోజుల ముందే ఇంత తిండి సిద్ధం చేసుకొని

బయల్దేరారు. విషయంపట్ల ఎంత స్పష్టత ఉండి, ఎంత సెన్సిటివ్‌గా రియాక్టయ్యే అలవాటు లేకపోతే అట్లా వస్తారు?

ఇదంతా తెలుసు కావట్టే పోలీసులు రెండు పనులు ముందస్తుగా చేశారు.

ఇందులో ఒకటి విచిత్రం.

ముందు రోజు చర్ల గ్రామాన్ని పోలీసుల పహారాలోకి తీసుకొని, సాయంకాలానికల్లా వీధుల్లో కవాతు కూడా చేయించారు. అది చాలదని.. రాత్రి కాగానే ఒక రౌండ్ గాలిలోకి కాల్పులు జరిపారు. గాలిలోకి వెళ్లిన తూటా హెచ్చరిక అన్నమాట. లక్ష్యం లేకుండా వదిలిన తూటాకు కూడా పోలీసుల పరిభాషలో రాజకీయ అర్థం ఉంటుంది. ఇక మీటింగ్‌కు నడిచి వస్తున్నవాళ్లను, వాహనాల్లో వస్తున్నవాళ్లను ఎక్కడికక్కడ ముందు రోజు, ఆరోజు పొద్దున్న మధ్యలోనే అరెస్టు చేసే అలవాటు ఉన్నదే గదా! ఇంత చేసినా ఇరవై పాతిక వేల మంది దాకా వచ్చి ఉంటారని పత్రికలే రాశాయి.

వచ్చినవాళ్లు ఊరకపోతారా?

సభకు అనుమతి ఇవ్వలేదనే నిరసన ఎక్కడికక్కడ గుంపు సభల్లో వ్యక్తమైంది. భగ్నసభ ఇచ్చే ఉత్తేజంలోని రాజకీయశక్తి పోలీసులకు బహుశా తెలిసే అవకాశం లేదు.

...గడియ గడియకూ మజిలీలతో సాగుతున్న ప్రయాణం ఒక చోటికి వెళ్లాక పూర్తిగా మొరాయించింది.

మామూలుగానైతే ఆ బాట వెంట జీపులు, లారీలు సాఫీగా వెళ్తాయని, వర్షం వల్ల పరిస్థితి పూర్తిగా మారిపోయిందని ఒకటికి రెండుసార్లు ఆ దారెంట గతంలో చత్తీస్‌ఘడ్‌కు సాల్వాజుడుం దాడులపై నిజనిర్ధారణకు వెళ్లి వచ్చిన పౌరహక్కుల వాళ్లు అన్నారు. ఒద్దిపేట–బీమారం మధ్యలో ఆగిపోయాం. దారి మళ్లించి పక్క నుంచి పోవాలంటే దట్టంగా పెరిగిన చెట్లు అడ్డంగా ఉన్నాయి. గొడ్డలి ఉంటేగాని పని కాదని డ్రైవర్లు తేల్చేశారు.

బురదలో ఇరుక్కపోయిన వాహనాల రొదకు ఆ వైపు ఉన్న గూడెం నుంచి ఇద్దరు ముగ్గురు ఆదివాసీ కుర్రాళ్లు వచ్చారు. ఎవరు? ఏమిటి? ఎందుకు వచ్చారని వివరాలు అడిగారు.

రెండు నిమిషాల్లో వాళ్లు వెళ్లి మరో ఇద్దరిని వెంటబెట్టుకొని వచ్చారు.

వాళ్లు మావోయిస్టుల ప్రజామిలీషియా సభ్యులు.

రాగానే చెట్లు కొట్టేసి దారి చదును చేశారు.

వాళ్లలో ఇద్దరు మాతోపాటు వాహనాలు ఎక్కారు. ఇక అక్కడి నుంచి నిజంగానే నల్లేరు మీద బండిలో ప్రయాణం సాగింది. అంతా అరగంటే. తాలిపేరు వాగు అడ్డం



వచ్చింది. బాగానే పారుతోంది. వాగు దాటాక ఆ వైపు ఓ మోస్తరు కొండను అధిగమించాలి.

డ్రైవర్లు దిగేశారు. ఇక ఇంతే అన్నట్లు.!

మేం కూడా దిగాం.

అక్కడ ముగ్గురు మహిళా మావోయిస్టులు స్థూప నిర్మాణం పనిలో ఉన్నారు. వాళ్లకు ఇరవై ఏళ్లు ఉంటాయేమో! మావోయిస్టు పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ దేవేందర్ స్థూపాన్ని నిర్మిస్తున్నారు. నిజానికి అక్కడ ఒక చిన్న స్థూపం ఉన్నది. ఇది భారీగా తలపెట్టారు. వర్షాకాలం కావడంతో స్థూపం నిర్మిస్తున్న చోట పాలిథీన్ పట్టాలు కట్టేశారు. పది మందిదాకా ఆ పనిలో ఉన్నారు. గెరిల్లాలు తుపాకులు తగిలించుకొని పని చేస్తున్నారు.

మేం ఇద్దరం వెళ్లి పలకరించాం.

ఫలానా పని మీద వెళ్తున్నామని చెప్పాం. బాసగూడాలో ఏం జరిగిందో మీకేమైనా తెలుసా? అని అడిగాం. దానికి వాళ్లు.. పేపర్లో చదివిందీ, వచ్చిపోయే కామ్రేడ్స్ చెప్తున్నదేగాని ఇంకా పార్టీ రిపోర్టు రాలేదని అన్నారు.

ఇక్కడ మీ కార్యకలాపాలు ఏమిటి? అని అడిగితే చాలా వివరాలు చెప్పడం మొదలు పెట్టారు. అక్కడ పెద్ద ఉట్లాం, పూజారి కాంకేర్, చిన్న ఉట్లాం, రామారం, బీమారం, కస్తూరిపాడు అనే గూడేలు ఉన్నాయని, ఆ గూడేల పరిధిలో తాము పని చేస్తుంటామని చెప్పారు.

ముగ్గురూ ఆదివాసీ యువతులే. చక్కగా తెలుగు మాట్లాడుతున్నారు.

అదే మాట అంటే.. బార్డర్ కదా? అని నవ్వారు.

ఆ గ్రామాల్లో జనతన సర్కార్ కమిటీలు ఉన్నాయనీ, 30 ఎకరాలు సమిష్టి వ్యవసాయ క్షేత్రం నడుస్తోందనీ, మిగతా అంతా పొలాల్లో సహకార వ్యవసాయం చేసుకుంటున్నారనీ చెప్పారు.

2000 సంవత్సరం నుంచి ఈ గూడేల్లో జనతన సర్కార్ కమిటీలు పని చేయడం మొదలైంది.

ఇక్కడ మీ కర్తవ్యాలేమిటి? అని అడిగాం.

దానికి వాళ్లు ఇట్లా చెప్పారు.

ఆర్గనైజేషన్– పార్టీ నిర్మాణం, గ్రామ సమస్యలు, వ్యవసాయం పనులు చేస్తుంటామని అన్నారు.

వ్యవసాయమంటే గ్రామ సమస్యల్లో భాగమే కాదా? అని అడిగితే .. దానికి వాళ్లు మంచి వివరణ ఇచ్చారు.

నిజమే. మా పనులు ఒక రకంగా రెండే. ఒకటి: పార్టీ నిర్మాణం, రెండు : జనతన

సర్కార్ కమిటీల పని. భూమి, చదువు, ఆరోగ్యం, చెరువులు, కుంటలు అన్నీ అందులోకే వస్తాయి. మేం పని చేసే ఈ గూడేల్లో కూడా చెరువులు తవ్వుకున్నారు. రాతి నేల కావడంతో నీరు సరిగా నిలబడటం లేదు. పోయిన ఏడాది ఎండిపోయాయి. దీంతో ఈసారి వర్షాలకే వడ్లు, పెసలు, బబ్బర్లు పండించారని చెప్పారు.

ఈ విషయాలు మాట్లాడుతోంటే – ఓ ట్రాక్టర్ నిండా రాళ్లు వేసుకొని వాటి మీద కూచొని పది మంది దాకా వచ్చారు. అంతకంటే ముందు ఓ మోటారు సైకిల్‌పై ఒక కుర్రాడు వచ్చాడు. ట్రాక్టర్‌లో తరలించిన రాళ్లు స్థూప నిర్మాణానికి. దాని వెంట వచ్చినవాళ్లూ.. అక్కడే పనుల్లో ఉన్నవాళ్లూ కలిసి రాళ్లు దించేశారు.

ఇంతక ముందు మోటార్‌సైకిల్ మీద వచ్చిన కుర్రాడు మళ్లీ వెనక్కిపోవడానికేమో మళ్లీ దాన్ని స్టార్ట్ చేశాడు. అది దుర్ర్.. దుర్ర్‌మని ఆగిపోయింది. ఈ అమ్మాయిలతో మాట్లాడుతూనే అటు కేసి చూశాను. ఇప్పుడేం చేస్తాడు? అని నా కుతూహలం. ఆ కుర్రాడు ఒకటి రెండు సార్లు కిక్ కొట్టి కిట్ బ్యాగ్‌లోంచి ఏవో పనిముట్లు బైటికి తీశాడు. అదివాసీ కుర్రాడు బండి నడపడమే ఆశ్చర్యం అనిపించింది నాకు.

దగ్గరిగా వెళ్లి రిపేరి చేయడం వచ్చా?అని అడిగాను.

దానికి అతడు కిందికి వంగి పని చేస్తూనే తలెత్తి నా వంక ఓరగా చూస్తూ.. 'బండి నడపడం నేర్చుకున్నాక రిపేరి చేయడం కూడా నేర్చుకోవాలిగా?' అన్నాడు.

ఆదివాసులంటే అమాయకులనే 'నాగరిక' వైఖరిలో ఎంత అభిజాత్యం ఉన్నదో కదా? అనిపించింది. ఇతరులను తూస్కారంగా చూడటం అనే ఆధిపత్య భావనకు మరో కోణం అమాయకులని అనుకోవడం. మన కన్‌సర్న్ వల్లనే కావచ్చు... ఆదివాసులంటేనే అమాయకులనే ఊత పదం వెంటాడుతూ ఉంటుంది. అమాయక ఆదివాసులు కూడా ఉంటారు. ఉదాహరణకు నల్లమల చెంచుల వలె. కానీ ఈ ఆదివాసులు చాలా నేర్చుకొంటూ మనకు కూడా నేర్పిస్తున్నారనుకోకపోతే దృశ్యామాంధ్యం వచ్చినట్లే అనిపించింది.

ఆ కుర్రాడు బండి రిపేరి చేసుకొని పోవడం, ఈ పక్క ట్రాక్టర్‌లోని రాళ్లన్నీ కిందికి దించడం ఒకేసారి పూర్తయ్యాయి. ఈలోగా అక్కడున్న బోర్ వద్ద మా వాళ్లందరూ కాళ్లకంటిన బురద కడుక్కొని, వెంట తెచ్చుకున్న చిరుతిండ్లు తినేశారు.

ఈ ప్రయాణం సాగేనా? అని అప్పటిదాకా కొందరిలోనైనా నెరనెరలాడుతున్న సందేహం పూర్తిగా తీరిపోయింది. ఫర్వాలేదు.. అక్కడిదాకా వెళ్లిరాగలం..! అనే నమ్మకం కలిగినట్లు బృందం అంతా కళకళలాడుతూ కనిపించింది.

ముసురు కొంచెం తెరిపిచ్చింది.



మేఘాల దాపు నుంచి కొంచెం వెలుగు ప్రసరిస్తోంది.

సాయంకాలం మూడు గంటలు దాటింది.

ఈలోగా మరో ట్రాక్టర్‌ను ప్రజామిలీషియా సభ్యులు నడుపుకుంటూ వచ్చారు. ఆ రెండింటిలో అందరం బయల్దేరాం.

ట్రాక్టర్ తాలిపేరు దాటుతూ ఉన్నప్పుడు ఒడ్డు పక్క చెట్ల మధ్య ఉన్న కాలిబాటలో నుంచి పదిమందిదాకా గెరిల్లాలు వచ్చి వెనుక నుంచి చేతులు ఊపుతూ వీడ్కోలు పలికారు. ట్రాక్టర్లు ఏటిలో దిగుతున్నప్పుడు మా బృందంలో కొందరు కేరింతలు కొడుతూ.. చేతులెత్తి గెరిల్లాలకు అభివాదం చేశారు. ఆ సన్నివేశం చాలా ఉద్వేగంగా సాగింది.

ఏట్లో ట్రాక్టర్ల చక్రాలు సగానికి పైగా మునిగిపోయాయి. గట్టెక్కాక ప్రయాణం ఉత్సాహంగా సాగింది. నేను ఎక్కిన ట్రాక్టర్‌ను ఓ పద్దెనిమిదేళ్ల గెరిల్లా నడుపుతున్నాడు. మరో దాన్ని పాతికేళ్లపైబడ్డ గెరిల్లా నడుపుతున్నాడు. ఆయన ఎక్కేటప్పుడు జేబులో ఉండే పిస్టల్‌ను సర్దుకుంటూ ఉంటే.. మాతో ఉన్న ఓ హక్కుల సంఘం మిత్రుడు అడిగాడు కదా? 'ఈ తుపాకులతో ఇట్లాగే మనతో వస్తారా ఏమి?' అని.

అనుమానం ఏమీ లేకుండా...ఆయన అట్లాగే మావెంట వచ్చాడు. మన కోసమని వాళ్లు వాళ్ల పద్ధతులు మార్చుకోరుగా?

నేను డ్రైవర్ సీటు పక్కన కూచొని అతడితో ముచ్చట పెట్టాను.

ఇక్కడ ఏమేం పనులు జరుగుతున్నాయని.

అడిగిందే తడువుగా.. ఆ కుర్రాడు ఉత్సాహంగా చెప్పుకొచ్చాడు.

కొంచెం యాస తెలుగులో దారికి అటూ ఇటూ చూపిస్తూ.. ఇదిగో ఇటు చూడు.. ఆ చెరువును జనతన సర్కార్ పోయించింది.. అన్నాడు.

అల్లంత దూరాన నీటి అద్దంలా మిలమిలా మెరుస్తూ చెరువు కనిపించింది. అటే చూస్తుండిపోతే... ఇదిగో ఇది కూడా సర్కార్ తవ్వించిందే అని మరో కుంటను చూపించాడు. ఈ పొలాలన్నీ సర్కార్ చదును చేయించింది... అని చూపించాడు. దారికి ఇరువైపులా నల్లరేగడి పొలాలు వర్షానికి బాగా నాని బంగారంలాగా కనిపిస్తున్నాయి.

అటూ ఇటూ చెరువులు, కుంటలు, అప్పుడప్పుడే దున్నకాలు మొదలు పెట్టిన పొలాలు మనోహరంగా కనిపించాయి.

దేశవ్యాప్తంగా వ్యవసాయం సంక్షోభంలో చిక్కుకొని వేలాది మంది రైతులు ఉరిపెట్టుకొని, పురుగుల మందు తాగి చనిపోతున్నారు. మరోపక్క అట్టడుగు గ్రామ జీవితంలోని బడబాగ్నిని దాచేయడానికి పాలకులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా రైతుల ఆత్మహత్యలు దాన్ని బయటపెట్టేస్తునే ఉన్నాయి. ఆ సంక్షోభాన్ని సృష్టించిన వారికి దాని

పరిష్కారం అవసరమే లేదు.

గ్రామాలు వల్లకాడైపోయి, మధ్య తరగతి రైతుల దాకా అతలాకుతలమై, అప్పులపాలై చచ్చిపోతోంటే, వ్యవసాయాధార కూలీలు పట్టణాలకు వలస పోతోంటే.. మొత్తం మీద కనీస కొనుగోలు శక్తి కూడా పతనమైపోవడంతో.. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రభుత్వం తీసుకొని వచ్చింది.

ఈ సంక్షోభం ముందుకు తెచ్చే తక్షణ రాజకీయ సమస్య నుంచి తప్పించుకోవడానికి, ప్రజలకు కనీస కొనుగోలు శక్తి అయినా లేకపోతే తలెత్తే మార్కెట్ సంక్షోభాన్ని నివారించడానికి పాలకులు ఎంచుకున్న మార్గం ఇది. దేశంలో అతిపెద్ద సమూహమైన కూలీ జనాలకు దినానికి వంద రూపాయలైనా చేతిలో పెట్టకపోతే రాజకీయంగా తలనెప్పి అని పాలకులకు బాగా తెలుసు.

వాళ్లు అతిపెద్ద ఓటు బ్యాంకు. అంతమంది ఓటర్లు ఆకలితో చచ్చిపోయినా, లేక జనాభా లెక్కలకు అందకుండా ఎక్కడెక్కడికో వలస వెళ్లిపోయినా ఎంత నష్టం ! మార్కెట్లోకి ఇబ్బడిముబ్బడిగా వస్తున్న సరుకులను కొనేవాళ్లే లేకపోతే మార్కెట్ శక్తుల సంక్షోభం తాము ప్రణాళికాయుతంగా నిర్మిస్తున్న వ్యవస్థకు ఎంత అవరోధం కలిగిస్తుంది?

వ్యవస్థను సంరక్షించాల్సిన బాధ్యత ఉన్న పాలకవర్గం తప్పక స్పందించాల్సిందే. దాని దగ్గర చాలా అస్త్రాలు ఉన్నాయి. అందులో ఒకటి ఉపాధి హామీ పథకం.

దండకారణ్య ఆదివాసుల నుడికారంలో రెండు సర్కార్‌లు ఉన్నాయి. ఒకటి: లూటీ సర్కార్, రెండు: జనతన సర్కార్.

ఈ దేశాన్ని పాలిస్తున్న లూటీ సర్కార్ నీటిపారుదల సౌకర్యం ఉన్న వ్యవసాయాన్ని, మెట్ట వ్యవసాయాన్ని.. రెండింటినీ నాశనం చేస్తోంటే.. దండకారణ్యంలోని ఆదివాసీ వ్యవసాయాన్ని జనతన సర్కార్ సుభిక్షంగా తీర్చిదిద్దుతున్నది.

బైటి నీటి పారుదల సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో అయితే రాష్ట్రాల మధ్య, ప్రాంతాల మధ్య నీటి పంపకాలు, అధికారులు కిందికి నీరు వదలడం, వదలకపోవడం, అక్రమ ఆయకట్టుదారుల 'దొంగతనాలు' వగైరాలు మాత్రమే చర్చనీయాంశాలుగా, పోరాటాలుగా మిగిలిపోయాయి. వర్షాధార ప్రాంతంలో అయితే పూడిక తీయని చెరువులు, శిథిలమైపోయి.. చివరికి మాయమైపోయిన కుంటలు మాత్రమే వార్తలు. అక్కడ మరే ఆరాటాలు ఉండవు.. పోరాటాలు ఉండవు. మొదటి నుంచీ ఉంటూ వచ్చిన నీటిపారుదల సౌకర్యాలు కూడా ఎండిపోయినట్లే అక్కడి ప్రజల బతుకూ, కన్నీళ్లూ ఎండిపోయి, కడాకు బతుకు మీద ఆశ ఉంటే పెండ్లాం బిడ్డలతో వలసపోతున్నారు. అదీ లేకుంటే ఉరిబెట్టుకుంటున్నారు.



నీటి పారుదల సౌకర్యం ఉన్న వ్యవసాయం, మెట్ట వ్యవసాయం, ఆదివాసీ వ్యవసాయం అనే ముక్కోణాకార భారతీయ వ్యవసాయంలో ఏది.. ఎందువల్ల.. ఏ అంతర్గత చలనాల వల్ల వ్యవస్థా స్వభావాన్నీ, దిశనూ సూచించే నిర్ణాయకంగా ఉంటుందనేది వేరే చర్చగాని వ్యవసాయాన్ని చుట్టుముట్టిన సంక్షోభాన్నయితే దండకారణ్య ఆదివాసులు తమ ప్రాంతంలోకి రానీయ లేదు. పైగా పెద్ద ఎత్తున ఉత్పత్తి ప్రక్రియలు కొనసాగిస్తున్నారని అక్కడి నుంచి వస్తున్న సాహిత్యం చదువుకున్నవాళ్లెవరికైనా అర్థం అవుతుంది. ఆ అభివృద్ధిని నేరుగాచూడటం ఎంత అపురూపం!

వ్యవస్థలోని మార్పుల్లో పై మూడు రకాల వ్యవసాయాల్లో ఏది నిర్ణాయకమైనా..వాటిలోని సంక్షోభ పరిష్కారానికి దండకారణ్య వ్యవసాయంలో కొన్ని మార్గాలు, పరిష్కారాలు ఉన్నాయి. వాటిని అమలు చేయగల రాజకీయ దిశా నిర్దేశం కూడా దండకారణ్య వ్యవసాయంలో ఉన్నది.

మళ్లీ వాన మొదలైంది.

ఈసారి తుంపర కాదు. ఊపు మీద వచ్చింది. పెడీ పెడీమని కొట్టింది. భలే ఆనందం కలిగింది. ఓ.. అని కొందరు కేకలు వేశారు. అందరూ బైట పెద్ద మనుషులు కదా? ఉరుకులు పరుగుల మీద వానలో తడుస్తూనే ఉంటారుగాని ఇట్లా తీరుబడిగా, విలక్షణ ప్రయాణం చేస్తూ ఎప్పుడు తడిసి ఉంటారు.?

తనివితీరా తడిసి ఆనందించారు.

అప్పటిదాకా కెమెరాలతో ఫోటోలు తీసుకుంటున్నవాళ్లంతా వాటిని తీసి బ్యాగుల్లో భద్రంగా దాచేశారు.

ఇంకొద్ది దూరం వెళ్లే సరికి పొద్దువాలుతోందనడానికి గుర్తుగా కావళ్లను, వలలను మోసుకుంటూ ఆదివాసులు ఎదురయ్యారు.

వాళ్లు మొదట అందరినీ కొత్తగా చూచినా, డ్రైవింగ్ చేస్తున్న మనుషులను గమనించి ఆ తర్వాత మావైపు చూచి చిరునవ్వు నవ్వారు. వాళ్ల చేతుల్లో ఉన్న వలలను చూస్తే .. 'ఈ అడవి మాదే'లో ... విప్లవోద్యమం అక్కడ మొదలయ్యాక 1998 నుంచి ఆదివాసులను చేపలు పెంపకంలోకి తీసుకొని వచ్చిందని చదివిన విషయం గుర్తుకు వచ్చింది.

000

**దారి పొడవునా కురిసేవానా.. వెలిసేవానా..**
**తడవడం, ఆరిపోవడం!**
**మనసుల్లో ఎన్నటికీ వాడిపోని జ్ఞాపకాల వనం**
**విషాదోద్వేగాలు రంగరించుకున్న అనుభవం**

**మనిషి చేతిలో సాగుతున్న మహాద్భుత సృజన కార్యం**

**జీవితాన్ని పణంపెట్టి నిర్మిస్తున్న మరో జీవితం**

... రెండు గంటలు ప్రయాణించాక యూనిఫాంలో తుపాకులు వేసుకొని ఇద్దరు గెరిల్లాలు దారికి అడ్డంగా నిలబడి కనిపించారు. వాళ్ల వాలకం చూస్తే మా కోసమే ఎదురు చూస్తున్నట్లనిపించింది. డ్రైవింగ్ చేస్తున్నవాళ్లు దిగారు. వాళ్లు ఏదో మాట్లాడుకుంటుంటే మేమూ దిగాం. వాళ్లు చేతులు కలిపి పేర్లు అడిగారు. వారిలో సూదంటురాయిలాంటి చూపు ఉన్న ఒక కుర్రాడు తన పేరు వర్గీస్ అని చెప్పాడు.

మాతో వచ్చిన ఓ కేరళ మిత్రుడు అలనాటి మళయాళం అమరుడు వర్గీస్ గురించి ఇంగ్లీషులో ప్రస్తావించాడు.

నీకు వర్గీస్ ఎవరో తెలుసా? అని అడిగాను.

అతడు నవ్వుతూ నిలబడితే, వర్గీస్.. అని కేరళలో మన ఉద్యమం మొదలైనప్పుడు ఒక కామ్రేడ్ ఉండేవాడు. ఆయన్ను పోలీసులు చంపేశారు. ఆయన గురించి చాలా గొప్పగా చెప్తారు.. అన్నాను.

దానికి ఆ కుర్రాడు నిండుగా నవ్వాడు.

ఇంతలో మిగతా వాళ్లు మాట్లాడుకోవడం పూర్తయింది.

'మనం కొంచెం వెనక్కి వెళ్లాలి. అక్కడ మనవాళ్లు ఉన్నారు. కలుస్తారట..' అన్నారు.

బండ్లు వెనక్కి మళ్లాయి.

కొంచెం పక్కన ఓ గూడెం ఉంది. అక్కడి దాకా వెళ్లి నిలిపేశారు.

మాకు స్వాగతం పలుకుతూ పాతిక ముప్పై మంది దాకా గెరిల్లాలు వరుసగా నిలబడి ఉన్నారు. అందరికీ చేతులు కలిపి పిడికిలి బిగించి అభివాదం చేశారు. తమ పేర్లు చెప్పుకున్నారు. రెండు నిమిషాల్లో గుడారాల కిందికి మంచాలు తెచ్చి వాల్చారు. మరి కాసేపటికి వేడి వేడి టీ ఇచ్చారు.

ఉదయం చెర్లలో టీ తాగిందే. వానకు నాని, చలికి వణికుతూ వచ్చి అట్లా టీ తాగుతోంటే ... చాయ్ ఇంత బాగా ఉంటుందా? అనిపించింది.

అక్కడున్న మావోయిస్టు నాయకులు మధ్యలోకి వచ్చి తమను తాము పరిచయం చేసుకున్నారు. వారిలో ఉత్తర తెలంగాణ నాయకులు, చత్తీస్‌గడ్ నాయకులు ఉన్నారు.

ఆ తర్వాత మా అందరి పేర్లు, ఊర్లు, సంఘాల పేర్లు అడిగారు. అప్పటికల్లా పూర్తిగా చీకటిపడిపోయింది. ఓ పక్కన నుంచి పొయ్యి మంటల వెలుగు, టార్చీలు తప్ప మరే కాంతి లేదు. అక్కడక్కడ ఉన్న గుడిసెల్లోంచి చిరు వెలుగులు ప్రసరిస్తున్నాయి. అడవిలో.. చిరుజల్లుల మధ్య ఆ పలుచటి దీప కాంతి... వింతగా, కొత్తగా అనిపించింది.



ఏవో ఏర్పాట్లు.. హడావిడి కొంచెం సేపు నడిచింది.

ఈలోగా కొందరు పాటలు పాడటం మొదలు పెట్టారు. ఆదివాసీ పాటల్లోని యాస, విరుపు భలే అనిపించింది. భాష ఏమీ తెలియకపోయినా వాటి అర్థం కొంచెం కొంచెం తెలిసింది. ఇక రాత్రికి ఇక్కడే అనే నిర్ధారణ కావడంతో ఒక మజిలీ ముగిసిందని రిలాక్స్ అయ్యాం. పాటలయ్యాక ఓ పెద్ద గుడారంలో అందరం కూర్చున్నాం. మావోయిస్టు నేత కామ్రేడ్ హరిభూషణ్ మాట్లాడటం మొదలు పెట్టాడు.

దేశ వ్యాప్తంగా ఉన్న పౌరహక్కుల సంఘాల నాయకులకు, ప్రజాసంఘాల నాయకులకు, మేధావులకు సీపీఐ మావోయిస్టు పార్టీ తరపున విప్లవాభివందనాలు. చత్తీస్‌ఘడ్‌లోని బీజాపూర్ జిల్లా బాసగూడాలో ఆదివాసులపై కేంద్ర ప్రభుత్వం ఉసిగొల్పిన సీఆర్పీఫ్ బలగాలు సృష్టించిన మారణకాండపై నిజనిర్ధారణకు వచ్చిన మీ అందరికీ దండకారణ్య క్రాంతికారీ జనతన సర్కార్ కమిటీల తరపున రెడ్ సెల్యూట్స్.

మీరు రేపు బాసగూడా వెళ్లి ప్రజలను కలుసుకొని ఆ రోజు అక్కడ ఏం జరిగిందో వివరాలు తెలుసుకుంటారు. అయితే ఈ ఘటన గురించి మా పార్టీ అభిప్రాయాలు, మా దగ్గర ఉన్న సమాచారం కూడా విని మీరు నిర్ధారించుకున్న నిజా నిజాలు ప్రపంచం ముందు పెట్టండి.

పత్రికల్లో బాసగూడా ఎన్‌కౌంటర్‌గా ప్రచారం అవుతున్న ఆ ప్రాంతంలో సార్కిన్‌గూడా, కొత్తగూడా, రాజుపెంట అనే మూడు గ్రామాలున్నాయి. ఈ మూడు బాసగూడా పరిధిలోనివి. ఈ గ్రామాల ఆదివాసులు సుమారు వంద మంది జూన్ 20వ తేదీ రాత్రి సార్కిన్‌గూడా గ్రామంలో మీటింగ్ పెట్టుకున్నారు. రాత్రే ఎందుకు సమావేశమయ్యారని అనుకోవచ్చు. వర్షాలు కురుస్తున్నయి కాబట్టి పగలంతా పనుల్లో ఉంటారు కావట్టి ఆ రోజు రాత్రి సమవేశమయ్యారు. భూముల పంపకాలు, విత్తనాల అవసరాలు, ఏ పండగలు ఎప్పుడు చేయాలి? మొదలైనవి చర్చించుకోడానికి సమావేశమయ్యారు. ఈ ప్రాంతంలో సాల్వాజుడుం దాడుల వల్ల గ్రామాల్లో చాలా మార్పులు జరిగాయి. చాలా మంది నిలబడి కొట్లాడుతున్నా కొద్ది మంది బైటికి వెళ్లిపోయారు. సాల్వాజుడుం వాళ్లు ఇళ్లను తగలబెట్టారు. పొలాలను ధ్వంసం చేశారు. హత్యలు, అత్యాచారాలు చేశారు. దీంతో ఖమ్మం జిల్లా వైపు కొందరు వెళ్లిపోవడంతో వాళ్ల పొలాలు బీడుపడిపోయాయి. అయితే ఈ మధ్య సాల్వాజుడుంను మా సైన్యం దెబ్బతీశాక బైటికి వెళ్లిపోయిన వాళ్లు ఇప్పుడిప్పుడే తిరిగి వస్తున్నారు. అట్లా వచ్చిన వాళ్లకు భూములు కేటాయించి, పశువులు, నాగళ్లు సహకార పద్ధతిలో సమకూర్చడం గురించి మాట్లాడుకోడానికి ఆరోజు సమావేశమయ్యారు. అంతేకాదు.. సాల్వాజుడుం

వైపు ఉన్నవాళ్లను వెనక్కి రమ్మని మేం చాలా రోజుల నుంచే క్యాంపెయిన్ చేస్తున్నాం. ఇటీవల అక్కడి నుంచి వెనక్కి వచ్చి సాధారణ జీవితం గడపడానికి కొందరు సిద్ధపడ్డారు. వారికి కూడా భూములు చూపడానికి అక్కడ సమావేశం అయ్యారు.

అయితే అంతక ముందు వారం పది రోజుల నుంచే ఆ ప్రాంతమంతా సీఆర్పీఎఫ్ బలగాలు పెద్ద ఎత్తున మోహరించాయి. ఈ సంగతి ఆదివాసులకు తెలుసు. అయినా తొలకరి కురిసింది కావట్టి వ్యవసాయ అవసరాల రీత్యా సమావేశమయ్యారు. అక్కడ ఎవరి దగ్గర ఆయుధాలు లేవు. కనీసం సంప్రదాయ ఆయుధాలు కూడా వాళ్ల దగ్గర లేవు.

సమావేశం మొదలయ్యాక వందలాది మంది చుట్టుముట్టి కాల్పులు జరిపారు. అక్కడికక్కడే కొందరు చనిపోతే, కొందరిని వెంటాడి చంపేశారు. ఎనిమిది మంది మహిళలపై ఆ రాత్రి అత్యాచారం చేసినట్లు తెలుస్తోంది. ఈ దుర్మార్గాన్ని ప్రభుత్వం, సీఆర్పీఎఫ్ అధికారులు ఎన్‌కౌంటర్‌గా ప్రచారం చేస్తున్నారు. దీనికి వాళ్లు – ఆరుగురు పోలీసులు గాయపడ్డారని సాక్ష్యం చూపిస్తున్నారు. పోలీసులు గాయపడ్డ మాట వాస్తవమే. మీటింగ్‌లో ఉన్న వాళ్లను నాలుగు వైపులా చుట్టుముట్టి కాల్పులు జరపడం వల్ల వాళ్ల తూటాలు వాళ్లకే తగిలి గాయపడ్డారు.

అదే ప్రాంతంలో మరో ఘటన కూడా జరిగింది. 28 రాత్రి సార్కిన్‌గూడాలో ఈ మారణకాండ సృష్టించి మర్నాడు చింతల్నార్ క్యాంపు నుంచి ఆ పక్కనే ఉన్న సిమిలిపెంట, పెంట గ్రామాలకు వెళ్లిన సీఆర్పీఎఫ్ పోలీసులు ఆ తెల్లవారుజామున పొలం దున్నుకుంటున్న మడకం లచ్చాలు అనే రైతును కాల్చేశారు. ఆయన అక్కడికి అక్కడే చనిపోయాడు. ఇది గమనించిన మడకం ముత్తా అనే మరో రైతు పరిగెత్తిపోయాడు. ఆయన్ను కూడా చంపేశారు.

సీఆర్పీఎఫ్ బలగాలు అక్కడి నుంచి ఇంకా ముందుకు పోతుండగా మిలీషియా దళం తారసడింది. కాల్పులు జరగడంతో జొన్నగూడా మిలీషియా కమాండర్ సోడిదూలా కాల్పులు జరుపుతూ చనిపోయాడు. ఈ దళానికి చెందిన ఒక మహిళను అరెస్టు చేసి హెలికాప్టర్‌లో తీసికెళ్లారు.

జూన్ 29 పొద్దున్నే జేగురుకొండ నుంచి మరో సీఆర్పీఎఫ్ బృందం సిలింగేర్ వెళ్లి 40 మంది గ్రామస్థులను అరెస్టు చేసి తీసికెళ్లారు. ఆ ఊరి మహిళలు స్టేషన్ మీదికి వెళ్లి పోరాడి విడిపించుకొని వచ్చారు.

ఇవాళ పత్రికల్లో బాసగూడా ఘటనగా ప్రచారం జరుగుతున్నది కానీ, నిజానికి అక్కడ మూడు సంఘటనలు జరిగాయి. మొత్తం 20 మందిని కాల్చేశారు. ఇందులో



ఒకరు మాత్రమే ప్రజా మిలీషియా దళం కమాండర్. మిగతా అంతా నిరాయుధులైన సాధారణ ఆదివాసీలు.

ఈ హత్యాకాండ జరగడానికి ఆర్నెల్ల ముందు నుంచి ఇటు ఆంధ్రా ప్రాంతం ఖమ్మం జిల్లా నుంచి, అటు చత్తీస్‌ఘడ్ వైపు నుంచి తీవ్ర స్థాయిలో గ్రేహౌండ్స్ బలగాలు, సీఆర్పీఎఫ్ బలగాలు ఆదివాసీ గూడేలపై దాడులు చేస్తున్నాయి.

ఆపరేషన్ గ్రీన్‌హంట్ రెండో దశలోకి వెళ్లాక ఈ ప్రాంతంలో దాడులు, హత్యలు చాలా పెరిగిపోయాయి. ఇక అరెస్టులు, జెయిల్లో పెట్టడం అయితే లెక్కే లేదు. ఈ మధ్యనే ఖమ్మం జిల్లా వాజేడు, చర్ల, దుమ్ముగూడెం, వెంకటాపురం మండలాల్లో 200 మంది ఆదివాసీ రైతులను, సంఘాల నాయకులను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గ్రేహౌండ్స్ పోలీసులు పోలీసు స్టేషన్‌కు తీసుకపోయారు. వీరిని చిత్రహింసలు పెట్టి 30 మంది మీద కేసులు పెట్టి వదిలేశారు. కొద్ది మంది ఇంకా జెయిల్లోనే ఉన్నారు.

ఈ కూంబింగ్ ఇప్పటికీ భారీ ఎత్తున జరుగుతోంది.

ఖమ్మం జిల్లాలోనేగాక బీజాపూర్ జిల్లా కిష్టారం ప్రాంతంలో పొట్టిపాడు, నిమ్మలగూడెం, దోకుం, కుమ్మడితోగు, కుంగవాంగు, చంద్రుగూడెం తదితర గ్రామాల్లోకి జూన్ మొదటి నుంచి బలగాలు చొచ్చుకొని వస్తున్నాయి. గ్రీన్‌హంట్ మొదలయ్యాక ఇది సాధారణ నిర్బంధంగా మారిపోయింది. దీనికి ప్రజల నుంచి ప్రతిఘటన కూడా ఉంది.

చత్తీస్‌ఘడ్‌లోని ఆదివాసీ ప్రాంతాల్లోని సహజ సంపదను దోచుకోడానికి జరుగుతున్న ప్రయత్నాలను విప్లవోద్యమం నాయకత్వంలో ప్రజలు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. ఒక పక్క గ్రీన్‌హంట్ ఆపరేషన్, ప్రజా ప్రతిఘటన, విప్లవ జనతన సర్కార్ల నిర్మాణం అన్నీ జరుగుతున్నాయి. బాసగూడా ప్రాంతంలో సీఆర్పీఎఫ్ బలగాలు 20 మందిని హత్య చేయడం వెనుక ఈ నేపథ్యం ఉన్నది. గ్రీన్‌హంట్ ఆపరేషన్ రెండో దశలో భాగంగా ఈ హత్యాకాండ జరిగింది.

ఈ విషయమై మీరు ఆ గ్రామాలవారి నుంచి కూడా సమాచారం తెలుసుకొని చత్తీస్‌ఘడ్‌లో ఎంత దుర్మార్గం జరుగుతోందో బైటి ప్రపంచానికి తెలియజేస్తారని మా పార్టీ నమ్ముతోంది. ప్రజాస్వామికవాదులుగా మీరు, మీ సంఘాలు ఆదివాసుల పక్షాన దృఢంగా నిలబడిన గౌరవనీయ చరిత్ర ఉంది.

అయితే ఇంకోమాట కూడా. రాజ్యం నుంచి ఇట్లాంటి దాడులు ఇంకా పెద్ద ఎత్తున జరుగుతాయి. ఇది ఇప్పుడే ఆగిపోయేది కాదు. సంఘర్షణ ఇంకా తీవ్రం అవుతుంది. ఎందుకంటే ఆదివాసీ ప్రజానీకం బహుళజాతి సంస్థల దోపిడీకి వ్యతిరేకంగా యుద్ధం

చేస్తున్నారు. అంతేకాదు, విప్లవ జనతన సర్కార్ ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను అమలు చేస్తున్నారు. ప్రజలు నిర్మించుకుంటున్న ప్రత్యామ్నాయ ప్రజా వ్యవస్థలను నాశనం చేయడానికి ఇట్లాంటి దాడులకు ప్రభుత్వం పాల్పడుతోంది.

ఇక్కడ ప్రత్యామ్నాయం ఉంది కావట్టి రాజ్యం ఈ యుద్ధాన్ని ఇంకా తీవ్రం చేస్తుంది. అయితే ప్రజలు సైన్యంగామారి ప్రతిఘటిస్తున్నారు. ప్రజాస్వామికవాదులు కూడా ఈ యుద్ధానికి వ్యతిరేకంగా పోరాడాలని మా పార్టీ పిలుపునిస్తోంది. దోపిడీకి గురవుతున్న నూటికి తొంభై మంది సాయుధులు కావాలనే మేం పిలుపు ఇస్తున్నాం. ఇందులో ప్రజాస్వామికవాదులు, బుద్ధిజీవుల పాత్ర చాలా ఉంది. లేకపోతే ఈ బీభత్సాన్ని ఆపడం సాధ్యం కాదు.

**మిగిలిందేమిటి?**
**ఇది ఒకనాటి నిర్ణయం కాదు**
**మనిషి అడుగుల్లోంచి తలెత్తి లేచిన చరిత్ర**
**గెలుపు ఓటముల నిమిత్తం లేని పెనుగులాట**
**శాస్త్ర దర్శనంతోశాశ్వత విజయం కోసం సాగుతున్న నిజమైన చరిత్ర**

**మిగిలిందేమిటి?**
**ప్రతిఘటన కోసం మాటలను వెతకండి**
**వాక్యాలను పేర్చండి**
**మేధోసీమను సారవంతం చేయండి**
**అక్షరమక్షరాన్ని యుద్ధం కోసం దట్టించండి**
**అందుకోవలసిందేమిటి?**
**అరణ్య పవనాల మీంచి మీకిదే సాయుధ స్వాగతం**

ఆయన మాట్లాడాక ఆయన ప్రసంగాన్ని ఒక మిత్రుడు హిందీలోకి అనువాదం చేశాడు. కొన్ని ప్రశ్నలు నడిచాయి. మాతో వచ్చిన మీడియా వాళ్లు ఆయనతో ఏవో కాసేపు వార్తలు కాగల విషయాలు అడిగారు.

ఆ తర్వాత ఆయన పక్కకు పోగానే మేం ఇద్దరం అనుసరించాం

గుడారం పక్కన మరో గుడిసెవారగా నిలబడి వాన తుంపరలో కొద్ది కొద్దిగా తడుస్తూ కామ్రేడ్ హరిభూషణ్‌తో మరి కొన్ని విషయాలు మాట్లాడాం.

పోగానే ఆయనకు ముందే చెప్పాం.

'ఈ ఘటన మీద మేం ఏమైనా రాయాలనుకుంటున్నాం. దానికి ఇక్కడ సేకరించుకొనే



విషయాలతోపాటు మీ నుంచి నేరుగా మరింత సమాచారం కావాలి. ముఖ్యంగా జనతన సర్కార్ గురించి. అదీ నిర్దిష్టంగా బీజాపూర్ జిల్లా ఏం జరుగుతుందో చెప్పాలి..' అని అడిగాం.

దాంతో ఆయన నిజనిర్ధారణ బృందంతో మాట్లాడటం అయిపోయాక మాకు కొంత సమయం కేటాయించాడు.

ఆయన ఇలా చెప్పుకుంటూ వచ్చారు.

నేను మొదట సాల్వాజుడుం దగ్గర ప్రారంభిస్తాను. విప్లవోద్యమాన్ని దెబ్బతీయడానికి స్థానిక పెత్తందార్లు, పోలీసులు, రాజకీయనాయకులు కలిసి సాల్వాజుడుం ప్రారంభించారు. లంపెన్స్, కొద్ది మంది నిరుద్యోగులయిన ఆదివాసీ యువకులు సాల్వాజుడుం ప్రభావానికి గురయ్యారు. కొందరు ఎస్పీవోలుగా చేరారు. లగ్జరీల కోసం గ్రామాల మీద దాడులు చేసి డబ్బులు దండుకునేవారు. మహిళలపై అత్యాచారాలు చేసేవారు. సాల్వాజుడుం దాడులతోపాటు ఈ లంపెన్ సెక్షన్‌ను కూడా బాగానే పెరిగింది. రోడ్డు పక్కన గ్రామాల్లో తీవ్రమైన బీభత్సం సృష్టించారు. దీన్ని విప్లవోద్యమం నాయకత్వంలో ఆదివాసులు తిప్పికొట్టారు. సాల్వాజుడుం క్యాంపుల మీద, ఎస్పీవోల మీద దాడులు చేయాల్సి వచ్చింది. ఎర్రబోలు ఘటన అలాంటిదే. సాల్వాజుడుం బృందాలు దాడులు చేయడానికి వాహనాల్లో వస్తున్నప్పుడు ప్రజా మిలీషియా దాడులు చేసింది.

దీంతో సాల్వాజుడుం భయపడిపోయింది. మేం సైనికంగా దెబ్బతీయడమేగాక ఆ వైపు ఉన్నవాళ్లకు శిబిరాల్లో నుంచి బైటికి రావాలని పిలుపు ఇచ్చాం. రాహత్ శిబిరాల్లోంచి బైటికి వచ్చి సాధారణ జీవితం గడపండి. మా నుంచి మీకు ఏ ఇబ్బంది ఉండదు. భూములు దున్నుకొని బతకండి .. మీకు కావల్సిన ఏర్పాటు చేస్తాం అని చెప్పాం. మీరు ఆ వైపు ఉండాల్సివాళ్లు కాదు.. విప్లవంలోకి రావాల్సిన వాళ్లు.. అని ఆహ్వానించాం.

అంటే – సాల్వాజుడుంను మేం రెండు రకాలుగా ఎదుర్కొన్నాం. ఒకటి.. వాళ్ల దుర్మార్గాలను అదుపు చేయడానికి తీవ్రమైన ప్రతిదాడులు చేశాం. అంటే సైనిక చర్యలు తప్పలేదు. రెండు.. ఆదివాసుల మధ్య రాజ్యం, స్థానిక పెత్తదార్లు సృష్టించిన విభేధాలను రాజకీయంగా పరిష్కరించే ప్రయత్నించాం. ఆ పక్కకు పోయిన వాళ్లకు అనేక రకాలుగా చెప్పి, నమ్మకం కలిగించి సాల్వాజుడుం శిబిరాల నుంచి బైటికి వచ్చేలా చేశాం.

ఈ రెండు పద్ధతుల వల్ల శతృవు కుట్రపూరితంగా తీసుకొని వచ్చిన సాల్వాజుడుం వెన్ను విరిచేశాం. దీనికి బైట నడిచిన ప్రజాస్వామిక వాదుల పోరాటం కూడా సాయం చేసింది.

**ప్రశ్న: బీజాపూర్, సుక్మా జిల్లాల్లో భూపంపకాలు ఎలా ఉన్నాయి?**

సల్వాజుడుం దాడుల వల్ల మొదట్లో చాలా ఇబ్బందులు వచ్చాయి. ఇక్కడ ఉండి కొట్లాడలేని కొందరు ఆదివాసులు ఆంధ్రా ప్రాంతానికి, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. వాళ్లందరికి ఇక్కడ భూములు ఉండేవి. దున్నుకొని బతికేవారు. అవన్నీ బీడుపడిపోయాయి. దాంతో భూమి పంపకాలు మళ్లీ మళ్లీ చేయాల్సి వస్తుంది. భూమి పంచడం మాత్రమే కాదుగదా.. అది వాళ్ల అనుభవంలో ఉండాలి. వాళ్లు ఉత్పత్తిలో ఉండాలి. సాల్వాజుడుం దాన్ని డిస్ట్రర్బ్ చేసింది.

అసలు అంతక ముందు దంతెవాడ, సుక్మా, బీజాపూర్ జిల్లాలో మేం ఎవరు భూస్వామి, ఎవరు ధనికరైతు, అసలు భూమి లేనివాళ్లు ఎవరు..? అనే వర్గ విశ్లేషణ చేశాం. ఇక్కడ వర్గ విశ్లేషణ భూమి ఎంత ఉంది అనే పద్ధతిలో మాత్రమే కాదు. ఇక్కడ భూమి ఎంత ఉంది అనే పద్ధతిలో భూస్వామి ఎవరు? ధనిక రైతు ఎవరు? అని తేల్చలేం. వాళ్లకు పండుతున్న పంట ఎంత? అనేదాన్నిబట్టి నిర్ణయించాలి. ఒక్కొక్కరు ఇరవై ముప్పై ఎకరాలు అడవి కొట్టుకొని ఉంటారు. కోయల్లో చాలా మంది సంచారంలో ఉంటారు. జగ్దల్‌పూర్ ప్రాంతంలో నలుగురు అన్నదమ్ములు ఉన్నారనుకోండి.. వాళ్లలో ఒకరిద్దరు ఇక్కడికి వస్తారు. ఇక్కడి నుంచి ఖమ్మం జిల్లాకు వెళ్లి అక్కడ అడవి కొట్టుకొని బతుకుతూ ఉంటారు.

దాంతో ఇక్కడ భూమి సాగులోకి వస్తుంటుంది.. పడావు పడుతూ ఉంటుంది. కాబట్టి భూమి ఎంత ఉంది అని కాకుండా ఆదాయం ఎంత ఉంది? అనేదానితోపాటు..గూడెం మీద పెత్తనం చేయడం, జనాలకు ఆవులు, మేకలు ఇచ్చి చెరువులు, కుంటలు ఎక్కువ పోయించుకోవడం.. లాంటివాటి ఆధారంగా నిర్ణయిస్తాం. ఊరి పెద్ద మనిషి కావడంతో అందరితో పని చేయించుకుంటాడు. భూమి లేనివాళ్లను, బైటి నుంచి బతకడానికి వచ్చినవాళ్లను జీతానికి పెట్టుకుంటాడు.

కొన్ని చోట్ల అయితే ఊరు ఎవరు పొందించి ఉంటారో వాళ్లదే అక్కడి భూమి అంతా. ఎంత అడవి కొట్టినా భూమి వాళ్ల కిందే ఉండేది. పేదవాళ్లను ఒక ఎకరా అడవి కొట్టుకోనిస్తే .. భూస్వామికి పని చేయాలి. ఈ పద్ధతుల వల్ల ఇక్కడ వర్గాలు ఏర్పడ్డాయి.

ఈ ప్రాంతంలో కోయ, మురియ కోయ ఒకటే. ఇక్కడ వాళ్లే ఉన్నారు. నిమ్మలగూడెం ప్రాంతంలో దొర్ల కోయ ఉన్నారు. అక్కడా, ఇక్కడా కూడా వర్గాలు ఏర్పడ్డాయి. అయితే ఆదివాసీ భూస్వాములు కూడా పనులు చేస్తారు. 100 ఎకరాలు, 30 ఎకరాలు ఉన్నవాళ్లు ఉన్నారు. భూమి ఎక్కువ కొట్టుకొని సొంతం చేసుకున్నారు. వాళ్లకు ఎక్కువ పంట పండి ఎక్కువ ఆదాయం వస్తుంటుంది.

కాబట్టి వాళ్ల భూమిని అసలే భూమిలేని వాళ్లకు పంచాము. ధనిక రైతుల



భూములకంటే భూస్వాముల భూములనే పంచేసినం. కొత్తగా భూమి చదును చేయడం, ఎక్కువ భూములు ఉన్నవాళ్లవి తీసి లేనివాళ్లకు పంచడం అనే రెండు పనులు చేశాం. దీంతో ఇప్పుడు ఇక్కడ భూమి లేని వాళ్లు అసలు లేనేలేరు.

అయితే అనేక కారణాల వల్ల పడావు పడటం, మళ్లీ సాగులోకి తేవడం.. తప్పనిసరి అవుతోంది.

భూములు పంచడంతోపాటు సంఘాలు పెట్టాం. వాటిలో పని చేస్తూ ఆదివాసులు పార్టీ సభ్యులుగా ఎదిగారు. దాంతో పార్టీ సెల్స్ పెట్టాం. గ్రామంలో సమస్యలన్నీ పరిష్కరించగలిగే అధికారం సెల్స్‌కు వచ్చాక జనతన సర్కార్ కమిటీలు అక్కడి నుంచి తయారైనవే. ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో సహకార సంఘాలు ఏర్పడ్డాయి. అవి ధాన్యం సేకరించి పేద, మధ్య తరగతి రైతులకు ఇస్తాయి. వాళ్లు వాటిని తిరిగి పంట మీద పెడతారు.

అయితే ఇక్కడ చెరువు కింద నాట్లు పెట్టడం తక్కువ. హరియాద పద్ధతి ఎక్కువ ఉండేది. అంటే చెరువులాగా కట్టకట్టి దాంట్లోనే వడ్లు అలుకుతారు. దొర్ల తెగ అయితే నాట్లు పెడతారు. అయితే శాస్త్రీయంగా చెరువు నిర్మించడం, దాంట్లో ఎక్కువ నీరు నిలువ చేసుకోవడం, దానికి తూము పెట్టి అలుగు పారించడం వంటివి తెలియవు. అయితే ఇదంతా ఉద్యమం మొదలైన రోజుల్లోని పరిస్థితి. ఇప్పుడు మారిపోయింది.

ఇందాక చెప్పాను గదా... జనతన సర్కార్ కమిటీలు తయారయ్యాక వాటి ఆధ్వర్యంలో సహకార కమిటీలు వచ్చాయని. అట్లాగే వ్యవసాయ కమిటీలను కూడా ప్రజలు తయారు చేసుకున్నారు. అందులో బైట ఉంటారే.. వ్యవసాయ అధికారులని. అట్లా ఈ కమిటీలో ఉండే బాధ్యులు.. రైతులకు వ్యవసాయానికి సంబంధించిన సలహాలు ఇస్తారు. రైతుల అవసరాలన్నిటినీ జనతన సర్కార్ ఆధ్వర్యంలో తీర్చుతారు.

వీళ్లు వ్యవసాయం గురించి, రైతుల అవసరాల గురించి శాస్త్రీయంగా ఆలోచించే స్థాయిలో ఉంటారు. వీళ్లకు జనతన సర్కార్, పార్టీ అవసరమైన శిక్షణ ఇస్తాయి. అయితే ఏదీ రెడీమెడీగా ఉండదు. అన్నీ ఒక రాజకీయ దృష్టితో, శాస్త్రీయ అవగాహనతో పెంచుకుంటూ పోవాల్సిందే.

దానికి ఇక్కడే వనరులు ఉన్నాయి. ఉదాహరణకు తెలంగాణలో ఇక్కడి కంటే వ్యవసాయంలో అభివృద్ధి చెంది ఉన్నారు. నిజామాబాద్ నుంచి వచ్చినవాళ్లకు చాలా మెలకువలు తెలుసు. చత్తీస్‌ఘడ్‌లో కూడా కొన్ని ప్రాంతాల్లో కొంత అవగాహన ఉంది. ఆ అవగాహన లేని ఆదివాసులకు జనతన సర్కార్ .. వాళ్లకు ఏది అవసరమో దాన్ని కల్పిస్తుంది. అందువల్ల వ్యవసాయ కమిటీకి సంబంధించిన వాళ్లు ఇక్కడి నుంచే

తయారవుతున్నారు. దీంతో పంటలు బాగా పండుతున్నాయి.

**ప్రశ్న: భూమి చదును కార్యక్రమం ఎలా ఉంది?**

దీన్ని కూడా జనతన సర్కార్ కమిటీలు చేపట్టాయి. ఈ మూడు జిల్లాలో బైటి లెక్కల ప్రకారం అయితే సుమారు కోటి రూపాయాల శ్రమతో భూమి చదును చేశారు. పూర్వ బస్తర్ అంతా రెండో సారి నేల చదును కార్యక్రమం నడుస్తోంది. నేల చదును, తిరిగి సాగులోకి తేవడం ప్రధానంగా సహకార పద్ధతిలో నడుస్తోంది. ఎవరి భూమి చదునుగా లేదో దాన్ని చదును చేయడం, కొత్త భూములు చదును చేయడం కోసం అందరూ కలిసి శ్రమ చేస్తారు. ఇందులో కూడా పేదవాళ్ల భూమి చదును చేయడానికి ప్రాధాన్యత ఉంటుంది. ఆ పనిలో మధ్య తరగతి, ధనిక రైతులు కూడా పాల్గొంటారు.

ఏ ఊళ్లో ఎవరి పొలాలకు చెరువు లేదో జనతన సర్కార్ కమిటీ పరిశీలించి నిర్ణయం తీసుకుంటుంది. దాన్ని మిగతా విభాగాల ద్వారా సహకార పద్ధతిలో అందరూ కలిసి పని చేస్తారు. అట్లా ఈ వేసవిలో చాలా పనులు జరిగాయి. ముఖ్యంగా చెరువులు చాలా చోట్ల పోశారు.

బైటి నుంచి వచ్చి కొందరు అవన్నీ చూసి వెళ్లారు. అట్లా రెండు మూడు నెలలు సహకార పద్ధతిలో అందరికి ఏమేం కావాలో నిర్ణయించుకొని శ్రమ చేస్తారు. ఆ తర్వాత ఎవరి పొలాల్లో వాళ్లు పనులు చేసుకుంటారు.

**ప్రశ్న: జనతన సర్కార్ పని తీరు ఎట్లా ఉంటుంది?**

ఇందాక చెప్పాను గదా? సహకార పద్ధతిలో, సమిష్టి పద్ధతిలో ప్రజల అవసరాలన్నీ తీరేలా సర్కార్ చూసుకుంటోంది. అయితే మొత్తం మీద కొంత భాగం సమిష్టి పద్ధతి అమలవుతున్నా సహకార పద్ధతితో పోల్చితే అది తక్కువ. అందుకే భూమి పంపిణీ చేయాల్సి వస్తోంది. ఇప్పటికే రెండూ ఉన్నాయి. సమిష్టి దిశగా మొత్తం దండకారణ్య ఉత్పత్తిని తీసికెళ్లడానికి జనతన సర్కార్ ప్రయత్నిస్తున్నది.

నూతన ప్రజాస్వామిక విప్లవ దశలోని మొదటి రూపం ఈ జనతన సర్కార్. మొదటి మెట్టు అనుకోవచ్చు. అందువల్ల అంతా సమిష్టిగా మార్చడం ఇప్పడప్పుడే కుదరదు. ప్రజల చైతన్యం ఆ దిశగా పెంచకుండా వాళ్లకు సాధ్యం కాని రూపాన్ని ముందు పెట్టకూడదు. అందుకే సహకార పద్ధతి కూడా నడుస్తోంది. ఒక ఉన్నత రూపం ముందుకు తెచ్చినప్పుడు దాన్ని కంట్రోలు చేయగలిగే శక్తి, దాన్ని కాపాడుకొనే శక్తి రెండూ ఉండాలి. తొలి రూపమైన జనతన సర్కార్ కమిటీలను మరింత బలోపేతం చేయాల్సిన దశ ఇది.

ఇప్పటికైతే 500 నుంచి 800 మంది ఉన్న గూడేల్లో ఒక జనతన సర్కార్ కమిటీ ఏర్పాటవుతోంది. సుమారుగా గ్రామ పంచాయతీ అంత అనుకోవచ్చు. అది ఆ గూడేలకు



ప్రభుత్వం. ఆ కమిటీ కింద న్యాయశాఖ, వ్యవసాయ శాఖ, ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, అటవీ శాఖ, సహకార శాఖ, విద్యాశాఖ, సాంస్కృతిక శాఖ.. మొదలైనవి ఉంటాయి. ఇవన్నీ స్థానికంగా ఉండే వనరులు, మానవ శ్రమ, శాస్త్రీయ అవగాహన ఆధారంగా నడుస్తున్నవే.

ఉదాహరణకు– విత్తనాల ఎంపిక, పంపిణీ, ఎరువులు మొదలైనవి సర్కార్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ ప్రధానంగా చూసుకుంటుంది. ఇక్కడ అన్నీ స్థానిక వంగడాలనే వాడుతున్నారు. సుమారుగా ముప్పై నలభై రకాల విత్తనాల రకాలు ఉన్నాయి. వరి, జొన్న, నువ్వులు, సామలు, గట్కలు, తైదలు పండిస్తారు.

మాడ్ డివిజన్‌లో ఎక్కువ గుట్టల ప్రాంతం ఉంటుంది. కోల, సామలు, గట్కలు, మినుములు ఎక్కువగా పండిస్తారు. ఇక్కడి నేలకు, వాతారణానికి ఇక్కడి విత్తనాలు బాగా సరిపోతాయి. వ్యవసాయ శాఖ బాధ్యులు ఇక్కడ పండిన పంటలో విత్తనాలు ఎంపిక చేసి అందరికీ పంపిణీ చేస్తారు.

**ప్రశ్న: మేం వస్తోంటే దారి పొడవునా చెరువులు, కుంటలు కనిపించాయి?**

అవును అవన్నీ జనతన సర్కార్ తరపున ప్రజలు సహకార పద్ధతిలో పోసుకున్నారు. ఈ పని నడిచిన రోజుల్లో సర్కార్ ధాన్యం సేకరించి తిండి ఏర్పాటు చేస్తుంది. అదిగాక సర్కార్ ప్రతి చెరువుకు అవసరాన్ని బట్టి కొంత నిధిని మంజూరు చేస్తుంది. పార్టీ కొంత నిధిని జనతన సర్కార్‌కు సమకూర్చుతుంది. దాంట్లోంచి ఇట్లాంటి అభివృద్ధి పనులకు కమిటీలు మంజూరు చేస్తాయి. చెరువు పూర్తయ్యేదానికి కావాల్సినవి, వ్యవసాయ పరికరాలు, వైద్యం మొదలైనవాటికి అవసరమైనవి దాన్నుంచి సమకూర్చుకుంటారు. ఇదొక పద్ధతి. పెద్ద చెరువులు తవ్వాల్సి వచ్చినప్పుడు చాలా పని రోజులు అవసరం. నెలల తరబడి చేయాల్సి వస్తుంది. సర్కార్ కొంత వేతనం కూడా ఇస్తుంది. ఇది చాలా తక్కువే. సహకార శ్రమే ప్రధానం.

రాబోయే రోజుల్లో వ్యవసాయ అవసరం కొద్దీ పెద్ద నిర్మాణాలు కూడా చేపట్టాలని అనుకుంటున్నాం. ఐదు వేలు, పది వేల ఎకరాలకు నీరు పారించే నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. కొంచెం పెద్ద నిర్మాణాలు అక్కడక్కడా జరిగాయి. వేల మంది ఆదివాసులు కలిసి ఈ పనులు చేస్తున్నారు. మొదట్లో ఈ పనులు ఆదివాసులకు చాలా కొత్తగా ఉండేవి. కానీ జనతన సర్కార్‌లో భాగమయ్యే క్రమంలో ఇవన్నీ అర్థం చేసుకొని నేర్చుకున్నారు. వీటి ఫలితం తెలిశాక చాలా చురుగ్గా పాలుపంచుకుంటున్నారు.

బైట సహకారం అనేది కనిపించదు. పక్కనున్నవాణ్ణి మర్డర్ చేసి పోవడం, పెళ్లాం పుస్తెలు కూడా లాక్కపోవడం, తల్లిదండ్రులను చంపడం, ముసలోళ్లు బతికి ఉండగానే

బొందపెట్టి బరువు దించుకోవడం, ఆస్తి కాజేయడం.. ఇదే ఉంది. ఇక్కడ అలాంటివి ఏమీ లేవు. ముఖ్యంగా దోపిడీ లేదు. మహిళలకు ఉద్యమం రాకముందు చాలా కష్టం ఉండేది. బలవంతపు పెళ్లిళ్లు చేసేవాళ్లు. రెండో భార్యగా, మూడో భార్యగా ఎత్తుకపోయేవాళ్లు. ఇప్పుడు అవన్నీ పోయాయి. ఎక్కడన్నా జరిగినా జనతన సర్కార్ కమిటీలకు వెంటనే తెలిసిపోతుంది. జోక్యం చేసుకొని సమస్యను అర్థం చేయించి పరిష్కరిస్తాయి.

నిజానికి ఇక్కడ ఉద్యమం మొదలైన తొలి రోజుల్లో భూమి దున్నే అలవాటు, ఆవులను కట్టేసే అలవాటు లేకుండే. అడవిని నరికి కాలబెట్టి సాగులోకి తెచ్చుకొనే పాత పద్ధతే ఉండేది. మాడ్ ప్రాంతంలో ఎక్కువగా పోడు వ్యవసాయం నడిచేది. ఇప్పుడు అక్కడ కూడా ఎద్దులను ఉపయోగించి భూమి దున్ని వ్యవసాయం చేస్తున్నారు.

గుట్టల మీద అయితే అప్పట్లో – అడవి కాలబెట్టి సాగులోకి తెచ్చేవారు. మిగిలిన బూడిద ఎరువుగా ఉపయోగపడుతుంది. వర్షాలు కురవగానే విత్తనాలు వేస్తారు. ఎక్కువగా గడ్డి జాతికి చెందిన కోల, తైద, రాగులు పండించేవాళ్లు.

పంటను చేల దగ్గరే పెట్టేవారు. ఇండ్లలోకి తెచ్చుకొని నిల్వ చేసుకోవాలని తెలియదు. ఇండ్లు కూడా చిన్నగా ఉంటాయి కాబట్టి పంటను చేలోనే ఉంచేసి అవసరమైనప్పుడల్లా వెళ్లి తెచ్చుకొని దంచుకొని వండుకొనేవాళ్లు. ఒకసారి వ్యవసాయం చేయగా వచ్చిన ధాన్యం అయిపోయాక మళ్లీ పంట పెడతారు. ఒక్క సంవత్సరం అంతా పొలం ఖాళీగా ఉండేది.

ఎందుకంటే దాచుకోవడమే తెలియనివాళ్లకు అమ్ముకొని లాభాలు పొందాలనేది ఉండదు కదా? ధాన్యం అయిపోయాక మళ్లీ సాగు చేసేవాళ్లు. మొదట్లో ఇక్కడికి వచ్చిన విప్లవకారులు కూడా అవే తిన్నారు. ఒక చోట నేల దున్నితే రెండు మూడేళ్లు పంటలు పండిస్తారు. ఆ తర్వాత దాన్ని వదిలేసి మరోచోట మొదలు పెడతారు. ఇప్పుడు అవన్నీ వదులుకొని నాగలిపట్టి దున్నడం నేర్చుకున్నారు.

జనతన సర్కార్ తన విభాగాల ద్వారా ప్రజా జీవితంలో చాలా ముఖ్యమైన పనులను.. బైట కూడా ఏవి గుర్తిస్తారో వాటన్నిటినీ నిర్వహిస్తోంది. విద్యా కమిటీల ద్వారా పాఠశాలలు నడుస్తున్నాయి. బైటి సూళ్లను కూడా మేం అనుమతిస్తున్నాం. చక్కగ రావాలి.. చదువు చెప్పాలి అని టీచర్లకు చెప్తున్నాం. పెద్ద పెద్ద గ్రామాల్లో, రోడ్డు పక్కన ఉండే గూడేల్లో..రేపు మీరు వెళ్తారు గదా? బాసగూడా అలాంటి చోటా, పోలీస్ స్టేషన్లు ఉండేచోటా బైటి స్కూళ్లు నడుస్తున్నాయి. మావోయిస్టులు స్కూళ్లను నడవనివ్వడంలేదని శత్రువు ప్రచారం చేస్తున్నాడు. దాన్ని కొందరు నమ్ముతున్నారు.



కానీ అది నిజం కాదు. కొంత మంది టీచర్లు దాన్ని సాకు చేసుకొని బళ్లకు రాకుండా జీతాలు తీసుకుంటున్నారు. మేం చాలా సార్లు చెప్పినం.. ఉద్యమానికి వ్యతిరేకమైన పనులు చేయకుండా బళ్లకు వచ్చి మంచిగ చదువు చెప్పండని. అంతేగాదు.. ఇక్కడే ఉండి ఉద్యోగం చేయమని టీచర్లకు, డాక్టర్లకు చెప్పాం. మేం స్కూలు భవనాలను పేల్చేస్తున్నామని ప్రచారం కూడా చేస్తున్నారు.

ఇది కూడా పూర్తిగా తప్పు. ఈ ప్రాంతం అంతా సీఆర్పీఎఫ్ బలగాలు స్కూళ్లను నడవనివ్వకుండా వాటిని స్వాధీనం చేసుకొని నెలలు, ఏండ్లు వాటిలో క్యాంపులు పెట్టారు. స్కూల్లో ఉంటూ గూడేల మీద దాడులు చేశారు. ఆ తర్వాత సాల్వాజుడుం కూడా స్కూళ్లను వాడుకుంది.

అసలు ఇక్కడ నిర్మించిన స్కూళ్ల భవనాలు మామూలుగా పాఠశాలకు పనికి వచ్చే గదుల నిర్మాణంలా ఉండదు. మీరు వెళ్లి చూడవచ్చు. పోలీసు క్యాంపులకు వాడుకోడానికి అనువుగా నిర్మించుకున్నారు. మేం అప్పుడప్పుడు పేల్చేసింది ఇట్లాంటి వాటినే. కానీ పిల్లలకు పాఠాలు చెప్తూ స్కూళ్లు నడుస్తున్నవాటిని కాదు.

ఈ స్కూళ్లుగాక జనతన సర్కార్ ఇక్కడి నుంచి మాడ్ డివిజన్ దాకా స్కూళ్లు నడుపుతోంది. బైటి స్కూళ్లు చాలా చోట్ల లేవు, ఉన్నా నడవడం లేదు. కొన్ని చోట్ల మావోయిస్టుల పేరుతో పాఠశాలలను తీసేస్తున్నారు. అట్లాంటి చోట జనతన సర్కార్ పాఠశాలను నడుపుతోంది. కావట్టి జనతన సర్కార్ నడిపే స్కూళ్లకే పిల్లలు బాగా వస్తున్నారు. కొన్ని చోట్ల ఆ స్కూళ్లు కూడా వెళ్తున్నారు.

అయితే ఇక్కడ ఇంకోటి కూడా ఉంది. మేం నడుపుతున్న స్కూళ్లకు పిల్లలుపోతే పార్టీలోకి వెళ్లిపోతారని కొందరు తల్లిదండ్రులు అనుకుంటారు. చాలా కొద్ది మందే అయినా ఈ భయం కూడా ఉంది. మళ్లీ ఆ తల్లిదండ్రులు జనతన సర్కార్ కమిటీల్లో పని చేసేవాళ్లే. ఆ స్కూళ్లలో చదువుకొని అటునుంచి అటే పార్టీలోకి పోతారనే ఫీలింగ్ ఉంది. ఇది ఒక వైరుధ్యం. పిల్లలు సర్కార్ కమిటీల్లోనో, ప్రజా మిలీషియాలోనే పని చేస్తే ఫర్వాలేదుగాని, పార్టీలో పని చేస్తే దగ్గర ఉండరని ఇట్లాంటి తల్లిదండ్రులు అనుకుంటున్నారు.

రెండు రకాల స్కూల్లు ఉన్నాయి. ఒకటి: మొబైల్ స్కూళ్లు. ఇవి సంచారంలో ఉంటాయి. పిల్లలు, టీచర్లు కూడా ఒక చోటి నుంచి మరో చోటికి తరలిపోతుంటాయి. ఇతర పనులతోపాటు చదువు కూడా ఉంటుంది.

రెండో రకంలో మూడు నెలలు, ఆర్నెల్లు స్కూళ్లు నడుస్తుంటాయి. ప్రస్తుతం ఐదో తరగతి దాకా చదువు చెప్తున్నారు. తెలుగు, హిందీ, గణితం, భూగోళం, కొంత వరకు

సైన్స్, పార్టీ కార్యక్రమం, మార్క్సిజం గురించిన ప్రాథమిక విషయాలు, సైన్యం గురించి బోధిస్తున్నారు.

**ప్రశ్న: ఈ మారణకాండ జరిగిన తీరు గురించి ఇందాక చెప్పారు. కానీ ఆ గ్రామాల గురించి ఇంకొంచెం చెప్పండి?**

రాజుపాలెంలో 20 ఇళ్లు, కొత్త గూడెంలో 40 ఇళ్లు, సార్కిన్‌గూడాలో 35 ఇళ్లదాకా ఉంటాయి. అంతక ముందు ఈ గ్రామాలు చాలా పెద్దవి. సాల్వాజుడుం దాడులకు ఈ ఊళ్లు బాగా దెబ్బతిన్నాయి. చాలా మంది వెళ్లిపోయారు. మూడేళ్ల నుంచి తిరిగి వస్తున్నారు. ఈ గ్రామాల్లో భూమి పంపకాలు బాగా జరిగాయి. ఈ గ్రామాలకు దగ్గర్లో కిష్టారం పోలీస్ స్టేషన్ ఉంది. అయినా ఆ చుట్టుపక్కల గ్రామాల్లో భూమి చదును కార్యక్రమం బాగా నడుస్తోంది. ఈ మూడు గ్రామాల్లో ప్రజలు వ్యవసాయానికి కుంటలు తవ్వుకున్నారు. ఈ ఊళ్లలో స్కూళ్లను సీఆర్పీఎఫ్ వాళ్లు క్యాంపులుగా మార్చుకున్నారు. ప్రజా గెరిల్లా సైన్యం వాటిని ధ్వంసం చేసింది.

**ప్రశ్న: మార్కెటింగ్ అనే సమస్య ఏమైనా ఉందా?**

ప్రత్యామ్నాయ అభివృద్ధి కార్యక్రమాలు పెరిగాక వ్యవసాయంలో ఉత్పత్తి పెరిగింది. అయితే ధాన్యం అమ్మకం ఇప్పటికీ లేదు. కొన్ని రోడ్డు పక్కన ఉండే గ్రామాల్లో అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రధానంగా వడ్లు, జొన్న వీళ్లే ఉపయోగించుకుంటున్నారు. ఉద్యమం ప్రోత్సాహంతో కూరగాయలు పండించడం పెరిగింది. వాటిని ఇక్కడ జరుగుతున్న సంతల్లో అమ్ముతున్నారు. బైలదిల్లా దగ్గర ఆదివాసులు పుట్టగొడుగుల దగ్గరి నుంచి అటవీ ఉత్పత్తులను సంతలకు తీసుకపోయి అమ్ముకుంటారు. పశ్చిమ బస్తర్‌లో కూడా ఎక్కువే. అయితే వరి అమ్మడం లేదు.

అట్లాగే బైటి మార్కెట్ ప్రభావం కొన్ని ప్రాంతాల్లో పెరుగుతున్నది. పాత రోజుల్లో ఆడవాళ్లు కూడా బట్టలు తక్కువ ఉపయోగించేవాళ్లు. మాడ్ ప్రాంతంలో రవికలు వేసుకొనే అలవాటు ఉండేది కాదు. ఇప్పుడు రకరకాల బట్టలు ఉపయోగిస్తున్నారు. అంగళ్లకు పోయి దుస్తులు కొనుక్కోవడం అలవాటైంది. మామూలుగా మార్కెట్లో దొరికే సరుకులు అన్నీ క్రమంగా పరిచయం అవుతున్నాయి. రోడ్డు పక్కన ఉండే ఆదివాసీ గూడేల్లో యువకులు సెల్‌లో చిప్స్ పెట్టుకొని సినిమా పాటలు వింటున్నారు. నారాయణపూర్ వంటి ప్రాంతాలకు బియ్యం తీసుకొనిపోయి అమ్ముకొని తమకు కావాల్సిన వస్తువులు కొనుక్కునే అలవాటు మొదలైంది. మాడ్ ప్రాంతంలో పండే రాగులు, కోల, తైదలు కొంత వరకు మార్కెట్‌లోకి వెళ్లిపోతున్నాయి. ఇప్పుడు బైట షుగర్, బీపీ వంటి వాటికి ఇలాంటి ధాన్యం తినడం అలవాటయ్యాక ఆదివాసుల దగ్గర చౌకగా కొనుక్కుంటున్నారు.



**ప్రశ్న: మహిళల పరిస్థితిలో ఎట్లాంటి మార్పు వచ్చింది?**

ఇందాక కొంత చెప్పినా కదా? చాలా దుర్భరంగా ఉండేది. పార్టీ వచ్చాక మారింది. మళ్లీ సాల్వాజుడుం కాలంలో మహిళలు చాలా ఇబ్బందిపడ్డారు. అందులో ఉండేవాళ్లు ఇద్దర్ని, ముగ్గుర్ని చేసుకునేవాళ్లు. అత్యాచారాలు చాలా జరిగాయి. ఈ నిర్బంధం మధ్యే మహిళా చైతన్యం చాలా పెరిగింది. స్వేచ్ఛగా క్రాంతికారీ మహిళా సంఘంలో ఉంటున్నారు. మహిళలకు స్వేచ్ఛ అంటే ఏమిటో పార్టీ వల్లనే తెలిసింది. దాంతోనే వాళ్ల భాగస్వామ్యం చాలా పెరిగింది. చదువుకోవచ్చు.. ముఖ్యంగా బలవంతపు పెళ్లిళ్లు రద్దయిపోయాయి. ఇష్టం ఉన్న పెళ్లి చేసుకోవచ్చు.

ఇప్పుడు ఇక్కడ జరుగుతున్న ప్రతిఘటనా దాడుల్లో ఎక్కువ మంది మహిళలే పాల్గొంటున్నారు. ఇటీవలే ఇక్కడా, ఖమ్మం జిల్లాలో జరిగిన దాడుల్లో మహిళలు గ్రేహౌండ్స్ పోలీసుల మీద, సీఆర్పీఎఫ్ పోలీసుల మీద తిరగబడ్డారు. కొండవాయి, చిన్నాపురం.. తదితర గ్రామాల్లో మంచి ప్రతిఘటన ఇచ్చారు. సంఘాల నుంచి ప్రజా మిలీషియాలో, మెయిన్ ఫోర్స్‌లో కూడా సగం మహిళలు ఉన్నారు. కొన్నిచోట్ల సగానికంటే ఎక్కువ కూడా ఉన్నారు.

పార్టీ ఆధ్వర్యంలో మూడు రకాల సైనిక విభాగాలు పని చేస్తున్నాయి. ఒకటి: జన మిలీషియా, రెండు: భూంకాల్ మిలీషియా, మూడు: గ్రామ రక్షక దళాలు. ఈ మూడిట్లో మహిళలు, బాలికలు సగం ఉన్నారు.

ఇక జనతన సర్కార్లలో, వాటి ఆధ్వర్యంలో నడిచే అభివృద్ధి కమిటీల్లో కూడా మహిళలు ఉంటున్నారు. కొన్ని కమిటీల్లో మహిళలే ఉంటున్నారు కూడా. చదవడం రాయడం రాకపోయినా సర్కార్ పనులు చేస్తున్నారు. పనుల నుంచి జ్ఞానం కలుగుతోంది. అందుకనే అక్కడక్కడ చదువు వచ్చిన వాళ్లు ఇద్దరు ముగ్గురు ఉండేలా ఏర్పాటు చేస్తున్నారు. డాక్టర్లు, టీచర్లలో కూడా కొందరు చదువు వచ్చిన మహిళలు ఉన్నారు. జనతన సర్కార్ బలోపేతం కావాలంటే చదువు చాలా అవసరం.

**ప్రశ్న: జనతన సర్కార్ భవిష్యత్ కార్యక్రమం ఏమిటి?**

చాలా పనులు ఉంటాయి గదా? ముఖ్యంగా వ్యవసాయాన్ని శక్తివంతం చేయాలి. వైద్యం ఆ తర్వాత స్థానంలో ఉంటుంది. ఎందుకంటే ఆరోగ్యం విషయంలో చాలా సమస్యలు ఉన్నాయి. దాని తర్వాత విద్య. ఈ మూడు ఇప్పుడు ఎంత బాగా నడుస్తున్నాయనుకున్నా అదంతా ప్రాథమిక దశే.

ఈ దశలో ఏవేవో చేయాలనుకొని లక్ష్యాలు పెట్టుకున్నా అవి సాధ్యం కాదు. ఎందుకు? అని మీరు అడగవచ్చు. ఈ సమస్యలు చాలా ఆచరణకు సంబంధించినవి.

ఫిలసాఫికల్‌గా ఆలోచిస్తే ఇబ్బందులు తెలుస్తాయి.

ఇక్కడి ప్రజల నేపథ్యం, వాళ్ల చైతన్య క్రమం దృష్టిలో పెట్టుకోకుండా నువు ఇది చెయ్యి.. ఇట్లా వ్యవసాయం చేస్తే మంచిది.. అని మనం పై నుంచి చెప్తే .. చేస్తరేమోగాని ..మంచిగ ఉండదు. ఆ రూపాలను కాపాడుకోవడం వాళ్లకు కష్టం. ఎందుకంటే .. ఇంత అభివృద్ధి జరిగిందని మనం అనుకుంటున్నా.. ఇక్కడి ఆదివాసుల్లో ఇంకా వెనుకబాటుతనం ఉంది. చాలా మూఢాచారాలు ఇంకా మిగిలే ఉన్నాయి.

ఆదివాసులు మామిడి చెట్టుకు నీళ్లుపోసి పెంచరు. మేం ఎప్పటి నుంచో నీళ్లు పోయకుండానే పెంచినాం అంటారు. ఇప్పుడు ఎందుకు పోయాలి? అని అడుగుతారు. మనం పొయ్యమంటే పోస్తరేమోగాని ఇంట్లో ఎవరికన్నా జ్వరం వస్తే చెట్టుకు నీళ్లపోసినదానికే ఇట్లయిందని అనుకుంటారు.

ఇట్లాంటి వాటిని కూడా దృష్టిలో పెట్టుకొని పని చేయాలి. ఈ ప్రాంతంలోనే గతంలో మూఢ నమ్మకాల పేరుతో చంపుకున్నారు కూడా. విప్లవోద్యమం వచ్చాక కూడా ఇక్కడ నరబలులు జరిగాయి. క్రమంగా బందయింది. ఇప్పుడు పూర్తిగా పోయింది.

అప్పట్లో మందులు లేవుగావట్టి చెట్ల పసుర్లు పోసేవాళ్లు. లేకుంటే దయ్యం పట్టిందని మంత్రాలు వేసేవాళ్లు. దీంతో విపరీతంగా చనిపోయేవాళ్లు. నీటి కాలుష్యం వల్ల కూడా చనిపోయేవారు. ఉద్యమం ఇక్కడికి రావడానికి ముందున్న స్థితితో పోలిస్తే ఊహించలేనంత తేడా వచ్చింది. కానీ ఇంకా ఆ వెనుకబాటుతనం పోలేదని గుర్తించాలి.

వర్షాలు కురిసే టయంలో వైద్య కమిటీ డాక్టర్ల టీంలను అన్ని ప్రాంతాల్లో ఉండేలా చూసి మందులు, వైద్యం ఏర్పాటు చేస్తోంది. కొంత మందిని గుర్తించి వాళ్లకు వైద్యంలో శిక్షణ ఇచ్చి ఆస్పత్రులను నడుపుతున్నాం. అందుకే బైటి నుంచి వైద్యులు వచ్చి ఆదివాసులకు వైద్యం చేయాలని పార్టీ పిలుపునిస్తోంది. ఎన్ఎస్ఎఫ్‌లాంటి వాళ్లు వచ్చి వైద్యం చేస్తున్నారు. వాళ్లను మేం వద్దని అనడం లేదు. కానీ వాళ్లు తమ ఆర్గనైజేషన్‌లో భాగంగా .. ఇలాంటి సంస్కరణల్లో భాగంగా ఉద్యమాన్ని దెబ్బతీసే ఉద్దేశం కూడా వాళ్లకు ఉంటుంది.

వ్యవసాయాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేయడంతోపాటు ఆరోగ్యానికే ప్రాధాన్యత ఇవ్వాలి. ఏ రంగంలోనైనా ఇంతకంటే ఎక్కువ స్థాయిలో వేగంగా ముందుకు పోవడానికి లేదు. ఏ నేపథ్యం ఉన్న జనాలు ఈ జనతన సర్కార్‌ను నిర్మిస్తున్నారో అర్థం చేసుకోవడం ముఖ్యం.

ప్రత్యామ్నాయ అభివృద్ధిని, జనతన సర్కార్ కమిటీలను ఎంత పెంచుకుంటూ పోయినా కాపాడుకోవడం చాలా ముఖ్యం. సైన్యం బలోపేతం కాకుండా కాపాడుకోవడం



సాధ్యం కాదు. వట్టిగ నిర్మాణం చేసుకుంటూ పోతే ధ్వంసమైపోతాయి.

ఎందుకంటే శతృవుది అంతా విధ్వంసం. ప్రజలదేమో నిర్మాణం. అందుకే ప్రతి గ్రామంలో ప్రజా మిలీషియా పెద్ద ఎత్తున తయారు కావడం చాలా ముఖ్యం. యువకులు, యువతులు దానిలోకి ఇంకా రావాలి. గ్రామ మిలీషియా, భూంకాల్ మిలీషియా వాళ్లు ప్రధానంగా శతృవును నిలువరించడానికి రోడ్లను తవ్వడం, చెట్లు నరికి అడ్డంగా వేయడం.. సాంప్రదాయక ఆయుధాలతో దాడి చేయడం, శతృవు కదలికలను ఎప్పటికప్పుడు ఆరా తీయడం.. మొదలైన ముఖ్యమైన పనులు చేస్తుంటాయి. ఇందులోనూ ఇంకా బలోపేతం కావాల్సి ఉంది.

అట్లాగే అభివృద్ధిలో కూడా ఇప్పుడు కొన్ని పరిమితులు ఉన్నాయి. ఉదాహరణకు కొన్ని అవసరాలు ఇక్కడి వనరుల వల్లే తీరవు. ఉదాహరణకు పెట్రోలు, డీజిల్ వంటివి. బైటి నుంచి రావాల్సిందే. దీనికి ఎంత పరిమితి ఉంటే కొన్ని కొత్త రూపాలను ప్రవేశపెట్టడానికి అంత పరిమితి ఉన్నట్లు. జనతన సర్కార్ వాటన్నిటిని అధిగమించాల్సి ఉంది... ఆ దిశగా మేం ఇంకా ప్రయత్నిస్తూ పురోగమించాల్సి ఉంది.. అని ముగించాడు.

**ముందుకే పోతామనడం కేవల ప్రతిన కాదు**
**ఆకాంక్ష కానేకాదు.. అవసరం**
**ఈ సంకుల సమరంలోని రహస్యమిదే**
**ఆదివాసుల అంతచ్ఛేతన సాయుధోత్తుంగ కెరటమై**
**అడవి చరిత్ర రచనకు దివిటీ ఎత్తుతోంది**
**పోరాటమంటే నిర్మాణమని ముందే తెలిసినా**
**ఇదిక నిర్మాణంగా మారుతున్న యుద్ధం**

... ఇంతలో ఆయన కోసం ఎవరో వచ్చారు.

మమ్మల్ని భోజనానికి వెళ్లమని చెప్పి హరిభూషణ్ పక్కకు వెళ్లారు.

అప్పటిదాకా కురుస్తున్న తుంపర కొంచెం పుంజుకుంది. అందరూ ఆ పెద్ద గుడారం కిందే గలగల మాట్లాడుకుంటూ, గెరిల్లాలతో చర్చిస్తూ ఉన్నారు. కాసేపట్లో అందరికీ భోజనాలు అక్కడికే వచ్చాయి.

ఆ రాత్రి.. అట్లా చిరు వెలుగుల్లో .. వాన కురుస్తూ ఉంటే..గెరిల్లాల వేడి వేడిగా అన్నం వడ్డించారు.

తిని ఎక్కడివాళ్లం అక్కడే ముడుక్కొని పడుకున్నాం.

వొళ్లంతా అలసటతో ఉన్నా ఎందుకో నిద్ర పట్టలేదు.

**ఒక ఊహ .. ఒక నిజం**

**కలగలసి ఇట్లా చేరువైంది**
**ఎంత విషాదాత్మకం..!**
**పది.. పదిహేడు.. ఇరవై..**
**నేలరాలిన వారి నెత్తుటి ఆనవాళ్ల వెతుకులాట**
**గాయపడిన విప్లవ జనతన సర్కార్ కోసం**
**అల్లుకుంటున్న మందిపాట**

... ఇట్లా జనతన సర్కార్‌లోకి అడుగుపెట్టడం! పదేళ్లకుపైగా వింటున్న మాటే అయినా దాని నిండైన అర్థంలో ఇప్పుడది ప్రపంచమంతా ఒక ఉద్వేగ ప్రసారమైపోయింది. బూర్జువా ప్రభుత్వం స్థానంలో ప్రజా ప్రభుత్వం నిర్మాణమవుతుందని కవిత్వం రాసిన వాళ్లకు ఇప్పుడది సాక్షాత్కారమవుతున్నది.

కామ్రేడ్ హరిభూషన్ అప్పటికప్పుడు.. హడావిడిగా.. క్లుప్తంగా.. ఒక పక్క వర్షంలో తడుస్తూ నాలుగు మాటలే చెప్పినా జనతన సర్కార్ గురించి ఇంత కాలం వింటున్న, చదువుతున్న వాటికి గొప్ప చేర్పు దొరికినట్లయింది. ముఖ్యంగా ఆయన వివరాల్లోకి పోలేకపోయినా కొన్ని ధోరణులు ప్రస్తావించాడనిపించింది. ఇంకా చాలా ఉంటాయేమోగాని, నేరుగా వాటిని ఆదివాసులతోపాటు ఉండి ప్రత్యక్ష్యంగా తెలుసుకోవాల్సిందే.

అయితే ఆయన చెప్పినతీరులో చాలా ఓపెన్‌నెస్ ఉందని ఎవరికైనా నమ్మకం కలుగుతుంది. విప్లవం నిర్మిస్తున్న వాళ్లకు ఉండాల్సిన బాధ్యతాయుతమైన నిజాయితీ ఇది. ప్రత్యామ్నాయ నిర్మాణంలో తలమునకలవుతూ కూడా, లోపలి నుంచే దాని వ్యాఖ్యాతులగా వాళ్లు పాటిస్తున్న వస్తుగతత్వానికి ఆయన మాటలు నిదర్శం. ఆయన జనతన సర్కార్ విశిష్టత గురించేగాక, ప్రస్తుతం అది ఉన్న దశ గురించి బాగా చెప్పాడనిపించింది. సమిష్టి.. సహకారం మధ్య ఉన్న తేడాతో ఉద్యమం ఎంత జాగ్రత్తగా, ఆదివాసుల చైతన్యాన్ని బట్టి వ్యవహరిస్తోందో తెలిసింది.

అసలు ఈ మొత్తాన్ని పార్టీ నిర్మించడం అని కాకుండా ప్రజలు తాము నిర్మించుకుంటున్న విషయంగా చూడటం చాలా కీలక అవగాహన. మావోయిస్టులు ఈ ప్రత్యామ్నాయ అభివృద్ధికి, జనతన సర్కార్ నిర్మాణానికి పార్టీ నాయకత్వం మాత్రమే వహిస్తున్నదనీ.. నిర్మాణకర్తలు ఆదివాసులనే ఎరుక ఉండటం ఆ ఉద్యమానికి ఉన్న ఆంతరంగిక బలం.

యుద్ధాన్ని తిప్పికొట్టడంలో ప్రజల పాత్ర గురించి కూడా ఇదే వైఖరి. అందుకే గ్రీన్‌హంట్ అనేది ప్రజలపై యుద్ధమని చెప్తూ వస్తున్నారు. ప్రజల సృజనాత్మకత,



భాగస్వామ్యం అనే ప్రాతిపదికపై నిర్మాణమయ్యే ఏ వ్యవస్థ మీద అయినా నమ్మకం పెట్టుకోవచ్చు. ఇది కేవలం ప్రజలను గౌరవించాలనే విలువగా కాకుండా ఒక వ్యవస్థను నిర్మించడానికి అవసరమైన భౌతిక ప్రాతిపదికగా ఉన్నందు వల్ల దీర్ఘకాలం సాగే సుగుణం దానికి ఉందని నమ్మకం కలుగుతుంది.

ప్రజల చైతన్య స్థాయిని పరిగణలోకి తీసుకొని ఉన్నత రూపాలను నిర్మించడంలో ఉన్న కష్టం గురించేగాక, వాటిని కాపాడుకోవడం గురించి కూడా ఉద్యమానికి ఎరుక ఉంది. దానికి ఎక్కడికక్కడ ప్రజా మిలీషియా ఇప్పటికంటే పెద్ద ఎత్తున తయారు కావాల్సి ఉంది. ఇది నిజమే. ఎందుకంటే ఆ పక్క నుంచి భారీ ఎత్తున సైనిక బలగాలు దాడి చేస్తున్నప్పుడు యుద్ధం మధ్యనే వ్యవస్థలను నిర్మించడం, వాటిని పని చేయించడం మాత్రమేగాక, వాటిని కాపాడుకోవడం, కాపాడుకుంటూ అంచెలంచెలుగా ఉన్నత రూపాలను స్వీకరించడం.. చాలా అవసరం.

ఈ దృష్టి అంతులేని బలాన్ని ఇస్తుంది.

అయితే హరిభూషణ్ కాపాడుకోవం అనే విషయాన్ని ఒక వైపు నుంచే చూశాడా? అనిపిస్తోంది. యుద్ధం వైపు నుంచి, ప్రజా సైనిక బలగాలు ఇంకా పెరగాల్సిన అవసరం గురించే చెప్పాడుగాని, ఈ కొత్త వ్యవస్థకు బైటి బూర్జువా వ్యవస్థ నుంచి వచ్చే విపత్తు గురించి కూడా ఆలోచించాలి గదా!

దూరంగా కీచురాళ్లో.. మరేవో అరుస్తున్నాయి.

**మెత్తని అడుగులతో సెంట్రీ గెరిల్లాల పద సవ్వడి కావచ్చు**
**కఠినమైన జీవితం నుంచి సున్నితమైన ఆచరణలోకి పర్యవశించిన**
**దృఢమైన వ్యక్తిత్వాలు అల్లిన జాగరూక కైవారమది**

సువిశాల గ్రామీణ, పట్టణ భారత దేశం ఒక పక్క, ఈ అడవి ప్రజలు మరో పక్క.. ఎన్నడూ లేని సంక్షోభాన్ని దేశం అనుభవిస్తున్న తరుణంలో ఆదివాసులు ఇక్కడ ఈ ప్రయోగం చేస్తున్నారు. సంక్షేమ రాజ్య భావన గాలికి ఎగిరిపోయి అంతా ప్రైవేటీకరింపడుతున్న ఈ తరుణంలో అభివృద్ధి అనే భావన గతం కంటే తారా స్థాయిలో వినిపిస్తోంది.

పాలకవర్గం ఇదేదో గారడీ చేస్తోందని తేలిగ్గా తీసేస్తే దానితో సవ్యంగా వ్యవహరించినట్టవుతుందా? ఆ అభివృద్ధి–సంక్షేమం మీద ఒక పక్క ఎంత విమర్శ పెరిగిపోతున్నా.. మరోపక్క అది అంతగా సమాజమంతా విస్తరిస్తున్నది. ఇదంతా కేవల భావజాలమేనా? ఈ అభివృద్ధి అనేది మనుషుల్ని ఒక రకమైన భావజాలంలోకి లాగిన పర్యవసానమే అనుకోగలమా?

మనం అభివృద్ధి తరహా విషయాలను మాట్లాడుకొనేటప్పుడు సంస్కృతీ కోణం ప్రబలంగా ఉంటుంది. ఉండవలసిందే. దాని పాత్ర దానిదే. కానీ సామాజిక మార్పుల అధ్యయనంలో సాంఘిక సాంస్కృతిక పార్శ్వం పరమంగా మారడం, లేదా విశ్లేషణ ఎక్కడ మొదలైనా కాసేపటికల్లా సాంస్కృతిక విషయాల ప్రాబల్యంలోకి జారిపోవడం అనే ధోరణి వల్ల మార్క్సిస్టులకు కొన్ని సమస్యలు తలెత్తుతాయి.

వాటిని పరిహరించుకోడానికి సంస్కృతీ ఆవరణను వీడి బయటికి రావలసిందే. వ్యవస్థ సాంస్కృతికంగా మాయ చేసి, మత్తు చల్లి, కుట్ర చేసి బతుకుతుందా? కేవలం భావజాల వల విసిరి ప్రజల ఆలోచనలను కైవసం చేసుకుంటోందా? లేక దానికి దానిదైన అంతర్ తర్కం ఉండి, దాని ప్రకారం అది భౌతికమైన వ్యూహాత్మక దిశలో సాగిపోతున్నదా? ఇదంతా ఎందుకంటే – పాలకవర్గం చేపట్టిన అభివృద్ధి వల్ల సంస్కృతిలో మార్పులు కనిపిస్తున్నా సారంలో ఏ మార్పూ లేదనేది ఒక రకమైన విశ్లేషణ పద్ధతి.

కానీ పాలకులు తాము ప్రవేశపెడుతున్న అభివృద్ధి నుంచి పుట్టిన సంస్కృతిని అందరి మీదికి రుద్ది దానికి సమ్మతిని పొందడం మాత్రమే చేస్తున్నారా? లేక తమ అభివృద్ధిలోనే నేరుగా ప్రజలందరినీ భాగం చేసి, ఒక షరతుగానే వాళ్లందర్నీ లబ్ధిదారులుగా మార్చుకుంటున్నారా?

రాజ్యం సంక్షేమ కార్యక్రమాల నుంచి వైదొలిగి ప్రైవేట్ శక్తుల వీరంగానికి సమస్తాన్నీ అప్పగించిందని అనిపిస్తున్న ఈ తరుణంలో రాజ్యం తన మీద ఆధారపడి బతికే లబ్ధిదారుల సంఖ్యను ఇబ్బడి ముబ్బడిగా పెంచుకుంటూ పోతోంది.

వ్యవస్థకు బయట ఉండిపోయినవాళ్లందని రాజ్యం ఒక పథకం ప్రకారం లబ్ధిదారులుగా మార్చేస్తూ వారికి వ్యవస్థలో చోటు కల్పిస్తున్నది. అందు వల్ల బూర్జువా వ్యవస్థ పరిమాణం గత ముప్పై నలభై ఏళ్లలో విపరీతంగా పెరిగిపోయింది. దాని వేగం పెరిగిపోయింది. దాని పనితీరులో సంక్లిష్టత పెరిగిపోయింది.

ఇప్పుడు రాజ్యం ఇచ్చేదీ.. పౌరులు తీసుకొనేవారూ అయిపోయారు.

ఇదంతా వ్యవస్థ విస్తరణను, రాజ్య విస్తరణను సూచిస్తాయి. సమాజపు మారుమూలల్లో ఎవరూ మిగిలిపోకుండా అందరినీ వ్యవస్థలో భాగం చేసే ప్రయత్నం ఇది.

చాలా విచిత్రంగా ఇది ఐదారు దశాబ్దాలుగా వ్యవస్థ బయట నుంచి పాలక వర్గం మీద పెరుగుతూ వచ్చిన వొత్తిడి పర్యవసానంగా కూడా జరిగిపోయింది. తన గురించి తాను ఈ వ్యవస్థ ప్రకటించుకున్నవీ, వాగ్దాన రూపంలో సమాజం ముందు పెట్టినవీ కూడా పరోక్షంగా వ్యవస్థా విస్తరణకు కారణమయ్యాయి.



ఎందుకంటే – చారిత్రకంగా, సాంఘికంగా సమాజపు మారుమూలల్లో ఉండిపోయిన జన సమూహాలు వలసపాలనలోనూ, ఆ తర్వాతా చేసిన ఆందోళనల వల్ల రూపొందిన విలువలను పాలకవర్గం ఆ ప్రజలను తన ఎజెండాలోకి తీసుకోక తప్పలేదు. అట్లా తీసుకోవాలని గుర్తింపజేయడానికే చాలా పోరాటాలు జరగాల్సి వచ్చింది.

ఒక రకంగా చెప్పాలంటే – ఆధునిక భారత దేశ చరిత్రలో వెల్లువెత్తుతున్న భిన్న భావజాలాలు, వాటి వెలుగులో సాగిన ఉద్యమాలు.. అన్నీ కడపటికి తమకు వ్యవస్థలో చోటు కల్పించాలని, ఆధునిక ఫలాల్లో తన వాటా తమకు ఇవ్వాలని కోరుతున్నవే. దారుణమైన ఆధునిక పూర్వ సాంఘిక బంధనాల్లో తరతరాలుగా హింసపడుతున్న ప్రజలు సాధించిన విజయాలు ఇవి.

అయితే ఈ సారంశంలో ఇవన్నీ బూర్జువా వ్యవస్థలో కలిసిపోయినవే. అట్లని అవి నిర్వహించిన ప్రగతిదాయక పాత్రను ఎవ్వరూ కాదన లేరు. ఆ జన సముదాయాలకు అత్యవసరమైన డిమాండ్ల మీద, ముఖ్యంగా న్యాయం, ప్రాతినిధ్యం అనే భావనల మీద సాగిన ఉద్యమాలు అవి.

నిజానికి విప్లవోద్యమం కూడా ఈ వ్యవస్థ విశాలం కావడానికి చాలా పెద్ద ఎత్తున దోహదపడింది. ఈ నలభై ఏళ్లుగా సమాజంలోని ప్రతిస్పందనల వెనుక, వ్యవస్థ మీద పెల్లుబికిన విమర్శల వెనుక నక్సల్బరీ నుంచి కొనసాగుతున్న విప్లవోద్యమం ఇచ్చిన ప్రేరణ అంతా ఇంతా కాదు. అదే అతి పెద్ద సమాజిక అధ్యయన వస్తువు.

అయితే ఒక ముఖ్యమైన తేడా ఉన్నది. నక్సలైట్ ఉద్యమం వ్యవస్థను ఎంత ప్రభావితం చేసినా, ఎన్ని కొత్త డిమాండ్ల రూపంలో వ్యవస్థను కుదుపులకు గురి చేసినా ఇతర ఆందోళనల వలె అది వ్యవస్థలో భాగం కాలేదు. వ్యూహాత్మకంగా వ్యవసథ్కు వెలుపల ఉంటూ రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక పోరాటాలు నిర్వహిస్తోంది. దాని ఆశయం బూర్జువా వ్యవస్థను మరమ్మతు చేయడం, బూర్జువా ఆధునికతలో చోటు కోసం ప్రయత్నించడం కాదు. కార్మికవర్గం లక్ష్యం బూర్జువా వ్యవస్థకు ప్రత్యామ్నాయం నిర్మించడం కావట్టి అది వ్యవస్థతో తలపడుతూ వచ్చిందేగాని, అందులో భాగం కాలేదు.

గత ఇరవై ఏళ్లలో వచ్చిన ఆధునికానంతర వాదాలు కాని, సాంఘిక అస్తిత్వ పోరాటాలుగాని(వీటిని పక్క పక్కనే ప్రస్తావిస్తున్నామంటే.. ఇవి ఒకే తానులోనివని అర్థం కాదు) విప్లవాన్ని ముగిసిపోయిన మహా కథనమని, చారిత్రక భౌతికవాదం సాంఘిక విముక్తిని విశ్లేషించలేదని వ్యాఖ్యానించాయి. ఆ వాదాలపై వ్యాఖ్యానం ఇక్కడ అప్రస్తుతం కానీ, అస్తిత్వ చైతన్యంతో వచ్చిన ఆందోళనలన్నీ ఏదో ఒక అర్థంలో బూర్జువా వ్యవస్థలో తమకు దక్కాల్సిన న్యాయమైన వాటా సంపాదించుకున్నవే. విప్లవోద్యమం మాత్రం ఆ

వ్యవస్థ మీద దృఢమైన పోరాటం చేస్తూ వచ్చింది.

అందువల్లనే ఆ పోరాటాలు ఎన్ని శాపనార్థాలు పెట్టినా విప్లవోద్యమం పురోగమిస్తూనే వచ్చింది. అయితే ఈ ప్రయాణం సాఫీగా సాగిందికాదు. చాలా ప్రయాసభరితంగా, అనేక ఎదురుదెబ్బల మధ్య సాగుతున్నది. ఈ సంఘర్షణ బైటా, లోపలా కూడా జరిగింది. చాలా కోల్పోవాల్సి వచ్చింది. దగ్గర ఉండాల్సిన వాళ్లెందరో దూరమయ్యారు. కొన్ని అపప్రదలను శాశ్వతంగా మోయాల్సి వస్తోంది. వాటిని పరమ సత్యాలుగా చెలామణి చేసుకోగల ఆత్మ విశ్వాసం అవతలివాళ్లు సంపాదించుకోగలిగారు. ప్రచారంలో ఉన్న విషయాల మీదనే ప్రతిపాదనలు, నిర్ధారణలు చేయవచ్చనే ఆలోచనా సంస్కృతికి మంచివాళ్లూ, పెద్దవాళ్లూ కూడా లొంగిపోయారు.

తెలుగు మేధోరంగంలో, ఉద్యమావరణలో సాగిన ఈ ఆటుపోట్ల అధ్యయనమే ప్రత్యేక విషయం. అయినా ఇవాళ బూర్జువా వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా దండకారణ్యంలో విప్లవ జనతన సర్కార్ బీజప్రాయంగానైనా ఆవిర్భవించింది.

పైన చెప్పినట్లు వ్యవస్థ చాలా విస్తారంగా పెరిగిపోతున్న ఈ తరుణంలో దండకారణ్యంలో జనతన సర్కార్ నిర్మాణమవుతున్నదని మర్చిపోరాదు. అప్పుడు మాత్రమే మావోయిస్టులు చేస్తున్న ఈ ప్రయోగంలోని విశిష్టత అర్థం కాదు. చుట్టుముడుతున్న సైనికబలగాలు, సాగుతున్న మారణకాండను కసితీరా వ్యతిరేకించం ఒక ముఖ్యమైన అంశం. దానితోపాటు వ్యవస్థ వైపు నుంచి ఏ ప్రత్యేక చారిత్రక సందర్భంలో విప్లవోద్యమం ఈ ప్రయోగం చేస్తున్నదో గుర్తెరిగి వ్యాఖ్యానించవలసి ఉన్నది.

బైట సమస్త జనావళిని బూర్జువా వ్యవస్థ తనలో సంలీనం చేసుకుంటూ, తన భానలకు అనుగుణంగా తీర్చిదిద్దుకుంటూ, తన యంత్రాంగంలో భాగం చేసుకొని... దానికి తగినట్లు జీవించే మానవులుగా మలుచుకుంటున్నది.

వలసానంతరం ఈ దృశ్యం నానాటికీ బలపడుతూ ఇప్పుడదే ఈ వ్యవస్థా స్వభావంగా మారిపోయింది. దోపిడీ వర్గ ప్రయోజనాలను పూర్తి స్థాయిలో తీర్చే దీర్ఘకాల వ్యూహంతో వ్యవస్థ అత్యంత క్రియాత్మకమైనదని మర్చిపోరాదు. ఆంధ్రప్రదేశ్‌లో రోశయ్యనో, కిరణ్‌కుమార్‌రెడ్డినో చూపించి ప్రభుత్వం , పాలనా యంత్రాంగం నిస్తేజంగా ఉన్నాయని, పక్షవాతంతో బాధపడుతున్నాయని పార్లమెంటరీ వామపక్షవాదులు అంటూ ఉంటారు.

నిజమే..! మనవాళ్లు చంద్రబాబు, వైఎస్సార్‌వంటి ముఖ్యమంత్రుల 'డైనమిజాన్ని' చూచినవాళ్లు కదా? మరీ తీసికట్టుగా ఉండే ఈ తరహా ముతక ముఖ్యమంత్రులంటే చిరాకు కలుగుతుంది.

పార్లమెంటరీ చట్రంలోపలి నుంచి చేసేవాళ్లకు ఇట్లా అనిపించడం సహజమే. ఆ



గంతలు తీస్తే .. చంద్రబాబు, వైఎస్సార్, కిరణ్‌కుమార్.. ఎవరు ముఖ్యమంత్రిగా ఉన్నా, ఒక వేళ ప్రభుత్వం గమనం మందగించినా, ఈ వ్యవస్థ మాత్రం శర వేగంతో విస్తరిస్తోందని తెలుస్తుంది. దానికి తగిన పనులను ప్రభుత్వం నిరంతరం చేస్తూనే ఉంటుంది. ఇది బూర్జువా వ్యవస్థల బలాన్ని తెలియజేసే విషయం.

అంటే– యావత్ సమాజ మారుమూలల్లోకి, అన్ని జీవన సముదాయాల్లోకి, అన్ని వైవిధ్యాల్లోకి, అన్ని ఆవాసాల్లోకి, అన్ని రకాల పాత ఉత్పత్తి విధానాల్లోకి బూర్జువా వ్యవసర్థ చొరబడి అన్నిటినీ తన పరిధిలోకి తీసుకోవాలని చూస్తోంది. వాటిన్నిటినీ సమూల నాశనం చేయాల్సిన అగత్యం కూడా లేకుండా వాటిని తన పరిధిలోకి తెచ్చుకొని, తన మీద ఆధారపడి బతికే స్థితిలోకి వాటిని మార్చివేయాలని చూస్తోంది. నిస్సందేహంగా వ్యవస్థ బలోపేతమవుతోందనడానికి ఇవన్నీ సూచికలు.

ఇందులో మరో ముఖ్యమైన అంశం కూడా ఉన్నది.

ఈ ప్రక్రియ ఎంత వేగంగా సాగుతున్నదో అంతగా అసమానతలు పెరుగుతున్నాయి. దానివల్ల తీవ్రమైన సంక్లిష్టత చోటుచేసుకుంటున్నది. ఎందువల్లంటే– పెట్టుబడి అంటేనే అసమానత. బూర్జువా వ్యవస్థ విస్తరించేకొద్దీ అసమానతలు.. కొత్త కొత్త అసమానతలు తలెత్తి పెరిగిపోతున్నాయి. బూర్జువా శక్తులు ఈ సమాజాన్ని తాను అనుకున్నట్లు నిర్మించే క్రమంలో అసమానతలు మరీ.. మరీ పెరగడం అనేది దాని అంతర్నిహిత లక్షణం.

అది భిన్న సమూహాల మధ్య, సామాజిక బృందాల మధ్య, ప్రాంతాల మధ్య, భాషా సంస్కృతుల మధ్య.. సర్వత్రా కనిపిస్తుంటుంది. మన దగ్గర తెలంగాణ ఉద్యమం కూడా దాని వల్లే ఎడతెగకుండా సాగుతున్నది. విప్లవకారులు ప్రత్యేక తెలంగాణను సమర్థించడానికి అతి ముఖ్యకారణం అదే. పెట్టుబడి సృష్టించిన ప్రాంతాల అసమానతలకు వ్యతిరేకంగా ఉన్నది. అందులో ఆత్మగౌరవ సమస్య కూడా చాలా తీవ్రంగా ముందుకు వచ్చింది. ఇతర సామాజిక బృందాల మధ్య పంపకాల్లో గొడవలకు కూడా సాంఘిక సమస్యలతోపాటు పెట్టుబడి ఆ బృందాల మధ్య సృష్టించిన అసమానతలు అదనంగా తోడయ్యాయి. సామాజిక సంపద, వనరులు, అవకాశాలు పొందడంలో పెట్టుబడి అసమానతలను పెంచిపోషిస్తుంది. వాటికి వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో ఇతరేతర ఆకాంక్షలు ఎన్ని ఉన్నా, వాటి స్వభావం ఏదైనా.. సారాంశంలో అది బూర్జువావర్గం సృష్టించిన అసమానతలపై పోరాటం కూడా ఉంటుంది. ఒక ప్రాంత బూర్జువా వర్గం సృష్టించిన అసమానతలను మరో ప్రాంతానికి చెందిన బూర్జువా వర్గం వ్యతిరేకించే అవకాశం కూడా ఉంటుంది.

ఇలాంటి అసమానతలకు వ్యతిరేకంగా సాగుతున్న విప్లవోద్యమం కూడా

అసమానంగానే నిర్మాణమవుతున్నది. ఈ విషయంలో మనకు కామ్రేడ్ గణపతి ఒక ఇంటర్వ్యూలో చెప్పిన మాట లోతైన అవగాహన ఇస్తుంది. 'విలీనం తర్వాత( మావోయిస్టు పార్టీ ఏర్పడ్డాక) మా దేశ అసమాన అభివృద్ధి గురించీ, మా విప్లవోద్యమ అసమాన అభివృద్ధి గురించీ మా అవగాహన మరింత సంపద్వంతం అయింది' అన్నాడు.

అంటే – బూర్జువా వర్గం చాలా వ్యూహాత్మకంగా తన దోపిడీ కోసం ఈ దేశాన్ని అసమాన అభివృద్ధిలోకి తోసివేసింది. దాన్ని ఎదుర్కొని ప్రత్యామ్నాయ అభివృద్ధిని సాధించాల్సిన విప్లవోద్యమం కూడా చాలా అసమానంగా అభివృద్ధి చెందుతున్నది. అందువల్లే ఇవాళ దండకారణ్యం ప్రత్యామ్నాయం దిశగా పురోగమిస్తోంటే.. బైటి బూర్జువా వ్యవస్థలో ఏ ప్రత్యామ్నాయాలు కనిపించడం లేదు. అంతకు మించి ఆ వ్యవస్థ నానాటికి విస్తరించి, బలోపేతమవుతున్నది. అది దండకారణ్యాన్ని చుట్టుముట్టే అవకాశం కూడా ఉన్నది.

అందువల్ల ఈ దృశ్యం చాలా సంక్లిష్టమైనదీ, దీర్ఘకాలిక స్వభావం కలదీ. దీన్ని బైటి సమాజం వైపు నుంచి ఒకలాగా అర్థం చేసుకోవచ్చు. ఈ అడవిలో, ఈ ఆదివాసుల మధ్య నిలుచొని, వీళ్లు చేస్తున్న ప్రయోగం వైపు నుంచి ఒకలాగా అర్థం చేసుకోవచ్చు. అయితే ఈ కోణాలు ఒక సమగ్ర దృశ్యానికి సంబంధించివే. వీటిని కలపకపోతే దండకారణ్య విశిష్టత అర్థం కాదు.

మేం ఇక్కడికి రాగానే ఒక దృశ్యం కనిపించింది.

పది పన్నెండేళ్ల బుడతడు గెరిల్లాల మధ్య అటూ ఇటూ తిరుగుతూ కాకరపువ్వొత్తిలా వెలుగుతూ కనిపించాడు. ఈ బాల్యం గురించే గదా? బైట పోలీసులు, పత్రికలు నానా రకాల అసత్య వార్తలు ప్రచారం చేస్తున్నది? బాల్యాన్ని సైనికీకరిస్తున్న మావోయిస్టు ఉద్యమం అని రాసేస్తుంటారు. అలాంటివి చదివి పిల్లల ప్రేమికులు తప్పక కంటతడి పెట్టుకుంటారు. అంతర్జాతీయ స్థాయిలో కొన్ని మావన హక్కుల సంస్థలు, బాలల హక్కుల గురించి ఆందోళనపడే వేదికలు హక్కులు కోల్పోతున్న బాల్యమని ఆవేదనపడుతూ ఉంటారు.

ఇంతకూ ఈ బాల్యం సైనికీకరింపడుతున్నదా? లేక సామాజి కీకరింపబడుతున్నదా? అనే ప్రశ్న వేసుకోవాలి.

**బాల్యం పువ్వుల వలె మెత్తనిది**
**తల్లి గుండెలు కాచుకొనే వెచ్చనిది**
**సాయుధీకరింపడి దిగ్మండల ప్రయాణానికి సిద్ధమైన ప్రభాతోదయం**
**సామాజిక మానవిగా**



**పాట తోడుగా తూటా తోడుగా ఎదుగుతున్న బాల్యం**

... ఆ మధ్య ఆఫీసులో వారంపాటు రోజూ ఒకే వార్త డజన్లసార్లు ఎడిట్ చేస్తున్నప్పుడు ఎందుకో వెగటనిపించింది. అదే సమయంలో ఒక విషయం స్ఫురించింది. ఆ వార్త తల్లిపాల వారోత్సవాల గురించి. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ యంత్రాంగం కిందా మీదా పడి మారుమూల గ్రామాల్లో కూడా నిర్వహించింది. అధికార వ్యవస్థలోని సహజ రుగ్మతల వల్ల ఈ పని అవకతవకలుగా, మొక్కుబడిగా జరిగి ఉండవచ్చు. అందులోనూ అవినీతి జరిగి ఉండవచ్చు.

ఇప్పుడు మాట్లాడుతున్నది దాని గురించి కాదు. తల్లి పాలు శ్రేష్టమని, తల్లులందరూ పిల్లలకు పాలు తాపాలని వారంపాటు ప్రభుత్వం ఒక కార్యక్రమాన్నే నిర్వహించడం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, దాని అనుబంధ ఉపాంగాలూ అన్నీ అందులో తలమునకలు కావడం దేన్ని సూచిస్తున్నాయి? అని.

మానవజీవితంలో చాలా సహజంగా, కుటుంబమనే వ్యవస్థలో భాగంగా ఒకరి నుంచి ఒకరికి, ఒక తరం నుంచి మరో తరానికి అనూచానంగా, సంప్రదాయంగా తెలివిడి కలిగి ఆచరించే సహజమైన ఈ ఆవరణలోకి రాజ్యం ప్రవేశించి సుద్దులు చెప్తోంది గదా? అనిపించింది. అదీ పిల్లలను అమ్ముకొనే, పిల్లల శ్రమను దోచుకొనే ఈ వ్యవస్థ యొక్క రాజకీయ ప్రతినిధి పిల్లలకు తల్లిపాలు శ్రేష్టమనే కార్యక్రమం తీసుకోవడం ఎంత వెగటు కలిగిస్తుంది?

కాసేపు ఆ వెగటును కూడా భరిస్తే – ఇలాంటి అత్యంత సహజమైన విషయాన్ని కూడా సమాజానికి వదిలేయకుండా వ్యవస్థ జోక్యం చేసుకోవడం ఏమిటా? అనిపిస్తుంది. అట్లా మొదలై .. ఇక అప్పటి నుంచి పిల్లలను సామాజికీకరణ ప్రక్రియకు వ్యవస్థ దూరం చేస్తుంది. శిశువు సామాజికీకరింపబడే ప్రక్రియలకు దూరం చేసి.. వ్యక్తి, కెరియర్, లాభాలు.. గురించి ఆలోచించే వ్యవస్థాంతర్గత మానవుడిగా, ఓటరుగా, లబ్ధిదారుడిగా, వినియోగదారుడిగా మార్చి వేస్తుంది.

అంటే, వ్యవస్థ మారుమూల జీవన సముదాయాలను, సంస్కృతులనేగాక, మానవ జీవితంలోని తొలి దశలోకి కూడా చొరబడి సంక్షేమాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తున్నాననే సాకుతో సామాజిక మానవుడిగా రూపొందాల్సిన వ్యక్తిని దారి మళ్లించి తనలో కలిపేసుకుంటోంది. పైగా దీన్నంతా శిశు సంక్షేమమని బుకాయిస్తుంటుంది.

దీనికి ప్రత్యామ్నాయంగా ఇక్కడ.. ఈ దండకారణ్యంలో పిల్లలను ఒక సామాజిక ప్రక్రియ మార్గదర్శకంలో మానవులుగా తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతోంది. నిజానికి ఆదివాసీ ప్రాంతాల్లోని బాల్యం సహజంగానే ప్రకృతికి సన్నిహితంగా ఉంటుంది. అందువల్ల

కలిగే జ్ఞానం తప్ప హేతుబద్ధ జ్ఞానం కలిగే అవకాశం లేదు. ప్రకృతి నుంచి వ్యూహాత్మకంగా వేరుబడి ప్రకృతి ఏమిటి? సమాజం ఏమిటి? అనే ప్రశ్న వేసుకోవడమే హేతుచింతనకు పునాది.

దండకారణ్య విప్లవ ప్రయోగంలో భాగంగా ఇక్కడి బాల్యం అట్లాంటి హేతుబద్ధత దిశగా సాగుతోందని ఈ పిల్లలను కొంచెం సేపు గమనించినా తెలుస్తుంది.

ఇక్కడ మూడు రంగాల్లో జమిలిగా ప్రయోగం జరుగుతున్నది. దండకారణ్యంలో మావోయిస్టుల ప్రవేశించిన తొలి రోజుల్లో ఇతర రంగాల్లో కూడా ప్రయత్నం జరిగినా ప్రధానంగా సాంఘిక, సాంస్కృతిక రంగాల్లో ఎక్కువ కృషి జరిగింది. ఆధునిక జీవిత నేపథ్యం నుంచి, సిద్ధాంత రాజకీయ అవగాహన నుంచి వచ్చిన విప్లవకారులకు ఆ సాంఘిక ఆచరణ వల్లనే దండకారణ్యం వంటి భిన్నమైన సామాజిక సముదాయంలో చోటు దొరికి ఉండవచ్చు. ఇలాంటి సమాజాల్లో.. అత్యంత వెనుకబడిన ఉత్పత్తి వ్యవస్థ, సాంఘిక, సాంస్కృతిక ప్రపంచం చాలా సన్నిహితంగా ఉంటాయి.

దండకారణ్యంలోని అతి ప్రాచీన సాంఘిక బంధనాల్లో చిక్కుకొని నిద్రాణంగా ఉన్న ఆదివాసుల సృజన శక్తిని విప్లవోద్యమం వెలికి తీసింది. అది ఒక రాజకీయ పోరాటానికి అవసరమైన అంతర్గత ఆవరణను కల్పించింది. అక్కడ ఒక నూతన సాంఘిక వ్యవస్థను, జనతన సర్కార్ అనే రాజకీయ వ్యవస్థను ఆదివాసులు నిర్మించుకుంటున్నారు. ఇవి అంతక ముందు ఆదివాసీ సమాజంలో పరంపరా గతంగా ఉంటూ వచ్చిన పాత సాంఘిక, రాజకీయ – పాలనా వ్యవస్థల వంటివి కావు. పూర్తి భిన్నమైనవి. కొత్తవి.

ఉపరితలంలో జరుగుతున్న ఈ మార్పులతోపాటు ఆదివాసీ ఉత్పత్తి విధానంలో, ఉత్పత్తి సంబంధాల్లో మార్పులు జరుగుతున్నాయి. వాటి నుంచి ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా అనేది సాధ్యమైంది.

అంటే – దండకారణ్యంలో సాంఘిక, రాజకీయ, ఉత్పత్తి వ్యవస్థలో ఒక ప్రయోగం మొదలై విస్తరిస్తున్న ఈ తరుణంలోనే బైట బూర్జువా వ్యవస్థ శత సహస్ర బాహువులతో నేల నాలుగు చెరగులా, జీవితపు కొన అంచుల్లోకి కూడా పాదరసంలా ప్రవహిస్తోంది. ఇది ఎప్పుడో మొదలైనా రానురాను వేగం పుంజుకుంటోంది. విప్లవ జనతన సర్కార్ ఆధ్వర్యంలో దండకారణ్య ఆదివాసులు చేస్తున్న ప్రయోగంపై, వాళ్లు నిర్మిస్తున్న వ్యవస్థపై, అందులో వాళ్లు చేపట్టాల్సిన ఉన్నత రూపాలపై... ఈ బూర్జువా వ్యవస్థ చేయబోయే దాడులపట్ల కూడా ముందు చూపు చాలా అవసరం.

ఇది చాలా వాస్తవికమైంది కావట్టి ఆచరణలో ఉండే ఉద్యమ ప్రతినిధిగా హరిభూషణ్ ఇంకో సందర్భంలో దీన్ని స్ఫురింపజేశాడు. మార్కెటింగ్ గురించి అడగ్గానే ఆయన



ఆదివాసీ ప్రాంతాల్లోకి మార్కెట్ చొరబాటు గురించి, దానికి ఆదివాసులు ప్రభావితం కావడం గురించి చెప్పుకొచ్చాడు.

నిజానికి ఆ ప్రశ్న దీని గురించి కాదు. గతంతో పోలిస్తే జనతన సర్కార్ ఆధ్వర్యంలో వ్యవసాయంలో దిగుబడి పెరిగింది కదా? ఉత్పత్తి పెరిగినప్పుడు మార్కెటింగ్ అనే సమస్య మామూలుగానైతే బైట ఉంటుంది. అలాంటిదేమైనా ఇక్కడ ఉందా? ఉంటే దాన్ని ఎలా పరిష్కరిస్తున్నారు? అనే అర్థంతో ఆ ప్రశ్న అడిగాం.

ఎందుకంటే పాత రోజుల్లో అటవీ ఫలసాయం సేకరణ, పోడు వ్యవసాయ ఉత్పత్తికి సరిపడా ఆదివాసులకు సంతలు ఉండేవి. మార్కెటింగ్ అనేది ఉంటే ఇప్పుడూ ఆ కూడళ్లే సరిపోతున్నాయా? వేరే ఏమైనా ముందుకు వచ్చాయా? అనే వివరాలు తెలుసుకోడానికి ఆ ప్రశ్న వేశాం.

ఆయన నేరుగా కాకపోయినా దానికి సంబంధించిన విషయాలు చెప్పాడనే సంతృప్తి కలిగింది. బహుశా జనతన సర్కార్ ఇప్పుడున్న బీజ దశకు సంబంధించిన పరిమితులు, ఇబ్బందులు కూడా అందులో ప్రస్తావించాడు.

బైట మార్కెట్లో దొరికే చాలా వస్తువులు రోడ్డు పక్కన ఉండే గూడేల్లోకి వచ్చేశాయని చెప్తూ సెల్ ఫోన్లో చిప్స్ పెట్టుకొని ఆదివాసీ యువకుల పాటలు వింటున్నారని అన్నాడు. ధాన్యం అమ్మే అలవాటు లేకపోయినా కొన్ని చోట్ల బియ్యం పోసి తమకు కావాల్సిన వస్తువులు సంతలో కొనుక్కుంటున్నారని కూడా అన్నాడు.

ఆదివాసీ ప్రాంతాల్లోకి, .. ఇప్పటికైతే రోడ్డు సమీప గూడేల్లోకి మార్కెట్ వచ్చేసిందనే విషయాన్ని ఇవన్నీ సూచిస్తున్నాయి. దీన్ని బూర్జువా సాంస్కృతిక కాలుష్యమని కూడా అనుకోవచ్చు. కానీ అంతకంటే చాలా లోతైన సమస్య ఇది. కేవలం సాంస్కృతికానికి కుదిస్తే సరిపోయేది కాదు. ఆ పార్శ్వంతోసహా.. ఆదివాసీ ప్రాంతాల్లో సరుకు, అమ్మకం, కొనుగోలు, వినియోగం.. మొదలైనవి తలెత్తుతున్నాయని గుర్తించాలి. అయినా నేటికీ దండకారణ్యం ప్రధానంగా మనుగడ కోసం ఉత్పత్తి అనే దశలో ఉన్నందున మార్కెటింగ్ అనే వ్యవహారం లేని వ్యవస్థగానే ఉన్నది. బహుశా స్థానిక సంతలు ఇప్పటికీ అక్కడి అవసరాలు తీర్చుతూ ఉండవచ్చు.

అయితే ఆయన మరో ముఖ్యమైన మాట అన్నాడు. పెద్ద నిర్మాణాలు, ఉన్నత రూపాలు చేపట్టడంలో ఉన్న ఇబ్బందులు చెప్తూ పెట్రోలు, డీజిల్ వంటి వాటి అవసరం గురించి ప్రస్తావించాడు. దండకారణ్యంలోని ప్రత్యామ్నాయ అభివృద్ధి ప్రక్రియ ఉన్నత దశకు చేరడానికి బైటి సమాజం నుంచి కొన్ని వనరులు అవసరం అని దీని అర్థం. స్థానిక వనరుల మీద ఆధారపడి కొనసాగే ఈ ప్రత్యామ్నాయానికి బైటి వనరుల అవసరం

గురించి ఆయన చాలా చక్కగా చెప్పాడు. ఇది నేరుగా ఆచరణ నుంచి కలిగిన అవగాహన.

ఆదివాసులు జల్, జంగల్, జమీన్ అనే నినాదం వెలుగులో స్వయం పాలన, స్వావలంబన సాధించదల్చుకుంటే ఈ ఇబ్బంది ఉండకపోవచ్చు. కానీ అక్కడ నిర్మాణమవుతున్న వ్యవస్థ అలాంటిది కాదు. జల్ జంగల్ జమీన్ అనే నినాదంలోని పోరాటతత్వం ఇప్పటికీ చాలా అవసరం. కానీ ఇప్పుడు అక్కడ జరుగుతున్నది రివల్యూషనరీ పీపుల్స్ కమిటీల స్థాపన.

అంటే అది కేవలం ప్రత్యామ్నాయం కాదు.. విప్లవ ప్రత్యామ్నాయం. కాబట్టి జల్ జంగల్ జమీన్ అనేది ఇప్పటికీ పోరాట స్ఫూర్తిని ఇచ్చే నినాదం అవుతుందేగాని, అదే ఇప్పటి దండకారణ్య విప్లవ ప్రత్యామ్నాయానికి మార్గదర్శి కాజాలదు. లక్ష్యం అసలే కాజాలదు.

హరిభూషణ్ చెప్పిన మాటలో ఇంకో లోతైన అర్థం కూడా ఉంది. అదేమంటే.. దండకారణ్య ప్రయోగం మొత్తం సమాజంలో భాగం అని. బైటి మార్కెట్ లోనికి చొరబడటం అనే రూపంలో, బైట ఉండే కొన్ని వనరులు దండకారణ్య ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాకు అవసరం అనే అర్థంలో రెండు వైపుల నుంచి ఆయన మాటల్లో ఇది ధ్వనించింది. దండకారణ్యంలో పాదుకుంటున్న కొత్త రాజకీయార్థిక వ్యవస్థ మొత్తం దేశంలో భాగం అనడానికి ఇంకా చాలా వైపుల నుంచి కూడా వివరించవచ్చునేమోగాని, ఆయన మాటల్లోనైతే ఈ రెండు సందర్భాల్లో, ఈ రెండు అర్థాల్లో అది వ్యక్తమైంది.

ఒక ప్రత్యామ్నాయాన్ని నిర్మిస్తున్న వాళ్లకు దానిలోపలి శక్తి సామర్థ్యాలు –పరిమితులు తెలిసి ఉండటమేగాక... ఈ ప్రయోగం ఎక్కడ నిలబడి చేస్తున్నాం.. అనే వస్తుగత అవగాహన కూడా ఉండటం అక్కడి బీజరూప వ్యవస్థపట్ల భరోసా ఇస్తుంది.

బూర్జువా వ్యవస్థ – నిర్మాణమవుతున్న జనతన సర్కార్ అనే ద్వంద్వం మధ్య తీవ్ర సంఘర్షణ నడుస్తున్న వర్తమానం మనది. బైట పట్టిందల్లా బంగారంగా ఉన్న ఈ బూర్జువా వ్యవస్థకు దండకారణ్య జనతన సర్కార్ తలనెప్పిగా మారిపోయింది. దండకారణ్యంలోకి ప్రవేశిస్తున్న దేశీ, విదేశీ పెట్టుబడినేగాక.. అది కోరుకునే లేదా నిర్మించే సామాజిక వ్యవస్థను లోపలికి రానీయకుండా విప్లవోద్యమం తీవ్రంగా ప్రతిఘటిస్తున్నది. ఒకసారి ఈ పెనుగులాటలోని అంతరార్థంలోకి వెళ్లితే నిజంగానే ఇది ఎంత లోతైనదో తెలుస్తుంది.

పెట్టుబడి ఎక్కడికి వెళ్లినా.. అది ఎలాంటి స్వభావంగల పెట్టుబడి అయినా.. పెట్టుబడి అయితే చాలు..అది తనకు తగిన సామాజిక వ్యవస్థను తయారు చేసుకోడానికి ప్రయత్నిస్తుంది. అక్కడి స్థానిక వ్యవస్థల బలాబలాలనుబట్టి, వాటికి ఉండే సుదీర్ఘమైన చరిత్రనుబట్టి ఈ ప్రయత్నం సాగినా మౌలికంగా పెట్టుబడికి తనదైన సామాజిక వ్యవస్థను



నిర్మించుకొనే స్వభావం ఉంటుంది. ఇప్పుడు – దండకారణ్యంలోని సహజ వనరులను దోపిడీ చేయడానికి వెళ్తున్న పెట్టుబడికి; ఈ ప్రాంతంలోని ప్రాచీన జీవన మూలాలున్న ఆదివాసులకు మధ్య తీవ్రమైన వైరుధ్యం ఏర్పడింది.

అందువల్లపెట్టుబడి తరపున సహజంగానే రాజ్యం యుద్ధంలోకి ప్రవేశించింది. సామ్రాజ్యవాద ప్రయోజనాలు ఉన్నందున అమెరికా సైనిక మార్గదర్శకం కూడా అందుతోంది.

అంటే దండకారణ్యంలో పెట్టుబడికీ – ఆదివాసులకు మధ్య ఒక వైరుధ్యం నడుస్తున్నది. అట్లాగే దండకారణ్యంలో బలోపేతమవుతున్న సామాజిక వ్యవస్థకూ – బైట విస్తరిస్తున్న బూర్జువా వ్యవస్థకూ మధ్య మరో వైరుధ్యం కొనసాగుతున్నది. ఈ రెంటి మధ్య నుంచి మావోయిస్టు విప్లవం విస్తరిస్తున్నది.

ఈ కోణంలో చూస్తే తప్ప ఇవాళ భారతదేశంలోని మావోయిస్టుల ఉద్యమానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న 'క్రేజీ'కి ఉన్న లోతైన చారిత్రక ప్రాధాన్యత అర్థం కాదు.

జీవితాన్నే పణంపెట్టి .. మైదాన ప్రాంతం నుంచి ఈ దట్టమైన అడవిలోకి వచ్చిన విప్లవకారుల వైపు నుంచి దీన్ని చూడాలా? లేక ఇక్కడే పుట్టి పెరిగి తమ జీవన మూలాలకు భిన్నమైన ఒక ప్రయోగంలో భాగమైన ఆదివాసుల చైతన్యయుతమైన ఆచరణ నుంచి చూడాలా?

ఈ రెండు కోణాలు దండకారణ్యంలో కలిసి ఉన్నాయి. ఆదివాసీ తెగలు తమ ప్రాచీన జీవన మూలాల్లో నుంచి కొన్ని అరుదైన విలువలతోపాటు ఒక ఆధునిక వ్యవస్థలోకి ప్రయాణం చేస్తున్నారు. దానికి సంబంధించిన టార్చ్‌లైట్ వాళ్లకు మావోయిస్టుల నుంచి అంది వచ్చింది. ఈ రెండింటి మేళవింపు వల్ల ఇంత దాకా మన దేశంలో అనుభవంలోకి రాని కొత్త ప్రయోగం దండకారణ్యంలో జరుగుతున్నది. సామాజిక చరిత్రలో చాలా వెనుకటి దశలోకి తొంగి చూస్తూ నవనవోన్వేషమైన భవిష్యత్ నూతన సమాజం కోసం సాగుతున్న ప్రయోగం ఇది.

000

ఈ ప్రయాణంలో మావోయిస్టు కార్యకర్తలు తారసపడిన దగ్గరి నుంచి ఇలాంటి ఎన్నో ప్రశ్నలు ఆలోచనా కెరటాలను అటూ ఇటూ పోటెత్తించాయి. దేశ చరిత్రలో ప్రగతిదాయకమైన ఆకాంక్షలతో ఎన్నో ఉద్యమాలు జరిగాయి. ప్రజాస్వామిక పోరాటాలెన్నో మహోధృతిన నడిచి, కొన్ని విజయాలు సాధించి కాలగర్భంలో కలిసిపోయాయి. కొన్ని వెల్లువలాగా సాగిపోతే, మరికొన్ని ఉద్యమ నిర్మాణాలుగా కొంత కాలం నిలదొక్కుకున్నాయి. కొన్ని ఇప్పటికీ అట్లా నిలబడి తమ పాత్ర పోషిస్తున్నాయి.

ఉద్యమాలు సాధించే విజయాలను రెండు రకాలుగా చూడవచ్చు.

ఉద్యమాల ద్వారా ప్రజలు నేరుగా భౌతికరూపంలో విజయాలు పొందడమేగాక వాటికి సంబంధించిన విలువలు, చైతన్యం సమాజంలో నిలదొక్కుకుంటాయి. అవి చాలా అపూర్వమైనవి. ఒక్కోసారి మానవజాతి ఏ నేల మీద ఏ కాలంలో చేసిన పోరాట ఫలితంగానో స్థిరపడిన విలువలు, చైతన్యం భూతలమంతా విస్తరిస్తూనే ఉంటాయి.

రెండో రకం విజయాలేమంటే పాలకవర్గం ప్రజాపోరాటాల తీవ్రతకు తలొంచి తానే కొన్ని ఫలితాలను వాగ్దానం చేస్తుంది. వాటి అమలు ఎలా ఉన్నా ఉద్యమాలు సాధించిన విజయాలుగా అవి రాజ్యాంగంలో స్థిరపడిపోతాయి.

ఉదాహరణకు అనేక దశాబ్దాలుగా దళితుల మీద జరుగుతున్న అగ్రవర్ణాల దాడులకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాల ఫలితంగా ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం వచ్చిందే. అట్లాగే శ్రీకాకుళ ఆదివాసీ రైతాంగ పోరాటం వల్ల 1 ఆఫ్ 70 యాక్ట్ వచ్చింది.

ఈ చట్టాల అమలుతీరు ఎలా ఉన్నా ఇవి ఉద్యమాలు పాలకవర్గం మీద ఒత్తిడి చేసి సాధించిన విజయాలు. వీటి స్ఫూర్తి చాలా విలువైనది. కానీ ఉద్యమం అనేది ఒక సామాజిక వ్యవస్థను నిర్మించే దిశగా సాగడం, లేదా అలాంటి ప్రయోగాన్ని సుసాధ్యం చేయడం అనేది మాత్రం మావోయిస్టు ఉద్యమానికి మాత్రమే సాధ్యమైంది. అదీ ఒక పెద్ద యుద్ధం మధ్య మూడేళ్లుగా నిలబడటం ఇవ్వాల్టి అద్భుతం. అది ఎంత పెద్ద యుద్ధమంటే వలసానంతరం బహుశా జాతి విముక్తి పోరాటాల తర్వాత మళ్లీ అంత పెద్ద ఎత్తున నిర్బంధాన్ని యుద్ధం స్థాయిలో ఎదుర్కొంటున్నది కూడా మావోయిస్టు ఉద్యమం మాత్రమే.

విద్యా, వ్యవసాయ రంగాల్లో కొన్ని రకాల ప్రగతిశీల, ప్రయోగాత్మక భావాలున్నవాళ్లు అక్కడక్కడ కొన్ని ప్రయోగాలు చేసి ఉండవచ్చు. ఉనికిలో ఉన్నవాటికంటే భిన్నమైనవీ, ప్రత్యామ్నాయమనదగినవీ కూడా వాటిలో ఉండవచ్చు. అలాంటి అనుభవాలు.. ముఖ్యంగా ఆయా రంగాల్లో ప్రత్యేక నైపుణ్యం ఉండి, శాస్త్ర పరిశోధన చేసినవారి అనుభవాలు భవిష్యత్ సమాజానికి అవసరం.

అయితే దండకారణ్యంలో వర్గపోరాటంలో భాగంగా ఈ ప్రయోగం జరగడం అరుదైన విషయం.

ఈ ప్రయోగం ఉదారవాద దృష్టితోనో, మానవతావాద అవగాహనతోనో, బూర్జువా వ్యవస్థలోనే వైవిధ్యంగానో.. సాగుతున్నది కాదు. ఏవో కొన్ని విలువైన, ముఖ్యమైన లక్ష్యాలు సాధించడం కాకుండా ఒక నూతన సామాజిక వ్యవస్థను నిర్మించడమే లక్ష్యం కావడం మావోయిస్టు ఉద్యమం విశిష్టత. అది ఆశయ ప్రకటనగా మిగిలిపోకుండా.. బీజ ప్రాయంగానైనా నిజం చేయడం దాని వర్తమాన విశేషం.



మావోయిస్టు ఉద్యమం చేస్తున్న ఈ ప్రయోగం ముందు చాలా గంభీరమైన సమస్యలు ఉండవచ్చు. వాటి ముందు ఇప్పుడు సాధించిన ఫలితాలు చాలా చిన్నవే కావచ్చు. ఎందువల్లంటే విప్లవోద్యమం దేశవ్యాప్తంగా అనేక దోపిడీ రూపాలకు వ్యతిరేకంగా, అక్కడి శ్రామిక ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్వహించాల్సి ఉంది. ఈ సమస్యలు కేవలం నిర్మాణ, రాజకీయ సమస్యలేగాక అంతకంటే భిన్నతలానికి చెందిన సైద్ధాంతిక సమస్యలు కూడా. వాటిని ఎట్లా గుర్తిస్తారు? ఎలా ఎదుర్కొంటారు?

ఈ గోదాము చిన్నది కాదు.

అయితే హరిభూషణ్‌తో జరిపిన ఈ చిరు సంభాషణలోనే వాటన్నిటినీ ఎదుర్కోగల అంతర్‌దృష్టి వాళ్లకు ఆచరణ నుంచి ఏర్పడిందని నమ్మకం కలుగుతుంది. బలమైన ఆచరణ నుంచి కలిగిన విస్తృత అవగాహన ఇది.

ఒక రకంగా చెప్పాలంటే ఇది జ్ఞాన వికాసానికి సంబంధించిన మౌలిక విషయం. అత్యంత వెనుకబడిన సామాజిక సమూహంలో సాగుతున్న ఉద్యమంలో, ఆదివాసీలు జ్ఞానం పొందుతున్న క్రమం ఇది. మృత్యువు సరిహద్దు మీద నిలబడి చేస్తున్న ఉత్పత్తిదాయకమైన ఆచరణ ఇది.

బైట ఉన్న రచయితలు, మేధావులు ఈ ప్రయోగంపట్ల ఎందుకు తగినంతగా స్పందించడం లేదు ? అనే ప్రశ్న ఎంతో కాలంగా వేధిస్తున్నది. ముఖ్యంగా తెలుగు రచయితలకు, ఆలోచనాపరులకు ఎందుకు దండకారణ్య ప్రయోగమూ.. దానికి ఉన్న నిర్మాణం, యుద్ధం అనే రెండు ముఖాలు పట్టకుండా పోయాయి? అక్కడి నుంచి వస్తున్న సాహిత్యాన్ని ఎందుకు కనీసంగానైనా వీళ్లు పరిగణలోకి తీసుకోవడం లేదు? ఎందుకు ఇవేవీ స్ఫూర్తి కలిగించడం లేదు? అనే ప్రశ్నలు సహజంగానే దండకారణ్యంపట్ల అనురక్తి ఉన్నవాళ్లకు ఎదురవుతాయి.

ఈ ప్రశ్నల పొరలు విప్పుకుంటూపోతే ఇక్కడ జ్ఞాన వికాస క్రమం అనే ముఖ్యమైన తాత్విక సమస్య ఉందేమో అనిపిస్తుంది.

ప్రతివారిలోనూ జ్ఞానం రూపొందే భౌతిక క్రమం ఉంటుంది. సామాజిక పరివర్తన అనే ఆశయంతో ఆలోచిస్తూ, రాస్తూ, పనిచేసేవాళ్ల మధ్యనే ఈ జ్ఞాన వికాసం వేర్వేరు మార్గాల్లో జరుగుతూ ఉంటుంది.

ఒక రచయిత... ఏదో ఒక వృత్తి చేసుకుంటూ, జీవితాన్ని, సమాజాన్ని చూడటం వల్ల, పుస్తకాలు చదవడం వల్ల, రాయడం వల్ల జ్ఞానాన్ని పొందుతూ.. వినిమయం చేస్తుంటాడు. అదే విప్లవోద్యమంలో ఉండేవాళ్లకు నేరుగా ఆచరణ నుంచి మార్పు గురించిన

జ్ఞానం కలుగుతూ ఉంటుంది. అధ్యయనం, రచన వగైరా మార్గాలు దాన్ని మరింత సారవంతం చేస్తాయి. జ్ఞానానికి సంబంధించిన భౌతిక పునాది తెలిసిన వాళ్లెవరైనా తమ జ్ఞానాన్ని ఆ నిర్దిష్ట విషయంలో నేరుగా భౌతిక ఆచరణలో ఉన్న వారి జ్ఞానం మీద పరీక్షించుకుంటారు.

ఈ దృష్టి ఉంటే అక్కడ జరుగుతున్న ప్రయోగం జ్ఞానదాయకం అనే స్పృహ కలుగుతుంది. ఆర్ఎస్ రావుగారు తరచూ అంటుండేవారు. మావోయిస్టుల దగ్గర తుపాకులు ఉంటాయని తెలుస్తుందిగాని, వాళ్ల దగ్గర జ్ఞానం ఉందని చాలా మందికి తెలియదు. పోలీసులకు, పత్రికలకు తెలియకపోవడానికి తగిన కారణాలున్నాయి. కానీ సామాజిక సమస్యలకు పరిష్కారం వెతకాలని కోరుకొనే వాళ్లు కూడా మావోయిస్టుల తుపాకుల గురించి మాట్లాడుతూ ఉంటారేగాని, వాళ్ల దగ్గర ఉన్న జ్ఞానం గురించి మాట్లాడరు... అని.

వాళ్ల దగ్గర జ్ఞానం ఉందని, జ్ఞాన వికాసానికి కొన్ని భౌతిక షరతులు ఉంటాయని తెలియకపోవడం వల్ల, తెలిసినా పట్టింపు లేకపోవడం వల్ల అక్కడ జరుగుతున్న ప్రయోగం గురించి దగ్గరిగా మాట్లాడటం కష్టమైపోతున్నది.

అయితే ఇదంతా జ్ఞాన సంబంధమైనది.

ఆచరణ ద్వారా భౌతిక వాస్తవికత గురించి, అందులోని చలనం గురించి కలిగే ప్రతి జ్ఞాన శకలాన్ని సైద్ధాంతిక తలంలోకి ఎత్తిపట్టి.. మొత్తంలో భాగంగా, దీర్ఘకాల పరివర్తనా క్రమంలో భాగంగా ఎలా విశ్లేషించుకోవాలి? అనే సమస్య కూడా మార్క్సిస్టులకు అతి ముఖ్యమైనది.

ఎందుకంటే మార్క్సిస్టుల ఆచరణకు జ్ఞానతృష్ణ పరమావధి కాదు. సామాజిక పరివర్తన వారి ఆశయం. బూర్జువా వ్యవస్థ స్థానంలో కొత్త వ్యవస్థను నిర్మించడం వారి లక్ష్యం. అందువల్ల మార్క్సిస్టులు ఆచరణాత్మక సమస్యలో నుంచి సైద్ధాంతిక అన్వేషణ, సైద్ధాంతిక సమస్యల్లో నుంచి ఆచరణాత్మక ప్రయాణం సాగిస్తూ ఉంటారు.

అందువల్ల నిరంతరం తాము చేసే ప్రయోగం ముందు ఏం సవాళ్లు ఉన్నాయి? అవి వాటంతట అవి బైటపడి బద్దలయ్యేదాకా వేచి ఉండకుండా పటిష్టమైన సిద్ధాంత సంవిధానం వల్ల వాటిని ముందే పసిగట్టగల నేర్పు అబ్బుతుంది.

దండకారణ్య ప్రయోగంపై ఇవ్వాళ ఏకంగా అమెరికా మార్గదర్శకంలో భారత పాలకవర్గాలు చేస్తున్న ఈ యుద్ధాన్ని తిప్పికొడుతూనే – అక్కడి ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను, జనతన సర్కార్‌ను స్థానిక ఆర్థిక వ్యవస్థలో భాగంగా చూస్తే కొన్ని ఆసక్తి కరమైన విషయాలు తెలుస్తాయి.



అవి దూర భవిష్యత్తుకు సంబంధించినవనవే కావచ్చు. ఇప్పటికిప్పుడు ఆ ఉద్యమానికి, అక్కడ నిర్మాణమవుతున్న ప్రత్యామ్నాయానికి నేరుగా ఉపయోగపడకపోయినా, ఈ ఆచరణాత్మక అనుభవం నుంచి ఎన్ని ఆలోచనలు చేయడానికి అవకాశం ఉంటుందో చూపవచ్చు. ప్రయోజనం అనే గీటురాయి మీద దృఢంగా నిలబడే భవిష్యత్తులో ఆలోచించాల్సిన వాటిని చాలా ముందుగా, బైటికే ఆలోచిస్తున్నట్లు ఈ అభిప్రాయాలు పంచుకోవచ్చు.

జనతన సర్కార్, ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా నిర్వహణను అక్కడి ఉత్పత్తి వ్యవస్థలో నుంచి విశ్లేషించాల్సి ఉంది. దండకారణ్యంలో ప్రస్తుతం మనుగడ కోసం ఉత్పత్తి అనే విధానం కొనసాగుతున్నది. అందువల్ల ఉత్పత్తిని పెంచడంపై జనతన సర్కార్ మనసు పెట్టింది. వెనుకబడిన రాజకీయ ఆర్థిక వ్యవస్థ కావట్టి జనతన సర్కార్, అభివృద్ధి కార్యక్రమాలు నడవడానికి ఇప్పటికిప్పుడే స్థానిక ఎకానమీ మీద ఆధారపడే పరిస్థితి లేదు. అంత శక్తి ఇంకా అది సంతరించుకోలేదు.

అందుకే హరిభూషణ్ చెప్పినట్లు పార్టీ కొన్ని నిధులను సమకూర్చడం వల్ల జనతన సర్కార్ కమిటీలు కార్యకలాపాలు నడిపిస్తున్నాయి. జనతన సర్కార్ విభాగాల నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాల అమలు... ఇవి రెండూ ప్రస్తుతం బయటి నుంచి పార్టీ అందించే సాయం మీద ఆధారపడి ఉన్నాయి.

జనతన సర్కార్ నిర్వహణలోని విద్యా, వైద్యం వంటివి కనీస మానవావసరాలుగా, సేవారంగాలుగా కనిపించినా భవిష్యత్తులో అక్కడ నెలకొనాల్సిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు దోహదపడే నైపుణ్యాలున్న మానవులను అవి తయారు చేస్తాయి. నేరుగా వ్యవసాయ ఉత్పత్తికి దోహదపడే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కూడా ఇంకోవైపు తయారవుతున్నది. నేరుగా ఈ మాటలు ఉపయోగించి వివరించాల్సిన స్థాయిలో అక్కడి అభివృద్ధి ఇప్పుడే ఉండకపోవచ్చుగాని, దాని సారాంశాన్ని ఇట్లా విశ్లేషించుకోవడంలో తప్పేమీ కాదు.

ఇప్పటికి ఈ మొత్తం తయారుకావడానికి శ్రమశక్తి, సహజ వనరులు మినహా స్థానిక రాజకీయ ఆర్థిక వ్యవస్థ ఇంకా రూపొందలేదు. అభివృద్ధి కార్యక్రమాలను, ప్రభుత్వ నిర్వహణను స్థానిక ఎకానమి ప్రస్తుతం ఎంత వరకు ఆదుకోగలిగే స్థితిలో ఉంది? స్వావలంబన అనే ప్రాతిపదిక మీద నిర్మాణమవుతున్న రాజకీయార్థిక వ్యవస్థ ఈ స్థితిని భవిష్యత్తులోనైనా అధిగమించాల్సి ఉంటుంది. ఆచరణలో అది ఎలా సాధ్యమవుతుంది?

ఈ ప్రశ్నలే నిర్దిష్టంగా ఉద్యమ అవగాహనలో ఏ రూపంలో ఉన్నాయో తెలియకపోయినా ఒక దీర్ఘకాలిక ఆలోచన అయితే పుష్కలంగా ఉన్నది. ఉత్పత్తిని పెంచడం మీద జనతన సర్కార్ కేంద్రీకరించడం అందులో భాగమే. దీని కోసం ప్రత్యామ్నాయ

అభివృద్ధి పథకాలను విస్తృతంగా అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉత్పత్తిని పెంచడం చాలా ముఖ్యమైన విషయమే అయినా, దానితోపాటు వర్గపోరాట చైతన్యం ఇనుమడింప చేయడం, దానికి తగిన భౌతిక ఆవరణను సుస్థిరం చేయడం కూడా జనతన సర్కార్ కార్యకలాపాల్లో సమ ప్రాధాన్యంగా ఉన్నది.

అంటే– ఉత్పత్తిని పెంచడం, వర్గపోరాట చైతన్యం పెంచడం అనే రెండు ముఖ్యమైన అంశాల దగ్గర బయల్దేరారు. ఇది నమ్మకమైన ప్రారంభం. కావట్టి రాబోయే రోజుల్లో ఎదురయ్యే అన్ని ప్రశ్నలకు, సవాళ్లకు పరిష్కారం వెతకగలిగే దారిలో ఈ ప్రయోగం సాగుతున్నదనే విశ్వసనీయత అందులో ఉన్నది.

ఆదివాసీ సమాజానికి ఉన్న ప్రత్యేకత వల్ల ఉత్పత్తి పంపిణీలో మామూలుగా ఉండే ఇబ్బందులు ఏవీ లేనట్టుంది. హరిభూషణ్ చెప్పినట్లు దోపిడీ లేదు. ఇక ప్రజల మధ్య తెగ తాలూకూ సాంఘిక బంధనాలు, అసమానతలు మిగిలి ఉండే అవకాశం ఉంది. వాటిని ఎదుర్కోడానికి అవసరమైన జ్ఞానం నేరుగా ఉద్యమాచరణ ద్వారా ఆదివాసులకు అందుతున్నది. చదువు ద్వారా కూడా సంక్రమిస్తున్నది.

ఆదివాసీ సమాజాల్లో వైద్యాన్ని కూడా కేవలం శారీరక బాధల నివారణగా, మరణాల సంఖ్య తగ్గించడంగా మాత్రమే చూడటానికి లేదు. శరీరం చుట్టూ, చావు పుట్టకల చుట్టూ ఆవరించి ఉన్న అనేకానేక మార్మిక భావనలు, మూఢ విశ్వాసాలపై కూడా ఆధునిక వైద్యం ప్రభావం చూపుతుంది. అంటే ఒక రకమైన హేత తర్కం అలవడే అవకాశం ఉంది.

అది జీవన నాణ్యతను పెంచడానికేగాక ప్రకృతి, సమాజం, మానవ జీవితం గురించిన అవగాహన పెంచుతుంది. అందువల్ల సహజంగానే ఉత్పత్తి ప్రక్రియలో మరింత క్రియాశీలంగా, సృజనాత్మకంగా పాల్గొంటారు. తమ మధ్య ఉన్న తెగ విధించిన సాంఘిక బంధనాల మీద విమర్శనాత్మక వైఖరి ఏర్పడుతుంది.

అయితే ఐటీడీఏ చేపట్టిన అభివృద్ధి వల్ల... వాళ్లు చెప్పించే చదువు, వైద్యం వల్ల కూడా ఈ ప్రభావం ఉంటుందా? అనే ప్రశ్న తలెత్తుతుంది. ఎందుకు ఉండదు? ఎంతో కొంత ఉంటుంది. స్వీయ జీవన స్థితిగతుల గురించిన ఎరుక కొంచెం కలిగిస్తుంది. కానీ అధికార యంత్రాంగం స్వభావం వల్ల ఏ పని చేపట్టినా ఎట్లా ఉంటుందో నల్లమల చెంచులను ఉదాహరణగా తీసుకొని ఎంతైనా చెప్పవచ్చు. దండకారణ్య జనతన సర్కార్ చేపట్టిన విద్యా, వైద్య విధానం ఆదివాసుల్లో సామాజిక చైతన్యంగా, మార్పు దిశగా సాగే ఆచరణకు ఊతం ఇచ్చేదిగా పని చేస్తున్నది.

ఇక్కడ వర్గపోరాటానికి, పరివర్తనకు మార్క్సిజం ఆధునిక సిద్ధాంతం దార్శనికంగా



ఉంది. అందువల్ల దండకారణ్య సమాజంలో విప్లవ జనతన సర్కార్ కార్యకాలాపాలు ఆదివాసులను హేతుచింతన దిశగా నడిస్తున్నాయి. అందుకే హరిభూషణ్ వ్యవసాయం తర్వాత వైద్యం, విద్య తమ సర్కార్ ఎజెండాలో కీలకం అని చెప్పాడు.

**జులై 7, ఉదయం**

**మావోయిస్టుల విడిది**

తెలతెలవారుతుండగా అడవిలో మెలకువ.

ముదురు ఆకుపచ్చ రంగులో ప్రకృతిశోభాయమానంగా కనిపించింది.

కాస్త చలి చలిగా కూడా ఉంది. ముందు రోజు వర్షంలో తడిసిన శరీరం ఇంకా ఆరిపోయినట్లనిపించలేదు.

దారుణమైన అలసటలో కూడా రాత్రంతా కలత నిద్ర వెంటాడినందువల్ల బరువెక్కిన కన్నులు ఈ ప్రభాతోదయ కాంతిలో సేద తీరుతున్నట్లనిపించింది. రాత్రంతా కురిసిన వాన జల్లులకు చెట్ల సిగలు కూడా బరువెక్కినట్లు కనిపించాయి. గుడిసెలూ, చెట్లూ, విశాలమైన మైదానాలు..తడి తడిగా, వింతగా, అందంగా, చల్లగా కనిపించాయి.

రాత్రి కనిపించని గెరిల్లాలు మరింత చల్లగా నవ్వుతూ పలకరించారు.

ఎప్పటి నుంచో తెలిసినవాళ్లు ఇంటికి వచ్చినట్లు..

మొదట అనుమానం కలిగింది. నేనెలా తెలుసు? అని.

పది నిమిషాలయ్యాక అర్థమైంది. మనుషులు పలకరించుకోడానికి ఇక్కడ తెలిసి ఉండనవసరం లేదని.. పరిచయస్తులు కానవసరం లేదని. వాళ్లు మొదట మనల్ని మానవులుగా చూస్తున్నారనీ, అదీ ఎక్కడెక్కడి నుంచో బాసగూడా ఘటనలో దెబ్బతిన్నవాళ్లను పలకరించడానికి వచ్చినవాళ్లుగా చూస్తున్నారని తెలిసి వచ్చింది. ఎందుకంటే అందర్నీ అట్లాగే పలకరిస్తున్నారు. టాయిలెట్స్, నీళ్లు, టీలు.. వగైరా అవసరాలు చూసుకుంటున్నారు.

నలుగురైదుగురు గెరిల్లాలు పక్కన ఎక్కడి నుంచో నీళ్లు మోసుకొని వస్తున్నారు.

పక్కనే ఒక గుడిసె ముందున్న పొయ్యి మీద టీ కాగుతోంది.

కొద్ది మంది గెరిల్లాలు, మా మిత్రులు దాని దగ్గర సెగ కాచుకుంటున్నారు. పొగ దట్టంగా లేచి, గుడిసె చూరులోకి వెళ్లి అక్కడి నుంచి పలుచటి మేఘాల్లా గాలిలో కలిసిపోతోంది.

చూడ్డానికి భలే అనిపించింది.

అక్కడ ఉన్నవాళ్లలో ఎవరో గెరిల్లాలను అడిగారు.

'రాత్రంతా ఏదో దంచినట్లు శబ్దం వస్తుండె ..' అని.

'అదా.. గూడెం ఏదో పెళ్లి ఉన్నట్లుంది. లంద దంచారు.' అని ఓ కామ్రేడ్ చెప్పాడు.

'లంద.. అంటే..?'

బియ్యం బాగా నానపెట్టి దంచి పులియబెట్టి సారా చేస్తారు. దాన్ని లంద అంటారు. పెళ్లి వేడుకల్లో ఆదివాసులు లంద, ఇప్పసారా తాగుతారు. అమ్మాయి వాళ్లు అబ్బాయి వాళ్లు ఇచ్చిపుచ్చుకుంటారు. దానికి కూడా ఒక లెక్క ఉండేది. ఉద్యమం మొదలు కాక ముందు ఇరవై కుండలు అట్ల ఇవ్వాలనే రివాజు ఉండేది. దానికి చాలా ఖర్చు వచ్చేది. ఇప్పుడు అది బాగా తగ్గిపోయింది. ఆరు, ఎనిమిది అట్ల ఇచ్చుకుంటున్నారు..' అని ఆ గెరిల్లా చెప్పాడు.

అది వింటే ఎక్కడో మావో రచనల్లో చదివింది గుర్తువచ్చింది.

చైనాలో విముక్తి ప్రాంతాల్లో పెళ్లిళ్లకు, వేడుకలకు ఏఏ ఆహార పదార్థాలు పెట్టాలి? ఎంత ఖర్చు చేయాలి? అనే వాటి గురించి కూడా పార్టీ కొన్ని ఆలోచనలు చేసింది. విముక్తి ప్రాంతాల్లో, గెరిల్లా ప్రాంతాల్లో యుద్ధం, పునర్నిర్మాణం వంటి కర్తవ్యాలుంటాయి. కావట్టి ఖర్చు వీలైనంత తగ్గించుకోవాలని ఉద్దేశం.

...ఈలోగా ముఖాలు కడుక్కొని, బ్యాగులు సర్దుకుంటున్నవాళ్లను వెతికి వెతికి మరీ గెరిల్లాలు టీలు అందించారు. పది నిమిషాల్లో ట్రాక్టర్లు రడీ అయ్యాయి. చకచకా వెళ్లి ఎక్కి కూర్చున్నాం.

వాహనాలు కదులుతూ ఉంటే, ఓ గెరిల్లా అగమన్నట్లు దూరం నుంచే కేక వేస్తూ వచ్చాడు. అతడి వెనుకే ఓ ఆదివాసీ వృద్ధురాలు, ఓ చిన్నారి మెల్లగా నడుచుకుంటూ వచ్చారు.

ఆ కామ్రేడ్ దగ్గరిగా వచ్చి డ్రైవర్‌తో.. వాళ్లను ఎక్కించుకొని వెళ్లాలని, పక్క గూడెంలో దించాలని చెప్పాడు. వాళ్లిద్దరికీ వొంట్లో బాగాలేదనీ, ఆ గూడెంలో డాక్టర్లు, మందులూ వగైరా ఉన్నాయనీ, కాబట్టి వాళ్లను అక్కడ దించేసి వెళ్లాలనీ చెప్పాడు.

డాక్టర్లంటే.. అని ఎవరో అడిగారు.

మన మొబైల్ హాస్పెటల్ అక్కడికి వెళ్లింది.. అని ఆ ముసలామెను ఎక్కిస్తూ చెప్పాడు.

**బాసగూడా ప్రయాణం**

**ఉదయం 8 గంటలు**

వాహనాలు కదిలాయి.

వాతావరణం చూస్తోంటే – వాన.. చెట్ల మీదే ఉండి ఎప్పుడైనా కిందికి జారుతానని అన్నట్లు ఉంది. కొంచెం దూరం వెళ్లేసరికి ఓ పెద్ద కొండ అడ్డం వచ్చింది. దాన్ని దాటుకొని వెళ్లడం కష్టమే అనిపించింది. ఇక్కడ దిగాలా? అని అడిగితే, డ్రైవర్ ఎందుకూ?



అని గేర్ మార్చేసి కొండ పైకి నడిపించాడు. నిజంగానే భయమేసింది. ట్రాక్టర్ ఎక్కడమే అరుదు. అందునా ఈ నిటారు కొండ మీద..! మొదట డుర్ర్.. డుర్ర్‌మన్నా అలవోకగా వాహనాలు కొండ ఎక్కేశాయి. ముందున్న ట్రాక్టర్ వెళ్లాక.. వెనుక వైపు నుంచి చూస్తే కొండకు వేలాడదీసినట్లు కనిపించింది. అదే కిందికి దిగుతున్నప్పుడు పాము జరజర కిందికి జారిపోయినట్లు కనిపించింది.

పొద్దున ఏడుగంటలకల్లా బయల్దేరితే పన్నెండు గంటల దాకా ప్రయాణం సాగింది. దారి పొడవునా అనేక గూడేలు. ప్రతి గూడేనికి మొదట్లో ఒక చెక్‌పోస్టు ఉంది. అక్కడ ఉన్న సాయుధ గెరిల్లా వదిలిపెడితేనే వాహనాలు అవతలికి దాటుకుంటాయి.

దారి పొడవునా పొలాలు దున్నుతూ ఆదివాసీ రైతులు కనిపించారు. కనీసం మూడు నాలుగు చోట్ల మహిళలు నాగలిపట్టి ఎద్దులను అదిలిస్తూ పొలం దున్నుతోంటే వెనుక మగవాళ్లు సాయం చేస్తున్న దృశ్యం కనిపించింది.

మా మిత్రులు ఆ సన్నివేశాన్ని ఫొటోలు తీశారు.

వీడియోల్లోకి ఎక్కించారు.

ఇప్పటికీ గ్రామాల్లో కూడా మహిళలు వ్యవసాయంలో అనుబంధ పనులు మాత్రమే చేస్తుంటారు. నాగలిపట్టి దున్నడం ప్రధానంగా మగవాళ్ల 'ధర్మం'. ఆదివాసీ మహిళలపట్ల ఇలాంటి వివక్ష మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. కానీ విప్లవోద్యమం మొదలయ్యాక జరిగిన అనేక సాంఘిక మార్పుల పర్యవసానంగా స్త్రీలు ఉత్పత్తిలో నేరుగా భాగమయ్యే అవకావం కలిగింది.

విప్లవోద్యమం ప్రారంభం నుంచి మహిళలను ఉద్యమంలోకి సమీకరించడం వల్ల, వారి సాంఘిక బంధనాల మీద పోరాటం చేపట్టడం వల్ల ఈ మార్పు సాధ్యమైంది.

భారతదేశంలో, ఆంధ్రప్రదేశ్‌లో చాలా మహిళా సంఘాలు ఉండవచ్చు. వాటి ఆధ్వర్యంలో ఉద్యమాలు కూడా జరుగుతున్నాయి. కానీ దండకారణ్య ఆదివాసీ క్రాంతికారీ మహిళా సంఘంలో ఉన్నంత సభ్యత్వం బహుశా అఖిల భారత మహిళా సంఘాల్లో కూడా ఉండదేమో అని అక్కడి నుంచి వచ్చే నివేదికలు చదివినప్పుడు అనిపిస్తుంది. సంఖ్యాపరంగా ఉన్నా కూడా.. దండకారణ్యంలో వలె మిలిటెంట్ మహిళా ఉద్యమం మరెక్కడా ఉండకపోవచ్చు.  ఒక పెద్ద సాయుధ పోరాటంలో మహిళలు ఇంత పెద్ద ఎత్తున దేశంలో పాల్గొంటున్న దాఖలాలు లేనట్టే. విప్లవోద్యమ రాజకీయ కర్తవ్యాల కోసం పాటుపడటమేకాక, మహిళల సాంఘిక విముక్తిని సుసాధ్యం చేస్తున్న ఉద్యమం కూడా అదే.

దండకారణ్యంలో ఎంత పెద్ద ఎత్తున సాంఘిక పోరాటాలు జరగకపోతే ఆదివాసీ

మహిళలు తుపాకీపట్టి మగవాళ్లతో సమానంగా పోరాడటం సాధ్యమవుతుంది? ఆకాశంలో సగం అనే మాట దండకారణ్యంలో ఒక్కోచోట సగానికంటే ఎక్కువ అని రుజువు అవుతోంది.

రాజకీయ నిర్మాణాల్లో, ఉద్యమాల్లో సాధించిన ఈ ప్రగతి ఆదివాసీ సాధారణ జీవితంలో, వారి ఉత్పత్తిదాయకమైన రోజువారీ కార్యకలాపాల్లో కూడా ప్రతిఫలిస్తోంది. సాంఘిక విముక్తికి సంబంధించిన అతి కీలకమైన ప్రక్రియలో మావోయిస్టుల నాయకత్వంలో ఆదివాసీ మహిళలు భాగమయ్యారు.

సాంఘిక అస్తిత్వం గురించి వెలుగులోకి వచ్చిన అన్ని సిద్ధాంతాలను ఆకళింపు చేసుకుంటూనే, సాంఘిక అస్తిత్వాలకు ప్రత్యేకమైన చరిత్ర ఉంటుందని, అస్తిత్వ బంధనాల్లో నుంచి విడుదల కావడానికి చాలా పెద్ద పోరాటం చేయాల్సి ఉంటుందని ఆదివాసీ మహిళలు నిరూపిస్తున్నారు.

సాంఘిక అస్తిత్వం, ఆర్థిక వ్యవస్థ గాఢంగా పెనవేసుకొని ఉండే ఆదివాసీ సమాజంలో అస్తిత్వ బంధనాలు తెంచకపోతే ఉత్పత్తి వ్యవస్థ వేగం పుంజుకోదని కూడా దండకారణ్యమే చాటి చెప్తోంది. మార్క్సిస్టులు సాంఘిక అస్తిత్వాలను పట్టించుకోరనే వాదనను దండకారణ్య మహిళా ఉద్యమాన్ని చూశాకైనా మార్చుకోవాలి.

అట్లని మార్క్సిస్టుల దగ్గర అస్తిత్వ విముక్తికి సంబంధించిన సమగ్ర సిద్ధాంతం ఉందని, మరే అధ్యయనాలు అక్కర్లేదని భ్రమపడాల్సిన పని కూడా లేదు. ముఖ్యంగా చారిత్రక భౌతికవాదం అనే సాధారణ సామాజిక సిద్ధాంతం నుంచి ఆర్థిక వ్యవస్థల చరిత్రను విశ్లేషించినట్లే, సాంఘిక వ్యవస్థల విశ్లేషణను ఇంకా చాలా అభివృద్ధి చేయాల్సి ఉంది.

ఆ పని పూర్తిగా సిద్ధాంతరంగానికి చెందిన పని.

దానికి అవసరమైన చాలా అవగాహనను, ఆచరణ వెలుగునూ దండకారణ్యం ద్వారా పొందవచ్చు. అంటే అన్ని రకాల ఆలోచనాపరులను... మార్క్సిస్టులతోసహా.. తమ నిశ్చిత నిశ్చయాలను తరచి చూసుకోమని దండకారణ్యం ఉద్బోధిస్తోంది. ఆ పని ఇతరులకు సాధ్యమవునో లేదో తెలియదుగాని, మార్క్సిస్టులకు తప్పనిసరి... సులభ సాధ్యం కూడా. దండకారణ్య ప్రయోగం ద్వారా వారి పని సులువు అవుతుంది. కావాల్సిందల్లా మార్క్సిస్టు సంవిధానంపట్ల ఉండాల్సిన శాస్త్రీయ వైఖరి, కచ్చితత్వం.

.. మేం పాకేల గ్రామం దాకా వెళ్లాం. అక్కడి నుంచి రాజుపెంట, కొత్త గూడెం, సార్కిన్‌గూడాకు నడక ప్రారంభించాం.

అక్కడి నుంచి మాకు దారి చూపించడానికి ఓ ఆదివాసీ కుర్రాడు తోడయ్యాడు. ఆ



కాలి బాటలో ఉన్న చిన్న చిన్న నీటి గుంతను, దారికి అడ్డంగా వచ్చిన చెట్లను అతను జింక పిల్లలా దాటుకుంటూ పోతోంటే అనుసరించడం కష్టమైపోయింది.

అతను దారి పొడవునా మాట్లాడుతూనే ఉన్నాడు. వెనుక ఉన్న వాళ్లకు వినిపించడం లేదోమోనని మధ్య మధ్యలో వెనక్కి తల తిప్పి చెప్పుకుంటూ పోతున్నాడు.

అతను ఒక ఆసక్తికమైన విషయం చెప్పాడు.

నిన్నటి రోజున సీఆర్పీఎఫ్ పోలీసులు గొడుగులు, లుంగీలు, అంగీలు తీసుకొని పాకేలకు వచ్చి తీసుకోమని గ్రామస్థులను అడిగారట. కానీ వాళ్లు మాకు ఇట్లాంటివేం వద్దు అని చెప్పి పంపిచేశారట.

మేం పాకేలలో దిగగానే అక్కడ కొన్ని ఇండ్లు తగలబడి, కూలిపోయి కనిపించాయి. వాటి గురించి అతడ్ని అడిగితే.. సాల్వాజుడుం వాళ్లు తగలబెట్టారని చెప్పాడు. ఆ సంగతి చెప్తూ.. అవిగో వాటిని కూడా తగలపెట్టారు అని మేం నడుస్తున్న కాలిబాటకు మరో వైపున ఇళ్లను చూపించాడు.

ఇది ఏ ఊరు? అని మా మిత్రుడు అడిగితే..

ఇది కొత్తగూడెం.. అదిగో ఆ కనిపించే ఇళ్లు సరుగ్గూడేనివి అని చెప్పాడు.

ఇక్కడ ఉన్న ఇండ్లను తగలపెట్టాక చాలా మంది వలస వెళ్లిపోయారు. కొంత మంది అవతలి దిక్కుకు వెళ్లి కొత్తగా ఇళ్లు వేసుకున్నారు. పెద్ద గూడేలు ఇట్లా చిన్న గూడేలుగా మారిపోయాయి.

అక్కడ తగలబడిపోయిన ఓ పాఠశాలను కూడా చూపించాడు.

అడవిలోని ఆ దారి దాటుతూ ఉన్నప్పుడే దూరంగా ఉన్న సార్కిన్‌గూడా ఇళ్లు కనిపించాయి. అక్కడక్కడ విసిరేసినట్లుండే ఆ ఇళ్లను చూస్తూ పోతూ ఉంటే సీఆర్పీఎఫ్ జవాన్లు చెట్ల గుబురుల్లోంచి తుపాకులతో ఒక్కసారిగా బైటికి రావడం, మమ్మల్ని చూసి అలర్ట్ కావడం ఒకేసారి జరిగాయి. మేం నాలుగడుగులు ముందుకు వేశాక ఏమనుకున్నారోగాని మామూలయ్యారు.

రోడ్డు దాటి ఆ వైపు ఉన్న గూడేల్లోకి వెళ్లాం.

మేం ఫలానా అని చెప్పాక, చనిపోయినవాళ్లలో ఒకరి ఇల్లు ఇక్కడే ఉందని దారి చూపారు. ఆ ఇంట్లో పదో రోజో ఏదో చేస్తున్నారు. చుట్టు గుడిసెలాంటి ఆ ఇంటి వసారాలో ఆడవాళ్లంతా వరుసగా కూచొని ఒక రకమైన దు:ఖపు పాట ఏదో పాడుతూ ఉన్నారు. మట్టితో కట్టిన ఆ ఇంటి వాకిలి ముందు రెండు ప్రమిదలు వెలుగుతున్నాయి.

మహిళలు వాటి ముందు కూచొని సామూహిక విషాదగీతాన్ని పాడుతున్నారు. అందులో ఒక రకమైన తూగు.. వలయాలు వలయాలుగా విస్తరించే గుణం ఉన్నది.

అంతకంటే లోతైన దు:ఖపు భారతంత్రి మీద ఆ గానం వ్యక్తమవుతోంది.

వాకిలి దగ్గర తల బాగా వంచితేగాని గుడిసె లోపలి దృశ్యం అగుపించలేదు. బైట .. ఆ రోజటి ఇతర కార్యక్రమాలకు మగవాళ్లు ఏవో సన్నాహాలు చేస్తున్నారు.

ఒక నిమిషం నిలబడి ఆడవాళ్ల పాటను ఆలకిస్తే .. భాష ఏమీ తెలికపోయినా వాళ్ల గుండెల్లో పది రోజులుగా గూడు కట్టుకున్న విషాదాన్ని ఆ గానం బైటికి వొంపుతోందా? అనిపించింది.

**మీ జ్ఞాపకాలు మమ్మల్ని మెలిపెడుతున్నాయి**
**ఈ పాట పాడటం కంటే ఏం చేయగలం?**
**కన్నీళ్లు తుడుచుకుంటే తీరేదా? ఇది**
**ఈ విశాలమైన అడవిలో తోడేళ్ల మందలు ఎట్లా చొరబడ్డాయి**
**తండ్రులూ.. మీరు లేని ఈ ఖాళీ బతుకు ఎప్పటికి భర్తీ అయ్యేను...**

కంటికి మింటికి ఏక ధారగా ఆ తల్లులు ఏడుస్తూ, పాడుతూ.. పాడతూ, ఏడుస్తూ .. అదే లోకంగా ఉన్నారు. అప్పుడు వాళ్లు మరెవరినీ గమనించే స్థితిలో లేరు.

ఆ ఇంట్లో కోర్సా భీక్మ అనే ఇరవై రెండేళ్ల యువకుడ్ని చంపేశారు. అక్కడ అతడి ఫొటో పెట్టారు. తండ్రి పేరు కోర్స గుట్ట.

తండ్రి వచ్చి చెప్పడం మొదలు పెట్టాడు. ఎట్లా కాల్చేశారో, ఎట్లా ఎక్కడబడి చనిపోయాడో చెప్పాడు. ఆ పక్కనే ఉన్న మరో ఇంటి దగ్గరికి తీసికెళ్లి నేల మీద అరచేత్తో తాటిస్తూ ఇక్కడే చంపేశారు.. అని చెప్పాడు.

హైదరాబాదు దగ్గర బోర్‌వెల్ కంపెనీలో పని చేసుకొని బతికే కొడుకు తల్లిదండ్రులను చూడటానికి సార్కిన్‌గూడా వచ్చాడు. కాల్పులు జరిగిన మర్నాడు తెల్లవారుజామున ఇంటి మీదపడి లోపల పడుకున్న కొడుకును బైటికిలాగి కాల్చేశారు. అప్పటికీ చనిపోలేదని, ఇంట్లోకి వెళ్లి గొడ్డలి తెచ్చి వాకిట్లోనే నరికేశారు.

....అప్పటికే అనేక మంది గుంపయ్యారు.

**అచ్చంగా ఆ అడవి గర్భంలోంచి పుట్టుకొచ్చిన బిడ్డల్లా ఉన్నారు**
**ఒక్క పలకరింపుకే దు:ఖపు వెల్లువయ్యేలా ఉన్నారు**
**ముట్టుకుంటే కన్నీరై కరిగిపోయేలా ఉన్నారు**
**నిక్కముగా అడవి శతాబ్దాల కానుపుకాచిన పిల్లల్లా ఉన్నారు**

... కాల్పులు ఎక్కడ జరిగాయని అడిగితే అదిగో అక్కడా.. అంటూ దారి తీశారు. పేరుకే మూడు గ్రామాలు.. బహుశా సాల్వాజుడుం దాడులకు పూర్వం వేర్వేరుగా ఉండేవి కావచ్చు. ఇప్పుడు దాదాపుగా అటు ఇటూగా ఇళ్లు కట్టుకున్నారు. వాటి మధ్య విశాలమైన



మైదానంలో మిట్ట మీదికి తీసికెళ్లారు.

మేం వెళ్లే సరికే అక్కడ చాలా మంది మహిళలు, పిల్లలు, యువకులు ఉన్నారు.

పది రోజులవుతున్నా.. తమ వాళ్ల కోసం వారి మనసులు అక్కడే తచ్చాడుతున్నట్లుంది. పదేళ్లలోపు పిల్లల్ను కోల్పోయిన తల్లుల వ్యథ అంతా ఇంత కాదు. ఎండ కాస్తూ ఉంటే సరిగ్గా సూర్యుడు నడినెత్తిన ఉండాల్సింది.

కానీ ముసురు పట్టింది. వాన తుంపర కూడా లేదుగాని, అక్కడి విషాదాన్ని ఆ దట్టమైన మేఘావృత వాతావరణం మరింత గాఢతరం చేసింది.

మేమేమీ అడగనవసరం లేకుండా చెప్పడం మొదలు పెట్టారు.

చెప్పడమంటే.. దాచుకున్నా దాగని దు:ఖాన్నంతా పెళ్లగించి, లోలోపలిదంతా ప్రకటించడం కదా? మాటలా? వొట్టి మాటలైతే కథనంలాగా చెప్పవచ్చు. చెప్పేవారూ.. వినేవారూ.. ఉంటారు.

కానీ ఇలాంటివి కష్టం! అందరూ ఒక్కటైపోయే దు:ఖస్థితి. అయినా చెప్తున్నారు.. కన్నీళ్లను.. మాటలను ఒడిసిపట్టుకుంటూ చెప్తున్నారు.

కాసేపయితేగాని ఆ ఉద్ధృతి తీరలేదు.

కానీ అప్పటికే ఏదో ఖాళీ అయినట్టూ, భారమైనట్టూ.. ఒక రకమైన దుస్థితి. కాసేపటికి పలుచగా ఎండ వచ్చింది.

మేమూ బృందాలుగా విడిపోయి ఆ మిట్ట మీద అక్కడక్కడా నిలబడి, కూచొని మరిన్ని వివరాల కోసం మాట్లాడ్డం మొదలు పెట్టాం.

'మీరు దేని కోసం మీటింగు పెట్టుకున్నారు?' అని అడిగితే.. ఒక యువకుడు చెప్పుకొచ్చాడు.

'భూములు ఉన్నోళ్లు , లేనోళ్లు ఉంటరు గదా? .. అందుకని'

'భూములు కొందరికి ఎందుకు లేవు?'

'జుడుం దాడి చేసినప్పుడు కొందరు ఇక్కడ ఉండలేక వెళ్లిపోయారు. ఇప్పటికీ అక్కడే కొందరు ఉన్నారు. ఈ మధ్య చాలా మంది తిరిగి వచ్చారు. వాళ్లకు భూములు పంచాలి గదా? కొద్ది మంది చనిపోయారు. కొన్ని కొత్త కుటుంబాలు ఏర్పడ్డాయి. అందరికీ భూములు చూపించడానికి మీటింగు పెట్టుకున్నాం'

'ఎన్ని గంటలప్పుడు ఇది జరిగింది?'

'చీకటి పడ్డాక మేం కూడుకున్నాం. ఒక గంట సేపు మాట్లాడుకున్నామేమో.. భూములు గురించి అయ్యాక, పశువుల సమస్య గురించి మాట్లాడుకున్నాం. ఎందుకుంటే కొందరికి పశువులు లేవు. వానలు పడుతున్నాయి కాబట్టి ఎప్పుడు దున్నకాలు మొదలు

పెట్టాలి.. అనేది మాట్లాడుకుంటున్నాం.. అంతే.. నాలుగు దిక్కుల నుంచి తూటాలు వచ్చాయి. మొదట పడమర దిక్కు నుంచి దూసుకొచ్చి ఇట్ల కూచొని మాట్లాడుతున్న ముగ్గురు అట్లనే ఒరిగిపోయారు. ఆ దెబ్బకు అందరం కకావికలం అయిపోయాం. ఎక్కడి నుంచి కాల్పులు జరుగుతున్నాయో అర్థం కాలేదు. అంతా గందరగోళం. ఎక్కడి వాళ్లక్కడే లేచి పరుగులు తీశాం. ఈసారి అన్ని దిక్కుల నుంచి కాల్పులు మొదలయ్యాయి. అరుపులు, కేకలు, ఏడుపులు ... అంతా బీభత్సంగా తయారైంది. పారిపోతున్న వాళ్ల మీద కూడా తూటాలు పడ్డాయి.

అట్ల కాల్చుకుంటూ నాలుగు దిక్కుల నుంచి దగ్గరికి వచ్చారు. ఇక్కడికి వచ్చాక కూడా తుపాకులు కాల్చారు. మేం అరవై డెబ్బై మందిమి ఉంటే వాళ్లు వందల మంది ఉన్నారు. కాల్పులకు పదిహేను మంది ఇక్కడే పడిపోయారు. ఇదుగో ఇక్కడ ఒకాయన.. అక్కడ ఒక పిల్లోడు.. అక్కడ.. అక్కడా.. ప్రాణం పోని వాళ్లను దగ్గరిగా కాల్చి చంపారు. కొందర్ని పొడిచి చంపేశారు. పారిపోతున్నవాళ్లను పట్టుకొని కాల్చేశారు. అరగంటలో ఈ ప్రాంతమంతా పోలీసులు తమ స్వాధీనంలోకి తీసుకున్నారు.

... సరిగ్గా యుద్ధరంగంలో చెల్లాచెదరుగా శవాలు పడిపోయినట్లు.. ఆ యువకుడు చెమర్చిన కన్నులతో వేలు పెట్ట చూపిస్తూ ఎక్కడెక్కడ ఎవరు శవమై పడిపోయిందీ చెప్పుకొచ్చాడు.

చనిపోయిన వాళ్లలో ఆరుగురు పిల్లలు కూడా ఉన్నారు. వాళ్లలో బడికి వెళ్లి చదువుకుంటున్న వాళ్లు కూడా ఉన్నారు.

పన్నెండేళ్ల కాకా సరస్వతి కూడా చనిపోయింది. ఈమె తండ్రి రామ. వాళ్లది కొత్తగూడా. ఆ తల్లి కూతురు రంగులో ఫొటో గుండెల్లో దాచుకొని కుమిలి కుమిలి ఏడుస్తోంది. చూడ ముచ్చటైన అడవి పిల్ల..! పెద్ద వాళ్లు మాట్లాడుకోడానికి కూచుంటే తనూ అక్కడికి వచ్చేసింది. ఒక్కసారిగా కాల్పులు మొదలవ్వగానే భయపడి పరుగులు తీసింది. కానీ తూటా వెంటాడింది. అక్కడికక్కడే నేలరాలింది.

బాసగూడా బళ్లో పదో తరగతి చదువుతున్న పదహారేళ్ల కాకా రాహుల్ .. తండ్రి నారాయణ.., మడకం రాంవిలాస్.. తండ్రి ఇచ్చయ్య..కూడా అక్కడికక్కడే చనిపోయారు. వీళ్లిద్దరూ హాస్టల్లో ఉండి చదువుకుంటున్నారు. వేసవి సెలవులకు ఇంటికి వచ్చారు. మడకం ముత్తయ్య కొడుకు దిలీప్ కూడా పదహారేళ్లవాడే. పామేడు బళ్లో ఎనిమిదో తరగతి దాకా చదివాడు. ఇప్పుడు ఇంటి దగ్గరే ఉంటూ వ్యవసాయ పనుల్లో తండ్రికి సాయం చేస్తున్నాడు. దిలీప్ కూడా సీఆర్పీఎఫ్ తూటాలకు బలయ్యాడు.

వీళ్లందరూ కొత్తగూడా వాళ్లు.



సార్కిన్‌గూడాకు చెందిన సుఖరాం కొడుకు అప్కమెటు కూడా పదహారేళ్ల వాడే. వ్యవసాయ పనులు చేస్తుంటాడు. అక్కడికక్కడే చనిపోయాడు. ఇర్ప సురేష్ అనే కుర్రాడికి పదిహేనేళ్లు ఉంటాయేమో. ఐదో తరగతి దాకా చదువుకున్నాడు. కాల్పుల్లో గాయపడ్డ ఈ పిల్లాడ్ని పోలీసులు ఠాణాకు తీసుకపోయారు. అక్కడి నుంచి బీజాపూర్ ఆస్పత్రిలో చేర్చారు. 29వ తేదీన అక్కడే చనిపోయాడు.

ఈ పిల్లవాడిది కొత్తగూడా.

ఈ పిల్లలతోపాటు 25 ఏళ్ల ఇర్పా దినేష్, ఇర్ప రమేష్ అనే అన్నదమ్ములు; మడకం సురేష్, మడకం నగేష్ అనే అన్నదమ్ములు చనిపోయారు. రమేష్ కాల్పులు మొదలు కాగానే తప్పించుకొని ఇంటికి వెళ్లాడు. ఆ రాత్రి అంతా జరిగిన విధ్వంసాన్ని తలుచుకుంటూ ఇంట్లోనే ఉండి మర్నాటి పొద్దున ఏం జరిగిందో తెలుసుకోడానికి బైటికి వచ్చాడు. అప్పటికీ ఆ ప్రాంతాన్నంతా ఆధీనంలో ఉంచుకున్న పోలీసులు గుండ్లు కురిపించి అతడ్ని చంపేశారు. నగేష్ మంచి కళాకారుడని, ఆదివాసీ ఉత్సవాల్లో డోలక్ వాయించి ఉర్రూతలూగిస్తాడని ప్రత్యేకంగా చెప్పారు.

32 ఏళ్ల కాకా సమ్మయ్య, నలభైఏళ్ల ఇర్ప ధర్మయ్య చనిపోయారు. రాజుపెంటకు చెందిన నలుగురు పిల్లల తండ్రి ఇర్ప నారాయణ, సార్కిన్‌గూడా గ్రామస్థులు సర్కె రామన్న, కుంజ మల్ల, ఐతు మడావి కూడా చనిపోయారు.

తూటాలతో గాయపడి తప్పించుకోడానికి ప్రయత్నించినవాళ్లలో కొందరిని దగ్గరిగా కాల్చి చంపితే, మరికొందర్ని ఇతరులు చూస్తుండగానే గొడ్డళ్లతో నరికి చంపేశారు.

అంతటితో ఆగకుండా పోలీసుల తమ సహజ నైజంతో ఇళ్ల మీదపడి లూటీ చేశారు. ఇర్ప రమేష్ ఇంటోంచి ఐదు వేలు, రాజుపెంటలో ఇర్ప నారాయణ ఇంట్లోంచి ముప్పైవేలు, మడకం నగేష్ ఇంట్లోంచి రెండు వేలు ఎత్తుకపోయారు.

వీళ్లుగాక మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. కాకా రమేష్, కాకా పార్వతి, ఇర్పా చిన్నక్క, అబ్కాచోటు అనే పిల్లలూ, కాకా సెంటి అనే పందొమ్మిదేళ్ల కుర్రాడు, మడకం సోమయ్య గాయపడ్డారు.

వీరిని పోలీసులు జీజాపూర్, జగదల్‌పూర్ ఆస్పత్రులకు తీసికెళ్లారు. ఇర్పా మున్నా, సర్కాపుల్లయ్య అనేవాళ్లు తీవ్రంగా గాయపడ్డంతో వాళ్లను ఆస్పత్రికి కూడా తీసుకపోలేదు.

ఈ మూకుమ్మడి కాల్పుల్లో మేకలు, పశువులు కూడా చనిపోయాయని ఆదివాసులు చెప్పారు.

**మేఘాలు ముసురుకున్న ఆ రాత్రి**
**ఎన్నటికీ కోలుకోలేని దీర్ఘరాత్రి**

**బతుకుకూ, మరణానికీ మధ్య దూసుకొచ్చిన యుద్ధ క్షేత్రం**
**గాయాలు ఎక్కడయ్యాయో..**
**నెత్తురు ఎలా ప్రవహించిందో..**
**రాజ్యమెక్కడ రణరంగమైందో..**
**ఆ కాళరాత్రిలో కూడా అడవి పసిగట్టింది**
**కన్నీరే.. తప్పదు**
**కాని మరణమొక ఉత్తుంగ పోరాట తరంగం**

... సీఆర్పీఎఫ్ వాళ్లు ఆ రాత్రే పదిహేను శవాలను బాసగూడా తరలించారు. ఒక శవాన్ని ఉదయం తీసుకొని పోయారు. గాయపడ్డవాళ్లతోపాటు కొంత మందిని పోలీస్ స్టేషన్‌కు పిల్చుకొని పోయారు.

అరెస్టు చేసిన వాళ్ల విడుదల కోసం, శవాల కోసం బాసగూడా పోలీస్ స్టేషన్ ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వచ్చిందని చెప్పారు. సాయంత్రం అరెస్టు చేసినవాళ్లను వదిలేశారని, రాత్రి శవాలను ఇచ్చారని, ఒక శవం మావోయిస్టుదని చెప్పి ఇవ్వలేదని చెప్పారు.

దాన్ని వాళ్లే బాసగూడాలోనే పూడ్చేశారు.

మావోయిస్టులతో ఎన్‌కౌంటర్ జరిగిందని బుకాయించిన ఈ దుర్మార్గం ఆనవాళ్లు కూడా లోకానికి తెలియకూడదని హత్యాకాండ జరిగిన ప్రాంతంలోని రక్తంతో తడిసిన మట్టిని ఆ మర్నాడే వచ్చి పోలీసులు తవ్వుకొని పోయారు.

నేలలో తడిసిన రక్తం కనిపించకుండా చేయగలిగారేమోగాని, వాళ్ల గుండెల్లో పారుతున్న కన్నీటిని ఆపగలరా? కన్నీరంటే ఒట్టి ఏడుపే అయినవాళ్లకు కేవలమొక వలపోత మాత్రమే. కాని చైతన్యయుతంగా ఎంచుకున్న జీవన్మరణ పోరాటంలో ఈ ఏకపక్ష యుద్ధోన్మాదం వాళ్లను కేవల బాధితులుగానే మిగిల్చుతుందా?

ఇప్పటి మాట కాదు.. మనకు తెలిసే మూడు దశాబ్దాల కింద మొదలైన సంగరం ఇది. నిజానికి మేం ఇక్కడికి బయల్దేరుతున్నప్పుడే మావోయిస్టు నేతలు చెప్పినట్లు ఈ మూడు గ్రామాలు సాల్వాజుడుం దాడుల్లో బాగా దెబ్బతిని ఇప్పుడిప్పుడే పునర్నిర్మాణమవుతున్నాయి. ఒక రకంగా కాదు.. అన్ని రకాలుగా.

అక్కడ వాళ్ల ప్రజాసంఘాలు ఉన్నా.. ఇంకా జనతన సర్కార్ కమిటీలు ఏర్పడలేదు. సహకార పద్ధతిలో వ్యవసాయాన్నే కాదు.. అన్ని నిర్వహించుకుంటున్నారు. అంటే – జనతన సర్కార్‌కు బలహీన స్థావరం ఇది. అందుకే తెగించి ప్రభుత్వం దాడి చేసింది.



వలసవాదుల చేతి నుంచి అధికారం పొందిన ఈ దేశ బూర్జువా వర్గం కసికొద్దీ.. ఆదివాసులు నిర్మించుకుంటున్న ప్రత్యామ్నాయ ప్రభుత్వంపై చేసిన దాడి ఇది. అందుకే వాళ్లు హత్యానంతరమైనా మామూలుగా పాటించాలని మనం కోరుకొనే ఏ పద్ధతులూ పాటించలేదు.

బాసగూడా స్టేషన్లోనే మృతదేహాలకు పోస్టు మార్టం చేసినట్లు పోలీసు రికార్డుల్లో నమోదైంది. ఇదేమిటి? పోస్టుమార్టం జరగవలసింది.. హాస్పెటల్లో గదా? అని మనం విస్తుపోనవసరం లేదు. దేశమంతా వ్యవస్థ ఎట్లా నడుస్తోందో.. అంతకంటే ఇంకొంచెం దుర్మార్గంగా చత్తీస్‌ఘడ్‌లో నడుస్తోంది. అంతే తేడా.

పోలీస్ స్టేషన్లో పోస్టుమార్టం అనే మాట కాగితం మీద రాసుకోవడం తప్ప అసలు అలాంటిదేమీ జరగలేదని ప్రజలు చెప్పారు.

అంతా వింటుంటే – మనసంతా కకావికలం అయిపోయింది.

ఒక సభ మీద జరిగిన దాడి కదా ఇది..

ఆదివాసులు ఏం చేస్తారు?

ఆ రోజు అక్కడ సభ సజావుగా జరిగితే ఆదివాసులు తమ శక్తి మేరకు నేల సాగుచేసి పంటలు పండిస్తారు. తమలో పురివిప్పుతున్న కొత్త నైపుణ్యాలతో, పరంపరాగతమైన పాత సమిష్టి నుంచి.. కొత్త సహకారంతో, .. లేదా కొత్త సమిష్టితో ఉత్పత్తిని పెంచుకుంటారు. అంతే..! కానీ అది పాలకులకు నచ్చలేదు.

ఎందుకు నచ్చలేదో.. మనలో చాలా మందికి తెలియకపోవచ్చు కూడా. కానీ తనకు ఎందుకు ఈ వ్యవహారం నచ్చడంలేదో రాజ్యాన్ని నడుపుతున్న పాలకవర్గానికి తెలుసు. వాళ్ల తరపున రాజ్యం తన సైనిక విభాగాన్ని ఉసిగొల్పింది. రాజ్యానికి సంక్షేమ భావన కూడా ఉంటుందని భ్రమసేవారు తప్పక అర్థం చేసుకోవాల్సిన విషయం ఇది.

సంక్షేమ రాజ్యం తన పథకాల ద్వారా తాను చేపట్టే అభివృద్ధి కింద ప్రజలు దోసిలిపట్టి దాని ఫలాలను, విషఫలాలను తేడా చూడకుండా స్వీకరించాల్సిందే. కానీ దండకారణ్య ఆదివాసులు అట్లా చేతులుసాచే పని పెట్టుకోలేదు. వాళ్లు తమదైన అభివృద్ధి నమూనాను ఎంచుకున్నారు. దానికి అధికారం కూడా తప్పక కావాలని తెలుసుకున్నారు. దాన్నీ నిర్మించుకుంటున్నారు.

ఉత్పత్తి దేనికోసమంటే – నాలుగు మెతుకులు తిని పెళ్లాం బిడ్డలతో కాలక్షేపం చేయడానికి కాదు. వనరులు దేనికోసమంటే – మన పేరు మీద అంతో ఇంతో ఆస్తి నిలువ చేసుకోవడం కోసం కాదు. అంత వరకైతే పాలకులు సహించేవారేమో!

కానీ ఇప్పుడు దండకారణ్యంలోని ఉత్పత్తి ఇక ఎంత మాత్రం పొట్టుపోసుకోడానికి మాత్రమే కాదు. అదీ తప్పక అవసరమే. దాంతోపాటు తమకు అవసరమైన ఒక కొత్త సామాజిక వ్యవస్థను నిర్మించేపనిలో ఉన్నారు. దాని కోసం ఉత్పత్తిని పెంచాల్సి ఉన్నది.

ఆ పని ఉత్తుత్తి మాటలతో జరిగేది కాదు. శ్రమతో కూడా జరిగేది కాదు. రాజకీయాధికారం లేకుండా, దాన్ని సంపాదించుకోవాలనే స్పృహ లేకుండా సాధ్యం కాదు. దండకారణ్యంలోని ప్రత్యామ్నాయ అభివృద్ధిని, విప్లవ జనతన సర్కార్‌ను ఎంతగా కలిసి చూడగలిగితే అక్కడ నిర్మాణమవుతున్న కొత్త సామాజిక వ్యవస్థ అర్థం అవుతుంది.

పాలకులకు ఆ ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా మీద కోసం. జనతన సర్కార్ అంటే ద్వేషం. ఇవి రెండూ కలిసి నిర్మిస్తున్న అసలైన ఆధునిక సామాజిక వ్యవస్థ అంటే ఆగ్రహం.

అందుకే ఆ సభ మీద దాడి చేశారు.

శ్రీకాకుళ పోరాట కాలంలో ఊరేగింపు మీద జరిగిన దాడిలో కోరన్న మంగన్నలను కాల్చేశారు. ఆ ఘటనతోనే సాయుధ పోరాట ప్రకటన చేయాల్సి వచ్చింది. ఇంద్రవెల్లి సభ మీద దాడి చేసి మూకుమ్మడిగా చంపేశారు. ఈ రెండు ఘటనల్లో స్థానిక పెత్తందారీ వర్గం, రాష్ట్ర ప్రభుత్వం, పోలీసుల యంత్రాంగం మాత్రమే ఉన్నాయి. అది ప్రజారాజ్యం ఆశయాన్ని ప్రకటించుకొని, ఆ దిశగా అడుగులు వేస్తుండిన కాలం.

ఇప్పుడు ప్రజారాజ్యం బీజదశలో నిర్మాణమైంది.

అందుకే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం.. అమెరికా మార్గదర్శకంలో నడుపుతున్న యుద్ధంలో భాగంగా బాసగూడా ఆదివాసుల సమావేశంపై దాడి జరిగింది. విప్లవోద్యమం ప్రత్యామ్నాయ నిర్మాణం సాధించే దశకు ఎదగడం వల్ల దాడుల స్వరూపం, స్వభావం.. స్థాయి పూర్తిగా మారిపోయింది.

..వాళ్లలో ఈ దారుణ ఘటన మిగిల్చిన విషాదం ఇంకా పచ్చి పచ్చిగానే ఉంది. మాటల్లేని దు:ఖమొక్కటే మిగిలి ఉన్నట్లుంది. ఒక తల్లి అయితే.. చెప్తూ.. చెప్తూ దు:ఖాన్ని మోయలేక, ఆ పక్కనే ఉన్న కర్రల దడిని ఆసరా తీసుకుంటేగాని నిలబడలేకపోయింది. మాటల్లో తూచగలిగిన బరువు కాదు గదా? అయినా ఎందుకో వారిని మామూలు వ్యవహారంలోలాగా బాధితులు అనబుద్ధి కావడం లేదు.

నిజానికి వారి బాధను అర్థం చేసుకోవడం మాత్రమే సరిపోదు. ఆదివాసులు ఎలాంటి స్థితిలో ఉన్నారంటే – అలాంటి ఒక నైతిక వ్యక్తీకరణతో, మనో మమేకతతో మనం సరిపెట్టుకోడానికి వీల్లేని పోరాటంలో ఉన్నారు. సంఘీభావమంటే



సహానుభూతిపొందడం అనుకుంటే అది.. వారున్న స్థితికి సరిపోదు.

వాళ్లొక అతిపెద్ద పరివర్తనా క్రమంలో రక్తమోడుతూ నిలబడి ఉన్నారు. వాళ్లనూ, వాళ్లకు నాయకత్వం వహిస్తున్న మావోయిస్టుల వ్యూహాన్నీ దగ్గరిగా చూస్తే... ఇదేదో బైటి నుంచి వచ్చే సహానుభూతి మీద, నైతిక మద్దతు మీద నిర్వహిద్దామనుకొని చేపట్టిన యుద్ధం కాదని తెలిసిపోతుంది.

చరిత్రలో ఇంత వరకు ఆదివాసులు చేసిన పోరాటాలన్నీ పూర్తిగా వాళ్ల కోసం వాళ్లు చేసుకున్నవే. కానీ ఇప్పుడు చేస్తున్న పోరాటం అందరిదీ కాదగినది. అందరూ అందుకోవాల్సినది.

ఈ రెండు మాటలూ పరస్పర విరుద్ధంగా ఉన్నట్టనిపించవచ్చు. కానీ ఇవి దండకారణ్యం కేంద్రంగా సాగుతున్న విప్లవోద్యమ లక్షణాలు. ఆదివాసులు మొదట్లో మా గూడెం మీద మాదే అధికారం అని పోరాడారు. ఆ తర్వాత జల్ జంగల్ జమీన్ అని పోరాడారు. అవన్నీ ఆదివాసుల వర్తమాన, భవిష్యత్ పోరాటాలకేగాక.. అందరి పోరాటాలకూ గొప్ప ఉత్తేజాన్నీ, స్ఫూర్తినీ అందించేంత విశిష్టమైనవి.

కానీ వాటితో పోల్చుకుంటే ఇప్పటి పోరాటానిది పూర్తి వేరే స్వభావం. తెగ సాంఘిక అస్తిత్వం మీద నిలబడి, దాన్ని కాపాడుకోడానికి చేసిన పోరాటాలు అవి. ఈ పోరాటానికి పునాది తెగ అస్తిత్వం ప్రధానం కాదు. అత్యంత ప్రాచీన జీవన మూలాలున్న ఆదివాసులు కావడం వల్ల అది ఎంతో కొంత ఉండేదేకాని, వాళ్లను ఈ భీకర పోరాటంలోకి నడిపించి, నిలబెడుతున్నది మాత్రం వాళ్లు స్వీకరించిన ఆధునిక విప్లవ చైతన్యం.

అందుకేవాళ్లు మా గూడెం మీద మాదే అధికారం అనే దగ్గరి నుంచి రివల్యూషనరీ పీపుల్స్ కమిటీలు స్థాపించేదాకా ఎదిగారు.

జనతన సర్కార్ నిర్వహణ దగ్గరికి చేరుకున్నారు.

అందువల్ల వాళ్లను మామూలు అర్థంలో బాధితులు అనడం సబబు కాదేమో!

ఆ మాటలో ఒక ఓదార్పు ధ్వనించే ప్రమాదం ఉంది. ఆ పని చేయడంతో.. వారి దు:ఖాన్ని పంచుకోవడంతో మన పని అయిపోయిందనుకొనే ప్రమాదం ఉంది. ఇప్పుడు వాళ్లకూ, వాళ్లు నిర్మిస్తున్న జనతన సర్కార్‌కూ కావాల్సింది ఓదార్పు కాదు. మన మాటలతో, పలుకుతో, సంఘీభావంతో అక్కడ నిర్మాణమవుతున్న ప్రత్యామ్నాయ అభివృద్ధికి ఒక రక్షణ వలయం నిర్మించవలసి ఉంది.

వాళ్లలాంటి పోరాటమే మనమూ చేపట్టి మన దేశకాలాలకు అవసరమైన ప్రత్యామ్నాయాలు నిర్మించి శత్రువును కకావికలం చేసి.. ఆదివాసుల మీద సాగుతున్న

భీకర యుద్ధాన్ని దారి మళ్లించే రాజకీయార్థిక ప్రతి వ్యూహం మిగతా సమాజమంతా స్వీకరించాల్సి ఉన్నది.

ఇవన్నీ ఇప్పటికిప్పుడు చేయలేకపోయినా వాళ్ల యుద్ధ వ్యూహాన్ని అర్థం చేసుకొని అందులో మనకోసం మనమొక పాత్రను ఎంచుకోవాల్సి ఉన్నది. అది ఎంత మాత్రం ఓదార్పు, సహానుభూతి, నైతిక మద్దతు వంటివి కాకూడదు.

అంతకన్నా క్రియాశీలమైనది కావాలి...

వాళ్లతో మాట్లాడుతున్నంత సేపూ మనమేం చేయగలం? అనే ప్రశ్న వెంటాడుతూ వచ్చింది. వివరాలన్నీ తీసుకున్నాక మా బృందంలోని ఇద్దరు పెద్దలు వాళ్లందరినీ ఉద్దేశించి మాట్లాడారు. మేం ఎక్కడెక్కడి నుంచి ఇక్కడికి వచ్చిందీ.. చెప్పి ఈ దుర్మార్గాన్ని దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తామనీ, మీ పోరాటానికి బైట గట్టి సంఘీభావం బైట కూడగడతామనీ చెప్పారు. అది మా బాధ్యత అని కూడా అన్నారు.

వాళ్లతో మాట్లాడుతోంటే మా అందరికీ మరోసారి అర్థమైంది ఏమంటే.. మనం ఆదివాసులకు ప్రత్యేకంగా సందేశం ఇచ్చేదేమీ లేదనీ, వాళ్లే మనందరికీ ఒక గొప్ప సందేశం ఇస్తున్నారనీ.

దాన్ని మోసుకొని తిరుగు ప్రయాణమయ్యాం.

అంత దాకా రాని వర్షం తిరుగు దారిలో మళ్లీ తోడైంది.

అందువల్ల అడవిలో పొద్దువాలుతున్న దృశ్యం కనిపించలేదు.

అర్ధరాత్రికి అడవి దాటగలమని అనుకున్నాం. అది అత్యాసే అని కొద్ది దూరం పోయాక తెలిసింది. వర్షం విడతల వారీగా భారీగా కురుస్తోంది. తడవడమే తడవడం. చీకటి.. వర్షం కలగలసి బహుశా తొమ్మిది గంటలకల్లా ఉదయం బయల్దేరిన మావోయిస్టుల విడిది దగ్గరి చేరుకోగలిగాం.

మేం తిరిగి అక్కడి దాకా వచ్చి ఆగిపోతామని, అంతకంటే ముందుకు పోవడానికి వాతావరణం, సమయం.. రెండూ అనుకూలించవని మావోయిస్టు గెరిల్లాలకు ముందే తెలుసేమో! అందరికీ సరిపడ తిండి ఏర్పాట్లు చేసి పెట్టారు.

ఆ రాత్రి కొందరికి తడిసిన బట్టలు తప్ప మరో జత పొడి బట్టలు కూడా లేవు. నెగడు దగ్గర కూచొని, నిలబడి బట్టలు ఆరబెట్టుకోవాల్సింది. తలా ఇంత తిని బైట కురుస్తున్న వర్షానికి.. శరీరంలోని చలిని అనుభవిస్తూ ముడుక్కొనిపడుకున్నాం.



**జులై 8**

**మళ్లీ మావోయిస్టుల క్యాంపు..**

తెల్లారాక కూడా శరీరం చల్లని మంచుగడ్డలాగా తోచింది.

కొంచెం జ్వరపడ్డట్టనిపించింది. కొందరం ఆలస్యంగా లేచినా తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. వేడి వేడి టీ కూడా రడీ అయింది. కాలకృత్యాలు తీర్చుకొని హరిభూషణ్‌తో బాసగూడాలో తెలుసుకున్న విషయాలు కొన్ని ప్రస్తావించాను. నా మాటలు విన్నాక ఆయన బీజాపూర్‌లోని నిర్బంధంతోపాటు, ఖమ్మం జిల్లా నిర్బంధం గురించి కూడా చెప్పడం ప్రారంభించాడు.

ఖమ్మం జిల్లా భద్రాచలం డివిజన్‌లో పార్టీ నాయకత్వాన్ని దెబ్బతీయడానికి, సంఘనాయకత్వాన్ని డిస్టర్బ్ చేయడానికి జనవరి నుంచి ఇప్పటి వరకు అనేక మంది మీద అక్రమ కేసులు పెట్టారు. ఎందరినో అరెస్టు చేసి జెయిలుకు పంపించారు. భద్రాచలం, చర్ల, వెంకటాపురం, దుమ్ముగూడెం, వాజేడు, చింతూరు మండలాల్లోని గ్రామాలపై గ్రేహౌండ్స్ పోలీసులు అర్ధరాత్రులు దాడులు చేసి భయభ్రాంతుల గురి చేస్తున్నారు. అటవీ ఉత్పత్తులను సేకరించుకోడానికి వెళ్లినవాళ్లను అరెస్టు చేసి హింసిస్తున్నారు.

వారాంతపు సంతల్లో సరుకులు కొనుక్కోడానికి వెళ్తున్న వాళ్లను మిలీషియా సభ్యులని అరెస్టు చేసి వారాల తరబడి స్టేషన్లలో హింసిస్తున్నారు. కొందరి మీద బైండోవర్ కేసులు పెట్టి వదిలేస్తే మరికొందరిపై అక్రమ కేసులు పెట్టి జెయిళ్లపాలు చేస్తున్నారు.

ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక్కో గ్రామం నుంచి ఇద్దరిని, ముగ్గురిని స్టేషన్‌కు వచ్చి సంతకాలు పెట్టాలని నిర్బంధిస్తున్నారు. చర్ల మండలంలో 23 గ్రామాలపై దాడులు చేసి 125 మందిని అరెస్టు చేసి, 80 మందిపై బైండోవర్ కేసులు పెట్టారు. 35 మందిపై అక్రమ కేసులు బనాయించి జెయిలుకు పంపారు.

వెంకటాపురం మండలంలో 24 గ్రామాలపైన దాడులు చేసి 120 మందిని అరెస్టు చేసి, 88 మందిపై బైండోవర్ కేసులు పెట్టారు. 10 మంది మీద అక్రమ కేసులు పెట్టి జెయిలకు పంపించారు.

అయితే పోలీసుల దాడులు, అక్రమ కేసులు, దాడులకు ఆదివాసులు కేవలం భయభ్రాంతులు కావడమేకాదు, తీవ్రస్థాయిలో ప్రతిఘటిస్తున్నారు. ఆదివాసులను గ్రీన్‌హంట్ నిర్బంధం కొత్తకాదు. ఇది గతంతో పోల్చుకుంటే చాలా తీవ్రమైనదే. కానీ గత అనుభవాల నుంచి రాటుదేలి ప్రజా మిలీషియాగా ఎక్కడికక్కడ తయారవుతున్నారు.

ఇక్కడి అభివృద్ధి కార్యక్రమాలను, ఈ నిర్బంధాన్ని తెలుసుకోవాలంటే తప్పకుండా

1991-92లో పూర్వ బస్తర్‌లో మొదలైన జనజాగరణ్ అభియాన్ దగ్గరి నుంచి అర్థం చేసుకోవాల్సిందే. అది అంత వరకు కొనసాగిన నిర్బంధానికంటే చాలా తీవ్రమైనది. ఆదివాసీ పెత్తందార్లు, మహేంద్రకర్మ బృందం, సీఆర్పీఎఫ్ బలగాలు కలిసి ఆనాటి అణచివేత క్యాంపెయిన్ చేపట్టాయి.

దాన్ని తట్టుకొని ఆదివాసులు ఉద్యమాన్ని ముందుకు తీసికెళ్లారు. ఆదివాసీ ప్రాంతంలో స్పష్టంగా వర్గ విభజన మొదలైంది. తెగలోని ఆంతరంగిక సంఘర్షణగా కనిపిస్తుంది కానీ.. అది వర్గపోరాటం. పార్టీ నాయకత్వంలో ఆదివాసులు ఆ సంఘర్షణలో రాటుదేలారు. అందువల్లే 2005లో సాల్వాజుడుం మొదలయ్యాక పెద్ద ఎత్తున విధ్వంసం జరిగినా ఆదివాసులు గట్టిగా ప్రతిఘటించగలిగారు. అయినా ఈ ప్రాంతంలోని కొన్ని గూడేలను సర్వనాశనం చేశారు. విప్లవ ప్రజా సంఘాల నిర్మాణాలన్నీ డిస్టర్బ్ అయ్యాయి.

2009లో సైన్యం వస్తోందనే ప్రచారం మొదలైంది. గ్రీన్‌హంట్ మొదలయ్యాక నిజంగానే అంతకముందుకంటే అణచివేత తీవ్ర స్థాయిలోకి వెళ్లిపోయింది. ఉర్పులమెట్ల, తాడిమెట్ల తదితర దాడుల్లో పెద్ద ఎత్తున ఆదివాసులు పాల్గొని విజయం సాధించారు. ఈ దాడుల వల్ల యుద్ధంలో తట్టుకొని నిలబడగలమనే ధైర్యం వచ్చింది.

పెద్ద పెద్ద దాడులే కాకుండా తరచూ సీఆర్పీఎఫ్, నాగా బెటాలియన్లు, బీఎస్ఎఫ్ కమెండోస్ మీద ప్రజలు దాడులు చేస్తున్నారు. ఇందులో ఆదివాసీ మహిళల పాత్ర గణనీయంగా ఉంది. భూంకాల్ మిలీషియా ఆధ్వర్యంలో సాంప్రదాయక పద్ధతుల్లో గట్టిగా ప్రతిఘటిస్తున్నారు. ఈ ప్రతిఘటన నుంచే జనతన సర్కార్ కమిటీలను నిలబెట్టుకుంటూ బలోపేతం చేస్తున్నారు. ప్రతిఘటన మధ్యనే ఈ నిర్మాణం జరుగుతోంది.

దీన్ని దెబ్బతీయడానికే బాసగూడా దాడి..

ఆయన చెప్తుంటే.. చత్తీస్‌ఘడ్ నుంచి, బీజాపూర్ నుంచి సాల్వాజుడుం.. గ్రీన్‌హంట్ ఆపరేషన్ ఖమ్మం జిల్లా మీదుగా ఆంధ్రప్రదేశ్ చేరుకున్న జాడలు కనిపించాయి.

ఈలోగా మిలీషియాలోని కళాకారులు పాటలు మొదలు పెట్టారు. జనతన సర్కార్, యుద్ధం, ప్రత్యేక తెలంగాణ మీద పాటలు అందుకున్నారు. చూడ్డానికి చాలా చిన్నగా పిల్లల్లాగా కనిపిస్తున్నారు. పాట, తూటా సమానంగా ఉపయోగించగల నైపుణ్యం వాళ్లలో కనిపించింది. ఈ లోకాన్ని జయించగలమనే ఆత్మవిశ్వాసం వాళ్ల గొంతులో, కదలికలో, అభినయంలో .. అణువణువునా వ్యక్తమవుతోంది. ఆ ప్రశాంతమైన ఉదయం వారి పాటలు అక్కడంతా ప్రతిధ్వనించాయి.

సన్నగా వాన పిండిజల్లులాగా మొదలైంది.



పొద్దున్నే బయల్దేరాలనుకున్నా, ముసురు పట్టడం వల్ల టైం తెలియడం లేదుగాని, అప్పటికే ఎనిమిది గంటలైంది. ఈ ఉండి ఉండి కురుస్తున్న వానకు అడవి ఎంతగా నానిపోయిందో.. అంతగా జనతన సర్కార్ గురించి, యుద్ధం గురించి వింటుంటే మనసు, ఆలోచనలు కూడా ఆ విశేషాల్లో తడిసిపోతున్నట్లనిపించింది. అత్యంత వెనుకబడిన ఉత్పత్తి వ్యవస్థ ఉన్న ఆ అడవిలో రూపొందుతున్న విప్లవ ప్రత్యామ్నాయాన్ని .. అడుగడుగునా విధ్వంసం, శరవేగంతో కూడిన ఆర్థిక సాంస్కృతిక మార్పులు జరుగుతున్న బైటి సమాజం వైపు నుంచి చూస్తే ఎలా కనిపిస్తుంది? ఒక గొప్ప అద్భుతమని అనిపించవచ్చు.. ఈ అడవిని చుట్టుముడుతున్న పెట్టుబడి, సైన్యం, వ్యవస్థల బారి నుంచి ఈ ప్రయోగం ఎట్లా నిలదొక్కుకుంటుంది? అనే ఆసక్తి కలగవచ్చు. అట్లాగే.. ఇప్పటికి.. ఈ నాయకులే అంటున్నట్లు చాలా ప్రాథమిక దశలో ఉన్న ఈ ప్రయోగం తప్ప ఈ దేశంలో మరేదైనా ఒక చిరు ఆశ ఏమున్నది? అని కూడా అనిపించవచ్చు.

ఈ అద్భుతాన్ని చూస్తూ ఏ ప్రశ్నా తలెత్తకపోతే బహుశా రూప విభ్రాంతికి లోనైనట్టే. అది నిజానికి ఈ నూతన వ్యవస్థా నిర్మాణ ప్రయోగాన్ని దాని నిర్దిష్ట స్థల కాలాల్లో, దానికే ఉన్న ప్రత్యేక పరిస్థితుల్లో చూడలేనితనం అవుతుంది. దానిగా దానిగా చూడలేనప్పుడు దానికి అందించే చేయూతలో ఏ వెచ్చనిదనం ఉంటుంది? ఏ చారిత్రకత ఉంటుంది? సామాజిక చారిత్రక గాఢత లేనప్పుడు కేవల వలపోతగా మారిపోదా? ఇంత జీవన్మరణ పోరాటంలో ఉన్న అతి పెద్ద ఉద్యమానికి, ఉత్పత్తిదాయకమైన నిర్మాణ ప్రయత్నానికి ఇట్లాంటి అనుత్పాదక ఆలోచనలతో ఏం సంఘీభావం అందించగలం?

దండకారణ్య ఆదివాసులు బుద్ధిజీవుల ఆలోచనా సంస్కృతిని సైతం ప్రశ్నిస్తున్నారా? అనిపించింది. ఎందుకంటే – ఈ ఆచరణాత్మక ప్రయోగం ఆధారంగా భవిష్యత్తుకు అవసరమైన ఎంత లోతైన సైద్ధాంతిక సన్నాహాలు చేయాల్సి ఉంది. మార్క్సిజం, వర్గపోరాటం, ఒక కొత్త సమాజం.. గురించి గతంలో మాట్లాడటానికి ఎన్నడూ లేని ఒక గొప్ప సదవకాశం చరిత్ర ముందుకు తెచ్చింది.

ఇక దాన్ని చూసి, విని, చదివి.. బుద్ధిజీవులు విశ్లేషించుకోవడమే మిగిలి ఉంది. అట్లాగే రాబోయే రోజుల్లో దాని ముందుకు వచ్చే సవాళ్లను ఎలా పరిష్కరించుకోవాలో అధ్యయనం చేసి సూచించడమే మిగిలి ఉన్నది. మార్క్సిస్టులకు సంబంధించినంత వరకు ఏ విశ్లేషణ అయినా పాండిత్య ప్రదర్శన కోసం కాదు. ఆచరణయోగ్యమైన అవసరం.

అట్లాగే.. నిలువ నీరులాగా ఉన్న తెలుగు మేధో ప్రపంచం ముందు, సాహిత్యలోకం ముందు ఈ ఆదివాసీ ప్రయోగం, పోరాటం చాలా పెద్ద సవాళ్లను నిలిపాయి. కొత్తగా

ఆలోచించడానికి సుదూరం నుంచే దండకారణ్యం తెలుగు బుద్ధిజీవుల మేధో కవాటాలపై వెలుగు ప్రసరిస్తోంది. ఆ వెలుగు నుంచి శాస్త్రీయ ఆలోచనోత్తేజాన్ని అందుకుంటారా? లేదా? అనేది ఇప్పటికైతే కాలానికి వదిలేయాల్సిన ప్రశ్న మాత్రమే...

ప్రయాణానికి వాహనాలు రడీ అయ్యాయి.

క్యాంపులో ఉన్న గెరిల్లాలందరూ వరుసగా వీడ్కోలు పలకడానికి సిద్ధంగా ఉన్నారు. అప్పుడే ఆకాశంలోంచి ఓ వైపు నుంచి ఓరగా ఉదయపు వెలుగు విచ్చుకుంటోంది. అది విప్లవ గెరిల్లాల కన్నుల్లోకి, పెదవుల్లోకి నేరుగా ప్రతిఫలిస్తోంది. అందరూ అలా వరుసగా, సాయుధంగా నిలబడి వీడ్కోలుగా బృందగానం అందుకున్నారు. ఒక్కొక్కరే దృఢంగా చేయి కలుపుతోంటే.. ఏదో పెద్ద బాధ్యతను అప్పగిస్తున్నంత భారంగా తోచింది.

మేం వాహనాల్లోకి ఎక్కేంత వరకు ఆ పాట అట్లా సాగింది.

వాహనాలు కదిలి గూడెంలో రెండు మూడు మలుపులు తిరుగుతోంటే, ప్రతి మూల మలుపుమీదా సాయుధ గెరిల్లాలు కనిపించి చిరునవ్వుతో లాల్‌సలామ్ చెప్పారు. మేం కనుమరుగయ్యే వరకూ అలాగే పిడికిలెత్తి..